

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు fb.com/vaartha

PUBLISHED FROM GUNTUR, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, TADEPALLIGUDEM,SRIKAKULAM

9-10-2023 సోమవారం సంపుటి : 29 సంచిక : 250, పేజీలు : 12 వెల : 6.50


ఇంటర్ మార్కుల సర్టిఫికెట్ కోసం 'డిజిలాకర్' 2లో

అమెరికా నిధులతోనే ఇజ్రాయెల్‌పై దాడి! 9లో



ఆదివారం ఇజ్రాయెల్ వైమానికదాడిలో గాజాలో ధ్వంసమైన ఓ మసీదు 9లో

## ఇజ్రాయెల్ సరిహద్దుల్లో హోరాహోరీ

# వక్ఫ్ భూముల సమగ్ర సర్వే

## రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు అత్యంత ప్రాధాన్యం

### రూ. 75 కోట్లతో 5 గురుకుల పాఠశాలలు, 2 వసతి గృహాలు: సిఎం జగన్



**విజయవాడ,అక్టోబరు 8, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల ప్రయోజనాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి స్పష్టం చేసారు. మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.రాష్ట్రం వక్ఫ్ ఆస్తులను కాపాడే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. గత ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు.వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసే దిశలో వ్యవహరించిందన్నారు.మైనార్టీలను ఎంత మాత్రం పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం ఈ మూడేళ్లకాలంలో మైనార్టీలకు అండగా నిలిచిందన్నారు. అధికారులు వక్ఫ్ భూములపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. వక్ఫ్ ఆస్తుల సంరక్షణలో భాగంగా ఆయా భూముల చుట్టూ ప్రహరీ నిర్మించాలన్నారు.ఉపాధి హామీ పథకంద్వారా వీటి నిర్మాణం చేపట్టే విధంగా అధికారులు కార్యచరణను చేపట్టాలన్నారు.భూముల చుట్టూ ప్రహరీ నిర్మించిన తరువాత ఆయా చోట్ల హోంగార్డులను వాటి రక్షణ కోసం ఏర్పాటు చేయాలన్నారు.ఆయా భూములను ఏ మేరకు వాడుకోగలమనే విషయంపై అధ్యయనం చేయాలన్నారు.నిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు.ఉర్దూ అకాడమీని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలన్నారు.

అకాడమీలు ఎలా అభివృద్ధి చేయాలన్న దానిపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.షాదీఖానాల నిర్వాహణను మైనార్టీ శాఖకు బదిలీ చేయాలన్నారు. మైనార్టీ శాఖలో ఖాళీ పోస్టుల వివరాలను గురించి అధికారుల నుంచి సీఎం జగన్మోహనరెడ్డి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ ఆయా ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు.ఉద్యోగాల నియమాకానికి సంబంధించి ఆర్థిక శాఖ అధికారులతో సమావేశమై, అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం కోసం కొత్త దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు సమాచారం అందిస్తున్నారన్నారు. వాటిని వెంటనే పరిష్కరించే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీ విద్యార్థుల వసతి గృహాలు అద్దె భవనాలులో కొనసాగుతున్నట్లు ≫2

# ప్రకాశం బ్యారేజికి ప్రపంచ గుర్తింపు



**విజయవాడ,అక్టోబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగువారు ఘనంగా చెప్పుకునే విజయవాడ ప్రకాశం బ్యారేజీకి ప్రపంచ వారసత్వసాగునీటి కట్టడంగా ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రెయినేజీ (ఐసీఐడీ) సంస్థ గుర్తించింది. దేశంలో ఎంపికైన నాలుగు నిర్మాణాల్లో ఈ బ్యారేజీ ఒకటిగా నిలిచింది. ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రెయినేజీ(ఐసిఐడి) సంస్థ ప్రపంచ వారసత్వ సాగునీటి కట్టడంగా ప్రకాశం బ్యారేజీని గుర్తించింది. వ్యవసాయ రంగంలో సమర్థవంతంగా నీటిని వినియోగించే వారసత్వ కట్టడాలను గుర్తించడానికి,వాటిపై చేసే పరిశోధనలను ప్రోత్సహించడానికి ఈ అవార్డును ఐసీఐడీ సంస్థ ప్రధానం చేస్తోంది. నవంబరు 2నుంచి 8వ తేది వరకు విశాఖలో ఐసీఐడీ 25వ కాంగ్రెస్‌ను నిర్వహిస్తారు. ఆ సందర్భంగా ప్రకాశం బ్యారేజీకి సంబంధించిన అవార్డును రాష్ట్ర జలవనరుల శాఖకు ప్రధానం చేస్తారు. జలవనరుల శాఖకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ≫2

చీప్‌లిక్కర్ కుంభకోణంలో రూ. 41వేల కోట్లు దోపిడి నాసిరకం మద్యం విక్రయాలు 11లో

మీడియాతో మాజీ మంత్రి సోమిరెడ్డి ఫైర్

## చంద్రబాబు కేసులపై
# నేడు కీలక తీర్పులు



**అమరావతి, అక్టోబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి:** టిడిపి అధ్యక్షుడు చంద్రబాబుకు సంబంధించిన కేసుల్లో సోమవారం కీలకం కానుంది. కాగా దిగువ కోర్టు నుంచి దేశ అత్యున్నత న్యాయస్థానం వరకు బాబు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణలు, తీర్పులు వెలువడనున్నాయి. ఇదిలా ఉండగా స్కిల్ డెవలప్‌మెంట్ కేసుకు సంబంధించి సిఐడి తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని చంద్రబాబు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై తదుపరి విచారణను సుప్రీం కోర్టు ఈనెల 9వ తేదీకి వాయిదా వేసిన ≫2






ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ఆదివారం హర్యానా హిస్సార్‌లోని వ్యవసాయ వర్సిటీ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న దృశ్యం

# ఎరువుల రాయితీకి బ్రేక్

## తగ్గింపు ధరలు నిలిపేసిన విదేశీ సంస్థలు

## డిఏపిపై టన్నుకు రూ.6,658 భారం

## యూరియాకు రూ.8, 321 రాయితీకి కోత

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** ప్రపంచ సరఫరాలు కఠినతరం కావడంతో రష్యా కంపెనీలు భారత్‌కు రాయితీపై ఇప్పటి వరకూ అందించిన ఎరువులను నిలిపివేశాయి. భారత్‌కు రష్యా అతిపెద్ద సరఫరా దారుగా ఉండగా, డై అమోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) వంటి ఎరువులను తగ్గింపు ధరలకు రాయితీపై అందిస్తోంది. అయితే తాజాగా చోటు చేసుకున్న పరిణామాలతో రష్యన్ కంపెనీలు తగ్గింపు ధరలకు కాకుండా మార్కెట్ ధరలకే ఎరువులను అందించడంతో దాని ప్రభావం ప్రత్యక్షంగా పడబోతోందని కేంద్ర ఎరువుల, రసాయనాల మంత్రిత్వ శాఖ అధికారులు భావిస్తున్నారు. డీఏపీ, యూరియా, నైట్రేట్, పొటాష్, ఫాస్పరస్ (ఎన్‌పికె) ఎరువుల సరఫరాదారులు ప్రపంచ మార్కెట్ ధరలకే కాకుండా తగ్గింపుతో భారత్‌కు అందిస్తున్నాయి. ఇందులో భాగంగా డీఏపీ టన్నుకు 6,658.02 రూపాయల మేర రాయితో సరఫరా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 31వ తేదీతో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో రష్యా నుండి భారత్‌కు ఎరువుల దిగుమతులు 246 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 4.35 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. అయితే ప్రస్తుతం గ్లోబల్ ఎరువులధరలు గత రెండునెలలుగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం డీఏపీని భారత్ లోని ఎరువుల కంపెనీలకు విదేశీ వ్యాపార సంబంధాల నిబంధనలకు అనుగుణంగా ఖర్చు మరియు సరుకు (సిఎఫ్ఆర్) ప్రాతిపదికన 47,446.52 రూపాయలకు అందిస్తున్నాయి. భారత్‌తో పాటు, ఇతర దేశాలకు సైతం ఇదే ధరకు రష్యన్ ఎరువుల కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. అలాగే ఇప్పటి వరకూ టన్నుకు సుమారు 24,968.55 రూపాయల చొప్పున యూరియాను సరఫరా చేస్తుండగా, ఇప్పుడు ఖర్చు మరియు సరుకు ఆధారంగా ఈ ఎరువును టన్నుకు 33,289.96 రూపాయలకు పెంచి కోట్ చేస్తున్నాయని కేంద్ర ఎరువుల, రసాయనాల మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో దేశంలోని ఎరువుల కంపెనీలపై భారీగా భారం పడుతోంది. అయితే ఈ మేరకు అదనంగా పడే భారాన్ని భరించాలని ఎరువులు కంపెనీలు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నట్లు తెలియవచ్చింది. కాగా ఎరువుల సబ్సిడీ కోసం ఇప్పటికే 2023-24 వార్షిక అంచనా బడ్జెట్‌లో 1.75 లక్షల కోట్ల రూపాయలను కేటాయించింది. ఇది 2022-23 వార్షిక బడ్జెట్ కేటాయింపుల కన్నాతక్కువ. ఈ విధంగా గత ఆర్థిక సంవత్సరంలో ఎరువుల సబ్సిడీ 2.3 లక్షలకోట్ల రూపాయలు కేటాయించగా, ప్రస్తుత ఎరువుల సబ్సిడీ కోసం 1.75 లక్షలకోట్ల రూపాయలను కేటాయిం చింది. ఇది 2022-23 వార్షిక బడ్జెట్ కేటాయింపులకన్నా 25 శాతం మేర తక్కువగా కేటాయించడం విశేషం.

# వక్ఫ్ భూముల సమగ్ర సర్వే

≫ అధికారులు నివేదికలకు అనుగుణంగా శాశ్వత భవనాలు ఏర్పాటు చేస్తామని సీఎం జగన్మోహనరెడ్డి స్పష్టం చేశారు. ఈ దిశలో జరుగుతున్న కార్యచరణ నివేదికను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.75కోట్లుతో అయిదు గురుకుల పాఠశాలలు, రెండు వసతి గృహాలను ఏర్పాటు చేస్తామన్న వాగ్దానాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు..ఇప్పటికే ప్రారంభమైన అన్ని ప్రాజెక్టులు, అభివృద్ది పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు.మైనార్టీ శాఖలో పెండింగ్ సమస్యలపై పూర్తి స్థాయిలో నివేదికను ఇవ్వాలన్నారు.మైనార్టీ యువకుల్లో, విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్దిపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. వారిలోని నిపుణతను గుర్తించడం జరుగుతుందన్నారు..ఆ రంగంలో వారు మరింతగా రాణించే దిశలో చర్యలు చేపట్టాలన్నారు. వైద్యం,సంక్షేమంలో మైనార్టీలకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. మైనార్టీలకు స్థానిక సంస్థల్లోను,నామినేటెడ్ పదవుల్లో అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చామన్నారు.విజయవాడ,గుంటూరు పరిసర ప్రాంతాల్లో హజ్‌హౌస్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిఎం జగన్మోహనరెడ్డి ఎదుట ప్రవేశపెట్టారు. ఈ ప్రతిపాదనపై సిఎం జగన్మోహనరెడ్డి సానుకూలతతో స్పందిస్తూ కచ్చితంగా హౌస్ నిర్మిస్తామని తెలిపారు. ఈ దిశలో అన్ని చర్యలు చేపట్టాలన్నారు. హజ్ కమిటీలు,వక్ఫ్ కమిటీల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో జాప్యం ఉండకూడదన్నారు. కమిటీల ఏర్పాటు దిశలో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మైనార్టీ సంక్షేమానికి ఉద్దేశించిన రుణ,రాయితీ పథకాలను వారికే అందజేయాలన్నారు. ఆయా పథకాలకు సంబంధించిన అర్హులను వెంటనే పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం గుంటూరులో నిర్మాణం చేపట్టి,అర్థాంతరంగా నిలిపివేసిన క్రిస్టియన్ భవన నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. అసంపూర్తిగా వున్న ఈ భవన నిర్మాణాన్ని చేపట్టి,పూర్తి చేయాలన్నారు. విజయవాడలో ఇటీవలనే క్రిస్టియన్ పాస్టర్లకు కూడా వేతనాలను అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలందరి సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంకితభావంతో ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ, మజీదులు,ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం,ఇతరులకూ మైనార్టీలకు సిఎం జగన్మోహనరెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.ఆ మేరకు మైనార్టీ సంక్షేమానికి సంబంధించి సంబంధిత అధికారులకు సిఎం జగన్ ఎప్పటికప్పుడు కీలకాదేశాలు జారీచేస్తున్నారు.ఈ సందర్భంలో అధికారులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వక్ఫ్ భూములు,ఇతర ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వక్ఫ్ ట్రిబ్యునల్ ద్వారా సమస్యలను తక్షణం పరిష్కరించుకోవాలన్నారు. మైనార్టీలకు ఇబ్బందికరంగా మారిన అంశం తగిన స్మశాన వాటికలు లేకపోవడమన్నారు. మైనార్టీలకు కొత్త స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలన్నారు.ఇందుకు ఈ ఏడాది ప్రాధాన్యతాంశంగా తీసుకుని మైనార్టీలకు కొత్త శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలన్నారు.ప్రత్యేకంగా అమలులోకి తీసుకుని వస్తున్న సబ్‌ప్లాన్ ద్వారా మైనార్టీ సంక్షేమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఏపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఉప ప్రణాళిక ద్వారా నిధుల కేటాయింపు,నిర్దిష్ట సంక్షేమ కార్యక్రమాల కార్యచరణ సత్వరం జరగాలని సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి అధికారులను ఆదేశించారు.

# ఇంటర్ మార్కుల సర్టిఫికెట్ కోసం 'డిజిలాకర్'

**విజయవాడ,అక్టోబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇంటర్‌పాసైన విద్యార్థుల తమ మార్కుల ధృవీకరణ పత్రాలను పొందేందుకు నూతన సదుపాయం అందుబాటులోకి వచ్చింది.ఇంటర్మీడియట్ బోర్డు "డిజిలాకర్"నుఅందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల పాస్‌సర్టిఫికెట్, మైగ్రెషన్, ఈక్వలెన్సీ,జెన్యూనెస్ సర్టిఫికెట్లను ఎప్పుడు,ఎక్కడ కావాలన్నా తీసుకునే విధంగా "డిజిలాకర్"లో ఉంచింది.రాష్ట్ర విద్యాసంబంధ ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫాంపైన జ్ఞానభూమిని డిజిలాకర్‌కు అనుసంధానం చేస్తారు. ఇప్పటికే విద్యాశాఖ ఈ లాకర్‌లో 1.14 కోట్లు మంది టెన్త్ సర్టిఫికెట్లును ప్రభుత్వం డిజిలాకర్‌లో ఉంచింది.ఇప్పుడు 2014 నుంచి 2023వరకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన455.53 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాసైన అంటే 2014కు ముందు ఏపీ విద్యార్థులకు సైతం ఇందులో సర్టిఫికెట్లను అందుబాటులో ఉంచుతారు.ప్రస్తుతానికి ఈ సదుపాయం ఇంకా అందుబాటులోకి రాలేదు.త్వరలో వస్తుంది.దేశ చరిత్రలో ఇటువంటి సదుపాయం మన రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకుని వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.డిజి లాకర్‌లో సర్టిఫికెట్లలో తప్పుడు పడిన పేరును సరిద్దిద్దుకునే అవకాశం ఉంటుంది.తల్లిదండ్రులు పేర్లు,పుట్టిర తేదీలను సవరించడం వంటి సేవలను కూడా దీని ద్వారా విద్యార్థులు పొందే అవకాశం ఉంది.ఇప్పటి వరకు ఏ కారణం చేతనైనా సర్టిఫికెట్లు పోగొట్టుకుని డూప్లికేట్ పొందడమంటే చాలా కష్టంగా ఉండేది.పోలీసులకు రిపోర్టు చేయడం,వారు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అఫిడవిట్:తో సంబంధిత కళాశాలలో దరఖాస్తు చేసుకుంటే సుమారు రెండు,మూడు నెలలు ఎదురు చూస్తే తప్ప డూప్లికేట్ సర్టిపికేట్ వచ్చేది.ఇప్పుడు విద్యార్థులకు ఆ బాధ ఉండదు..ఇంత సుదీర్ఘ ప్రక్రియకు స్వస్తి పలుకుతూ డీజీ లాకర్‌తో జ్ఞానభూమిని అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థి సర్టిఫికేట్‌ను పొందవచ్చు.



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదివారం బద్రీనాథ్ ఆలయాన్ని సందర్శించిన దృశ్యం

# ప్రకాశం బ్యారేజికి ప్రపంచ గుర్తింపు

≫ లేఖ రాసింది.ఇంతటి ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కడంపై కృష్ణా డెల్టా ఆయకట్టు రైతులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని సీతానగరం విజయవాడలోని ఇంద్రకీలాద్రి మధ్య కృష్ణానదిపై ఆనకట్ట నిర్మించాలని 1798లో ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగి అయిన కెప్టెన్ బకల్ ప్రతిపాదించారు. 1832-33లో తీవ్ర వర్షాభావం వల్ల డొక్కల కరువు వచ్చింది. ఈ కరువు ప్రభావంతో కృష్ణా, ప్రకాశం జిల్లాల పరిధిలో 40శాతం ప్రజలు ఆకలితో మరణించారు. ఈ కరువు వల్ల ఆ సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీకి పన్నుల రూపంలో రూ.2.27 కోట్ల ఆదాయం తగ్గింది. ఇంత తీవ్ర కరువులోను కృష్ణానది జీవజలంతో ప్రవహిస్తునే ఉంది. కృష్ణా జలాలను సాగునీటి అవసరాలకు వాడుకుంటే కరువు పరిస్థితులను ఎదుర్కోవచ్చని కెప్టెన్ బెస్ట్‌లేక్‌గా భావించారు. సీతానగరం, ఇంద్రకీలాద్రి మధ్య ఆనకట్ట నిర్మించడం ద్వారా కృష్ణా నది జలాలను సాగునీటి అవసరాలకు మళ్లించడం ద్వారా దుర్భిక్షాన్ని ఎదుర్కోవచ్చని 1839-41 మధ్య వారు బ్రిటిష్ పాలకులకు నివేదించారు. కృష్ణానదిపై ఆనకట్ట నిర్మించాలని సర్ ఆర్థర్ కాటన్ ప్రతిపాదించడంతో 1850 జనవరి ఐదో తేదిన ఈస్ట్ ఇండియా కంపెనీ ఆమోదించింది. 1852లో ఈ ఆనకట్ట నిర్మాణాన్ని ప్రారంభించి 1855 నాటికి రూ.1.75 కోట్లుతో పూర్తి చేసింది. అప్పట్లో ఈ ఆనకట్ట ద్వారా 5.8 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించేవారు. కృష్ణా నదికి 1952లో వచ్చిన భారీవరదలకు ఆనకట్ట కొట్టుకు పోయింది. ఆనకట్ట స్థానంలో 1954 ఫిబ్రవరి13వ తేదిన బ్యారేజ్ నిర్మాణాన్ని అప్పటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రారంభించారు. ఈ బ్యారేజ్ నిర్మాణం 1957 డిసెంబర్ 24వతేదికి పూర్తయింది. 2.97 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ బ్యారేజ్ కోసం రూ.2.78 కోట్లు ఖర్చుచేసారు. బ్యారేజ్ ఆయకట్టును 13.08లక్షల ఎకరాలకు పెంచారు. నీటి నిల్వతోపాటు వాహనాల ప్రయాణించేలా రోడ్డు మార్గంతో బ్యారేజీని ఖర్చు చేసారు. బ్యారేజ్ ఆయకట్టును 13.08 లక్షల ఎకరాలకు పెంచారు. నీటి నిల్వతో పాటు, వాహనాలు ప్రయాణించే విధంగా రోడ్డు మార్గంతో బ్యారేజీని నిర్మించారు. ప్రకాశంపంతులు పేరు వచ్చే విధంగా ఆయన పేరిట ప్రకాశం బ్యారేజీ అని పేరుపెట్టారు. 2005లో డెల్టా ఆధునీకరణలో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టును ఆధునీకరణ చేసింది. కాల్వలకు మరమ్మత్తులు జరిపి విస్తరణ చేసింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విస్తరించి కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలను ప్రకాశం బ్యారేజీ కీలక జలవనరుగా నిలిచింది. ఈ ప్రాజెక్టు ఇప్పుడు ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రెయినేజీ(ఐసీఐడీ) సంస్థ గుర్తింపు లభించింది. ఇది మన విజయవాడకు దక్కిన గౌరవం!

SINGAM KUIL BLUE SUNDAY
DrawDate on:08/10/23

DAY - SINGAM SERIES Dr No:207
1st Prize Rs.100000/- 196308
2nd Prize Rs.7000/- 54675
3rd Prize Rs.3500/-
09223 22354 30859 37414 53228
54259 68991 73859 82903 97977
4th Prize Rs.200/-
0584 1465 4425 5286 5373 7450 7936
9616 9731 9991
5th Prize Rs.100/-
0167 0623 2200 3136 4188 5744 6675
6703 7973 8186
6th Prize Rs.50/-
0132 1200 2680 4332 6613 7771 9246
0261 1323 2900 4452 6781 7784 9286
0432 1330 2984 4589 6851 7923 9435
0501 1338 3079 4606 6970 8013 9450
0549 1359 3114 4735 7096 8100 9560
0671 1882 3508 4770 7266 8269 9744
0693 1917 3509 4825 7287 8424 9766
0734 1948 3605 5031 7375 8679 9774
0753 2134 3621 5205 7419 8717 9780
0825 2212 3798 5305 7570 8846 9795
0860 2279 3968 5436 7579 8920
0867 2349 4143 5619 7626 8972
0970 2458 4146 5745 7655 8987
1088 2483 4289 5992 7725 9041
1143 2658 4300 6170 7769 9155

DAY - KUIL SERIES Dr No:207
1st Prize Rs.100000/- 866239
2nd Prize Rs.7000/- 21232
3rd Prize Rs.3500/-
00348 00741 10209 15561 19817
21686 45753 85636 86041 95331
4th Prize Rs.200/-
0952 1294 2467 2597 3891 4028 4144
6916 8243 8962
5th Prize Rs.100/-
0096 2869 2874 3445 6326 6605 7025
7317 8324 9476
6th Prize Rs.50/-
0019 1642 4018 5504 6497 7600 8988
0085 2105 4067 5551 6515 7672 9026
0098 2318 4099 5612 6585 7790 9134
0373 2386 4183 5870 6594 7839 9136
0739 2470 4669 5979 6684 7868 9359
0788 2498 4859 6076 6785 7889 9616
0792 2792 5045 6089 6822 7897 9913
0868 3266 5046 6092 6839 8078 9941
1045 3275 5055 6160 6854 8128 9959
1101 3425 5162 6240 6927 8564 9965
1351 3567 5238 6334 6947 8575
1358 3589 5256 6412 7223 8579
1429 3709 5313 6419 7246 8790
1431 3877 5426 6421 7534 8887
1599 3975 5463 6495 7576 8925

ROSA DEAR SILVER SUNDAY
DrawDate on:08/10/23

DAY - ROSA SERIES Dr No:207
1st Prize Rs.100000/- 696993
2nd Prize Rs.7000/- 03137
3rd Prize Rs.3500/-
05034 08758 16180 23624 31628
40693 48374 50462 60474 77222
4th Prize Rs.200/-
0497 0997 1588 2140 4939 5403 5954
6053 6495 9739
5th Prize Rs.100/-
0166 0523 3451 3944 4558 4920 6042
7090 7910 8053
6th Prize Rs.50/-
0091 1276 2925 4595 5771 8217 9299
0198 1358 3066 4609 5841 8315 9419
0213 1408 3327 4619 5875 8322 9450
0361 1435 3443 4727 6110 8425 9470
0400 1439 3845 4750 6340 8443 9562
0602 1493 3852 4794 6356 8513 9578
0660 1683 3992 4856 6657 8580 9580
0678 1871 3998 5064 6793 8744 9694
0877 2059 4119 5074 6838 8803 9730
0905 2212 4120 5185 6868 8807 9802
0995 2310 4122 5274 7058 8911
1089 2395 4208 5349 7066 9124
1106 2604 4238 5367 7128 9131
1160 2752 4274 5618 7646 9219
1230 2846 4592 5690 7928 9222

DAY - DEAR SERIES Dr No:207
1st Prize Rs.100000/- 288312
2nd Prize Rs.7000/- 53917
3rd Prize Rs.3500/-
11663 31031 48837 71196 77505
82346 86357 90624 93851 95775
4th Prize Rs.200/-
0022 1199 2579 3295 5398 5541 5945
7381 7639 8206
5th Prize Rs.100/-
0762 0905 1314 3169 3181 3827 6122
6801 7943 9135
6th Prize Rs.50/-
0033 0901 2025 3822 5658 6817 8615
0063 1012 2328 3920 5712 7152 8692
0184 1078 2372 4191 5882 7156 8827
0205 1231 2554 4308 5895 7219 8898
0227 1276 2663 4455 5935 7377 9179
0453 1425 2776 4546 6296 7606 9501
0535 1482 2808 4598 6303 7619 9531
0551 1498 3043 4717 6320 7723 9642
0600 1631 3124 5078 6372 7791 9696
0670 1721 3269 5119 6395 7904 9863
0679 1726 3313 5272 6442 8015
0707 1875 3378 5280 6537 8162
0750 1913 3401 5477 6614 8270
0756 1948 3501 5571 6724 8313
0785 2010 3692 5588 6769 8575

THANGAM VAIRAM EFFORT SUNDAY
DrawDate on:08/10/23

DAY - THANGAM SERIES Dr No:207
1st Prize Rs.100000/- 521690
2nd Prize Rs.7000/- 96747
3rd Prize Rs.3500/-
16587 18368 21826 49448 53079
59495 63715 69125 91998 99319
4th Prize Rs.200/-
3307 4068 4266 4489 5116 5412 5655
7155 7311 8904
5th Prize Rs.100/-
0000 0752 1325 1763 3206 5240 6339
7720 8608 9865
6th Prize Rs.50/-
0042 1505 2618 3535 5540 7159 8631
0094 1597 2689 3940 5684 7400 8789
0157 1624 2814 3962 5849 7435 8809
0430 1625 2837 4303 5865 7543 9187
0438 1658 2899 4364 5951 7753 9456
0612 1733 2900 4440 6195 7770 9606
0639 1829 2904 4485 6370 7789 9663
0709 2026 2934 4505 6419 7871 9712
0773 2035 3052 4609 6439 8017 9824
0841 2122 3155 4625 6571 8148 9974
0913 2372 3160 4977 6668 8242
0941 2382 3318 5059 6831 8295
1138 2526 3342 5086 7025 8380
1163 2559 3406 5182 7055 8550
1462 2585 3466 5379 7143 8626

DAY - VAIRAM SERIES Dr No:66
1st Prize Rs.50000/- 863787
2nd Prize Rs.7000/- 51604
3rd Prize Rs.3500/-
00108 09404 25121 44673 52896
63584 70533 85143 94939 99128
4th Prize Rs.200/-
0604 3301 3905 4309 5021 5898 6784
7207 8783 8834
5th Prize Rs.100/-
0306 0875 1958 3313 4464 4738 6063
8184 8845 9235
6th Prize Rs.50/-
0007 1645 3683 5002 6683 7653 9188
0051 1854 3797 5184 6870 7756 9245
0056 1991 3803 5222 6892 7845 9432
0084 2027 3854 5269 6909 7885 9610
0128 2039 3863 5423 6954 7887 9679
0293 2551 3963 5453 7011 7893 9715
0743 2648 4086 5495 7317 7913 9820
0815 2754 4216 5515 7326 8009 9944
0954 2756 4297 5522 7366 8471 9981
1308 3023 4470 5775 7396 8608 9995
1335 3114 4476 5863 7504 8789
1408 3359 4713 5864 7510 8790
1471 3362 4777 5952 7520 8997
1481 3479 4855 6322 7629 9073
1503 3664 4883 6640 7630 9116

NALLANERAM MANI EFFORT SUNDAY
DrawDate on:08/10/23

DAY - NALLANERAM SERIES Dr No:207
1st Prize Rs.50000/- 771745
2nd Prize Rs.7000/- 94088
3rd Prize Rs.3500/-
10036 14287 25446 43668 52059
55658 62549 66769 82329 99861
4th Prize Rs.200/-
0118 1347 3025 3879 5755 6082 7102
7863 7939 9728
5th Prize Rs.100/-
0653 4177 5307 6314 6448 7707 7843
7859 8241 9350
6th Prize Rs.50/-
0063 2166 3400 4891 6789 7763 9108
0126 2335 3419 4959 6812 7813 9142
0130 2362 3502 5215 6818 7901 9340
0381 2529 3573 5401 6910 8072 9347
0486 2550 3584 5728 7031 8098 9452
0611 2645 3833 5866 7045 8379 9545
0690 2687 3878 5985 7090 8407 9581
0727 2723 3980 6032 7107 8509 9675
0819 2750 4120 6096 7141 8554 9678
0922 2754 4137 6099 7245 8593 9946
0948 2861 4451 6126 7260 8615
1535 3129 4463 6218 7286 8682
1835 3151 4644 6321 7354 8797
1843 3167 4647 6490 7526 8861
1885 3354 4668 6667 7594 8949

DAY - MANI SERIES Dr No:66
1st Prize Rs.50000/- 685466
2nd Prize Rs.7000/- 16335
3rd Prize Rs.3500/-
04856 07988 29000 36191 53597
66223 73577 84296 91165 91663
4th Prize Rs.200/-
1510 2048 2097 3809 5182 5992 6221
8540 9547 9887
5th Prize Rs.100/-
0847 1469 2975 3147 3532 4867 6799
7569 7670 9770
6th Prize Rs.50/-
0106 2312 3471 4495 5721 6749 8739
0140 2316 3472 4535 5793 6818 8952
0304 2347 3473 4545 5814 6861 8998
0911 2721 3498 4600 5839 7023 9059
0922 2897 3614 4641 5930 7068 9260
1026 2946 3642 4654 5989 7099 9459
1044 3089 3682 4887 6101 7174 9592
1110 3105 3687 5028 6118 7447 9633
1359 3133 3853 5074 6172 7459 9773
1441 3259 4040 5104 6173 7582 9783
1473 3313 4066 5143 6226 7640
1538 3409 4152 5153 6253 7735
1824 3432 4206 5470 6465 7911
2141 3437 4248 5594 6564 8381
2268 3441 4382 5719 6664 8616

KUMARAN VISHNU THUNDER SUNDAY
DrawDate on:08/10/23

DAY - KUMARAN SERIES Dr No:207
1st Prize Rs.50000/- 132316
2nd Prize Rs.7000/- 64843
3rd Prize Rs.3500/-
02334 05828 11648 38715 45625
49708 64780 68296 94563 98676
4th Prize Rs.200/-
0681 0935 1597 2993 3578 3691 4011
6338 8361 8368
5th Prize Rs.100/-
4522 5726 6969 7275 7309 7534 7920
8677 8867 9820
6th Prize Rs.50/-
0168 1654 2678 4035 5821 6937 8820
0316 1674 2701 4207 5822 7178 9148
0342 1828 2902 4332 5841 7192 9427
0387 1843 3056 4394 5846 7341 9489
0573 2023 3165 4556 5938 7397 9496
0748 2167 3327 4603 6042 7527 9539
0882 2330 3440 4912 6274 7554 9553
1168 2365 3496 4921 6416 8022 9784
1191 2366 3515 5258 6451 8132 9890
1277 2409 3532 5524 6472 8403 9992
1395 2420 3706 5555 6525 8426
1444 2443 3718 5572 6730 8554
1445 2464 3786 5681 6766 8557
1468 2532 3970 5785 6810 8623
1512 2548 4021 5813 6838 8675

DAY - VISHNU SERIES Dr No:207
1st Prize Rs.50000/- 738432
2nd Prize Rs.7000/- 54110
3rd Prize Rs.3500/-
00864 08047 27608 28379 36499
53164 73652 74960 80990 85561
4th Prize Rs.200/-
0197 0652 2802 3186 3678 6119 6160
7244 8015 8674
5th Prize Rs.100/-
0185 1694 2205 3007 3596 4974 5655
6836 9379 9641
6th Prize Rs.50/-
0063 0969 2057 4102 6122 8092 9157
0092 0973 2074 4205 6306 8198 9293
0095 0998 2079 4484 6333 8285 9412
0267 1080 2264 4520 6511 8310 9457
0305 1203 2326 4784 6544 8396 9593
0366 1206 2546 4796 6910 8494 9648
0403 1223 2559 4805 7059 8518 9866
0471 1249 2585 4869 7280 8669 9871
0640 1288 2658 4956 7443 8767 9914
0671 1330 2674 5000 7604 8788 9938
0686 1390 3567 5292 7711 8941
0746 1790 3659 5459 7714 8969
0845 1834 3823 5504 7875 8973
0883 1913 3859 5597 7991 9009
0902 1947 3932 5983 7997 9029

SWARNALAXMI LION RUBY SUNDAY
DrawDate on:08/10/23

SWARNALAXMI SERIES Dr No:207
1st Prize Rs.50000/- 697521
2nd Prize Rs.7000/- 86716
3rd Prize Rs.3500/-
18379 18474 29547 31232 31748
42541 42927 53808 64819 75624
4th Prize Rs.200/-
0357 0677 2807 2985 5897 7255 7516
8185 8668 8909
5th Prize Rs.100/-
1162 3165 6309 6917 6967 7078 7762
7862 9649 9857
6th Prize Rs.50/-
0111 1862 3263 4520 6176 7566 8648
0151 2066 3298 4842 6361 7620 8661
0206 2251 3387 5159 6425 7805 8715
0443 2288 3435 5364 6444 7858 8903
0590 2311 3527 5383 6594 7869 9139
0855 2438 3532 5405 6805 7921 9195
0931 2623 3912 5466 6858 8037 9472
0936 2728 3925 5616 6868 8105 9570
1083 2745 3998 5703 6927 8106 9849
1183 2786 4022 5748 7122 8199 9963
1398 2875 4044 5962 7263 8257
1450 2923 4127 5978 7315 8360
1572 2996 4133 5986 7387 8525
1635 3192 4351 6050 7400 8549
1855 3226 4482 6104 7512 8624

DAY - LION SERIES Dr No:66
1st Prize Rs.50000/- 449387
2nd Prize Rs.7000/- 73635
3rd Prize Rs.3500/-
16665 27341 38550 49914 51255
62293 62810 73819 84195 95229
4th Prize Rs.200/-
3011 3203 3333 4474 5721 5791 6637
7381 8450 9210
5th Prize Rs.100/-
0514 2086 3194 6445 6446 7478 7884
8634 8884 9038
6th Prize Rs.50/-
0163 1277 2314 3377 5076 6695 8820
0170 1299 2390 3616 5157 7132 8882
0266 1450 2393 3628 5227 7143 9045
0481 1558 2624 3664 5415 7152 9367
0553 1590 2656 3806 5460 7256 9371
0567 1635 2818 3810 5462 7302 9490
0629 1638 2862 3916 5510 7347 9510
0673 1761 2982 3988 5720 7405 9655
0781 1787 3013 4014 5804 7417 9801
0808 1880 3048 4036 5971 7945 9825
0859 2001 3049 4073 6119 8108
0865 2030 3175 4121 6272 8594
0889 2042 3238 4273 6341 8723
0945 2059 3340 4861 6416 8759
1197 2186 3342 4897 6439 8816

## డిపిఆర్‌కే పరిమితం

# అన్నమయ్య కాలిబాట మార్గం!

## నేడు టిటిడి బోర్డు రెండవ సమావేశం





**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రియభక్తుడైన వాగ్గేయకారుడు "అన్నమయ్య" శేషాచలం అటవీమార్గంలో కాలినడకన వచ్చిన బాటను అభివృద్ధిచేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం మూడేళ్లక్రిందట తీసుకున్న నిర్ణయం డిపిఆర్‌కే పరిమితమైంది.ఇప్పుడు ఈ అంశం కాగితాల్లోనే మిగిలింది. అన్నమయ్యబాలిబాట అభివృద్ధికిడీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డిపిఆర్)కూడా తయారు చేయాలని అటవీశాఖ, టిటిడి ఇంజనీరింగ్ అధికారులకు 2021లో అప్పటి పాలకమండలి ఆదేశించింది. అప్పట్లోనే వేగంగా ఇంజనీరింగ్ అధికారులు, అటవీ అధికారులు అటవీప్రాంతంలోని కాలిబాటను కూడా సంయుక్తంగా పరిశీలించారు. అటవీప్రాంతంలో వన్యప్రాణులకు ముప్పువాటిల్లకుండా కాలిబాటను తీర్చిదిద్దాలని ప్రతిపాదనలు చేశారు. తిరుమలకొండపై పార్వేటమండపం వద్ద నుంచి మామండూరు మీదుగా పూర్తిగా దట్టమైన అటవీప్రాంతంలోనే ఈ కాలిబాట ఉండటంతో తిరుమలకు మూడవఘాట్‌రోడ్డుగా ప్రత్యామ్నాయంగా తీర్చి దిద్దాలనే ఆలోచన చేశారు. అన్నమయ్యకాలిబాట మార్గాన్ని పూర్తిగా నడకదారి భక్తులకు వీలుగా నిర్మించాలనే యోచన దాదాపు తొమ్మిదేళ్లుగా ఉంది. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత కడప జిల్లా జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి "అన్నమయ్య కాలిబాట"మార్గం అభివృద్ధిచేయాలని అకుంఠిత దీక్షతో ప్రతి ఏడాది రాజంపేట పరిసరాల్లోని గ్రామస్థులతో, వెంకన్న భక్తులతో కలసి తిరుమలకు నడచివస్తున్నారు. ఈ కాలిబాట అభివృద్ధిపై రెండేళ్ల క్రిందట టిటిడి పాలకమండలి సమావేశంలోనూ చర్చించి నిర్ణయించారు. అయితే మూడేళ్లుగా డిపిఆర్‌తోనే కాలం వెల్లబుచ్చుతున్నారు. ప్రస్తుతం టిటిడి పాలకమండలి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన నడుస్తోంది. ఆయన ఛైర్మన్‌గా సోమవారం రెండవసారి పాలకమండలి సమావేశమవుతోంది. 15వతేదీ నుండి జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యాలు, కల్పించాల్సిన ఏర్పాట్లు, గరుడసేవ రోజు తీసుకునే చర్యలు, భక్తుల సంఖ్యకు తగ్గట్లు సదుపాయాలు, మార్కెటింగ్ కొనుగోళ్లకు సంబంధించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఉద్యోగులకు బ్రహ్మోత్సవాల బహుమానంపై నిర్ణయం తీసుకునే వీలుంది. తిరుమలకు ప్రస్తుతం తిరుపతి అలిపిరి నడకదారి,శ్రీవారిమెట్లమార్గం నడకదారులుగా ఉన్నాయి. కొన్ని వందల సంవత్సరాల క్రిందట నుండి ఈ మార్గాలే భక్తులకు నడకదారులుగా ఖ్యాతి.

2021వ సంవత్సరంలో సంభవించిన బలమైన వరదల సమయంలో తిరుమల ఘాట్‌రోడ్డులో రోడ్లు కోతకు గురవడం, రక్షణగోడలు ధ్వంసమవడం జరిగిపోయింది. కాలినడక మార్గాల్లో బండరాళ్లు జారిపడ్డాయి. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అవాంతరాలు కలగడమోగాక టిటిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఏకంగా పదిరోజులు తిరుమల రెండోఘాట్‌ను మూసివేసి మొదటిఘాట్‌పైనే రాకపోకలు సాగించేలా చూశారు. ఈ సమయంలో తిరుమలకు ప్రత్యామ్నాయంగా మూడోఘాట్‌రోడ్డు (కాలిబాట)అవసరాన్ని టిటిడి గుర్తించింది. ఇందుకు అన్నమయ్యకాలిబాటను తీర్చిదిద్దే యోచనతో ప్రతిపాదనలు రూపొందించింది. కడపవైపు నుంచి తిరుమలకు కాలినడకన వచ్చే భక్తులు అన్నమయ్యకాలిబాట మార్గం ఉపయోగపడేలా చూడాలని భక్తుల విశ్వాసం. రానున్న నాలుగైదునెలలు కీలకం కావడం, 2024లో ఎన్నికలు జరగనుండటంతో డిపిఆర్‌తోనే సరిపెట్టేస్తారా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# చంద్రబాబు కేసులపై నేడు కీలక తీర్పులు

≫ సంగతి తెలిసిందే. చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌కు సంబంధించి, ఎపి హైకోర్టుకు సిఐడి సమర్పించిన డాక్యుమెంట్లను తమముందు ఉంచాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో ఈ కేసులో సోమవారం విచారణ జరగనుంది.. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా వేసిన సుప్రీం కోర్టు ఇక ఇదే కేసులో తనకు బెయిలు మంజూరు చేయాలని చంద్రబాబు వేసిన బెయిల్ పిటిషన్‌పై విజయవాడలోని ఎసిబి కోర్టు సోమవారం నిర్ణయాన్ని వెల్లడించనుంది. అంతేకాదు దీంతోపాటు మరోసారి పోలీసు కస్టడీకి కోరుతూ సిఐడి వేసిన పిటిషన్‌పై సైతం సోమవారం ఎసిబి కోర్టు తన నిర్ణయాన్నివెల్లడించ నుంది. స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లపై విజయవాడ ఎసిబి కోర్టులో వాదనలు ముగియగా, న్యాయమూర్తి తీర్పును సోమవారానికి వాయిదావేసి వైనం విదితమే. సిఐడి తరపున వాదనలు, ఎఎజి పొన్నవోలు విన్పిస్తూ.. చంద్రబాబును కస్టడీకి ఇవ్వాలన్నారు. అదేవిధంగా దీనిపై చంద్ర బాబు తరపు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే.. చంద్రబాబును ఇప్పటికే పోలీసు కస్టడీకిఇచ్చారని వాదించారు.. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వుచేసిన హైకోర్టులోనూ సోమవారం చంద్రబాబుకు సంబంధించిన మూడు బెయిల్ పిటిషన్లపై తీర్పులు వెల్లడికాను న్నాయి.. రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్, అంగళ్లు, ఫైబర్ నెట్‌కేసుల్లో బెయిల్ కోసం చంద్రబాబు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగియటంతో హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి తీర్పులను రిజర్వు చేసిన సంగతి తెలిసిందే.

## వారం - వర్జ్యం

తేది : 9-10-2023, సోమవారం
శ్రీశోభకృత్‌నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయనం,
వర్షఋతువు, బహుళపక్షం
దశమి మ.12.37, ఆశ్లేష పూర్తి.
వ.సా.5.08-6.56
దు.మ.12.18-1.05, 2)
మ.2.40-3.27
శుభసమయం లేదు, హస్త కార్తె
రాహుకాలం ఉ.7.30-9.00 వరకు

## వార్తాఫలం

**మేషం :** వ్యాపారస్తుకు లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. కోర్టు కేసులు వాయిదాలలో ఉంటాయి.

**వృషభం :** నిష్కారణమైన ఆంతరంగిక భయం నుండి బయటపడతారు. వాహనయోగం.

**మిథునం :** మీకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరచుకోవడానికి అధికంగా శ్రమిస్తారు. ప్రయాణాలు లాభించవు.

**కర్కాటకం :** చాలా కాలం నుండి పెండింగ్‌లో ఉన్న వ్యవహారాలను సమస్యలను పరిష్కరించుకుంటారు.

**సింహం :** ప్రజా సంబంధాలు అధికంగా కలిగిన వ్యాపారస్తులకు అనుకూలం.

**కన్య :** కీలక వ్యవహారాలలో సొంత నిర్ణయాలు శ్రేయస్కరం. ఆర్థికస్థితిగతులు మెరుగ్గా ఉంటాయి.

**తుల :** విదేశాలలోని మీ వారికి గ్రీన్ కార్డ్ లభిస్తుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**వృశ్చికం :** సరికొత్త వ్యాపారాలు చేసే వారు సన్నిహితమవుతారు. ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారు.

**ధనుస్సు :** ప్రభుత్వ పరంగా లాభించవలసిన అంశాలు ఓ కొలిక్కి వస్తాయి.

**మకరం :** జీవితభాగస్వామితో విభేదాలు సమసి పోతాయి. క్రమశిక్షణకు ప్రాముఖ్యతనిస్తారు.

**కుంభం :** సలహాలు సూచనలతో ఇతరులను మార్చలేమని తెలుసుకుంటారు.

**మీనం :** లాభించదు అనుకున్న ప్రతి విషయాన్ని నిర్మొహమాటంగా త్రోసి

- శ్రీమతి ముళ్లపూడి శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భక్తుల మధ్య మలివిడత నవరాత్రి బ్రహ్మోత్సవాలు!

## 15నుండి 23వరకు మాడవీధుల్లో వాహనసేవలు



**తిరుమల,అక్టోబరు 8 ప్రభాతవార్తప్రతినిధి:** అధికామాసం కారణంగా ఈ ఏడాది ఏడుకొండల వేంకటేశ్వరునికి ఇప్పటికే ముగిసిన సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల స్ఫూర్తితో మలివిడత నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమవుతోంది. ఇందుకోసం ముఖ్యమైన వాహన సేవలఘట్టాలను నిర్ణయించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 15వతేదీ నుంచి 23వతేదీ వరకు కన్నుల పండువగా జరిపించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. 14వతేదీ రాత్రి వసంతోత్సవ మండపంలో అంకురార్పణ ఘట్టంతో శ్రీకారం చుడుతున్న తొమ్మిదిరోజుల ఉత్సవాలకు చివరగా చక్రస్నానంతో ముగింపు ఉంటుంది. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాల (సెప్టెంబర్ 18నుంచి 26వరకు)ను, వాహనసేవలను ఆలయమాఢవీధుల్లో నిర్వహించి, లక్షలాదిమంది భక్తులు వీక్షించేలా చూశారు. మరోసారి దేవదేవుడు ఏడుకొండలవాడి నవరాత్రి బ్రహ్మోత్సవాల వాహనసేవలను ఆలయ మాఢవీధుల్లో జరిపించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. దసరా సెలవులు వస్తుండటంతో తిరుమలకు అశేష సంఖ్యలో భక్తులు చేరుకుని వాహనసేవలు వీక్షించే అవకాశం ఉందని భావిస్తు న్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా వాహన సేవలవీక్షణకు సౌకర్యాల కల్పనపై దృష్టి పెడుతున్నారు. తిరుమలలోనవరాత్రి బ్రహ్మోత్స వాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వైభవంగా విజయవంతంగా నిర్వహించేలా టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి కసరత్తు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేశారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఐదవరోజురాత్రి గరుడసేవ 19వతేదీ గురువారం జరుగుతుంది. సామాన్య భక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్‌దర్శనాలు రద్దుచేశారు. ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే స్వయంగా వస్తేనే బ్రేక్ దర్శనాలు కల్పిస్తారు. అన్ని ఆర్జితసేవలు 14వతేదీ నుండి రద్దయ్యాయి. గతనెలలో జరిగిన సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు 5.47 లక్షలమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రానున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని టిటిడి వర్గాలు భావిస్తున్నాయి. వాహనసేవల వీక్షణకు భక్తులు భారీగా తరలివచ్చే సూచనలు ఉన్నాయి.

## నేడు విజయవాడలో సిఎం జగన్ పర్యటన

**విజయవాడ,అక్టోబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం జగన్ నేడు విజయవాడలో పర్యటిస్తారు. రాష్ట్రంలో ఆయన ఇటీవల కాలంలో పార్టీ సంస్థాగత అంశాలపై పూర్తి దృష్టిని పెట్టారు. ఈ క్రమంలో ఆయన "వై ఆంధ్రానీడ్స్ జగన్' పేరిట విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే అధికార పార్టీ క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధుల నుంచి శాసనసభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేతో, పార్టీ కో-ఆర్డినేటర్, ఇతర పార్టీ బాధ్యులు, నగర, పురపాలక సంఘాల చైర్మన్లు, ఎఎంసీచైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఇతరులు 8,222 మంది పాల్గొంటారు. సిఎం జగన్ ఉదయం 10.30గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి ఈ కార్యక్రమానికి చేరుకుంటారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎన్నికలకు క్యాడర్‌ను సమాయత్తం చేయనున్నారు. రానున్న రోజుల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు.



## బండారు వ్యాఖ్యలపై సుప్రీం కోర్టుకు వెళ్తా

### - మంత్రి ఆర్కే రోజా

**విజయవాడ,అక్టోబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ మూర్తి వ్యాఖ్యలపై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తానని, న్యాయపరంగా పోరాడాతనని మంత్రి ఆర్కే రోజా తెలిపారు. తనపై అత్యంత లజ్జకరంగా, సిగ్గులేకుండా కువిమర్శలు చేసిన బండారు వంటి చీడపురుగులను ఏరిపారేయలంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. తనపై బండారు చేసి వ్యాఖ్యలను రాజకీయాలకతీతంగా ఖండించిన మహిళలకు, వివిధ పార్టీ మహిళా నేతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మహిళలను కించపరిస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. చంద్రబాబు జైలుకెళ్లడంతో టిడిపినేతలకు పిచ్చెక్కిం దన్నారు. చంద్రబాబు తప్పు చేయకుంటే ఎందుకు బయటకు రాలేకపోతున్నారన్నారు. టిడపిపి ఫెయిల్యూర్‌ను డైవర్ట్ చేయడానికి నన్ను టార్గెట్ చేసారన్నారు. టిడిపి, జనసేనకు దిగజారుడు రాజకీయాలే తెలుసునన్నారు. అడ్డగోలు వాగుళ్లతో టిడిపి నేతలు ప్రజాదరణ పొందలేరన్నారు. చంద్రబాబుపై సిఐడి పక్కా ఆధారాలతో కేసు నమోదుచేసిందన్నారు. చంద్రబాబుపై నేరాభియో గానికి సంబంధించి ఆధారాలను గమనించిన తరువాత కోర్టు న్యాయపరిధిలో వ్యవహరించింద న్నారు. ఇందుకు ప్రభుత్వం ఎలా బాధ్యత వహిస్తుందన్నారు. తాను చేసే విమర్శలు రాజకీయ కోణంలోనే ఉంటాయన్నారు. తనపై అనుచిత ఆరోపణలు చేసిన బండారును సనా ్మనించిన వారు ఏ స్దాయికి దిగజారారో ఆలోచించా లన్నారు.

## ఆయుర్వేద మందుల దుకాణాల నిర్వహణకు సేల్ లైసెన్స్ అవసరంలేదు

**విజయవాడ,అక్టోబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆయుర్వేద మందుల దుకాణాల నిర్వహణకు 'డిపార్టుమెంట్ ఆఫ్ ఆయుష్". ఆంధ్రా బోర్డ్ ఆఫ్ ఆయుర్వేద నుంచి సేల్ లైసెన్స్ పొందాల్సిన అవసరం లేదని ది మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోషియేషన్ (ఆయుర్వేద) అధ్యక్షుడు డాక్టర్ వేముల భాను ప్రకాష్ తెలిపారు. డ్రగ్ కాస్మోటిక్ యాక్ట్-1940లో రిటైల్ ఆయుర్వేదం మందుల దుకాణాల గురించి పేర్కొనలేదన్నారు. ఈ చట్టానికి అనుగుణంగానే ప్రస్తుతం దేశవ్యాప్తంగా మందుల దుకాణాల నిర్వహణ జరుగుతుందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఇదే విషయం స్పష్టమైంది. దీనికి అనుగుణంగానే చర్యలు ఉండాలన్నారు. రాష్ట్రంలో ఆయుష్, ఆంధ్రాబోర్డు ఫర్ ఆయుర్వేద నుంచి సేల్ లైసెన్స్ పొందాలని తాజాగా ప్రభుత్వం చెబుతుంది. ఆంధ్రాబోర్డు ఫర్ ఆయుర్వేదకు గవర్నింగ్ బాడీ లేదు. అది నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ 2020 ప్రకారం పనిచేస్తోంది. దానికి ఉనికి ప్రశ్నార్ధకంగా మారింది.

# న్యాయం జైలులో ఉంది

## అన్యాయం యధేచ్ఛగా బయట తిరుగుతోంది: మాజీ ఎమ్మెల్యే వనమాడి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,అక్టోబరు 8, ప్రభాతవార్త :** జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో న్యాయం అంధకారంలోకి కూరుకుపోయిందని నిజాయతీ పరుడు జైల్లో మగ్గుతున్నాడని అవినీతిపరుడు యదేచ్ఛగా బయట తిరుగుతున్నాడని అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ న్యాయాన్ని కనుచూపు మేరలో లేకుండా జగన్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కాకినాడ సిటీ నియోజకవర్గంలో వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో 26వ రోజు బాబుకు తోడుగా మేము సైతం అంటూ స్వర్ణకారుల సంఘం కార్మికులు, మెరైన్ లేత వర్క్స్ అసోసియేషన్, శ్రీ భగీరథ సగర సంఘం, షీట్‌మెటల్ వర్క్స్ అసోసియేషన్ సభ్యులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బిసి కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్‌రావు, గ్రంధి నారాయణరావు పాల్గొని దీక్ష పరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు. స్వర్ణకారుల, వడ్రంగి, సగర, షీట్‌మెటల్, లేత్ వర్క్స్ కార్మికుల పనిముట్లను దీక్షా శిబిరం నందు ప్రదర్శించి వినూత్న నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు నేడు అగమ్య గోచరంగా తయారైందని, జగన్ రెడ్డి ప్రభుత్వం దుర్మార్గాలను అరాచకాలను ప్రశ్నిస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి వ్యవస్థలను మేనేజ్ చేస్తూ నియంత పాలన సాగిస్తున్నాడని, తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి పథంలో నడిపించి అభివృద్ధి చేసిన చంద్రబాబుపై ఎటువంటి ఆధారాలు లేకుండా, ఏ తప్పు చేయకపోయినా అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టారని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ముందుగా 3వేల కోట్ల అవినీతి జరిగిందని, తర్వాత 370 కోట్లు అని, ఇప్పుడు 27కోట్లు అంటున్నారని, ఓటమి భయంతో వైఎస్సార్సీ ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి తాడేపల్లి ప్యాలస్‌లో పైశాచిక ఆనందం పొందుతున్నాడని, ప్రభుత్వ హాయాంలో కులవృత్తులపై ఆధారపడిన వర్గాలకు సబ్సీడా ద్వారా పనిముట్లను అందజేసి ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందని, నేడు అన్ని వర్గ్గాల్ని మోసం చేసి అరాచక పాలన చేస్తున్న జగన్మోహనరెడ్డిని ప్రజలు ఇంటికి పంపే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరవ శ్రీనివాసరావు, చేబ్రోలు వీరబాబు, పుట్టాభాస్కర్‌రావు, ప్రసాద్, అప్పారావు, సంగాడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి దుర్గగుడి తరపున పట్టువస్త్రాల సమర్పణ

**కాణిపాకం, అక్టోబరు 8 ప్రభాతవార్త:** కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సిద్ధి, బుద్ధి సమేత గణనాధులకు విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు ప్రముఖ ఆలయాల నుండి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలనుసమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం తరపున ఆలయ ఛైర్మన్ రాంబాబు, ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, అర్చకులు, పాలకమండలి సభ్యులు, ఆదివారం ఉదయం కాణిపాకం చేరుకుని పట్టువస్త్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. వీరికి ఆలయ ఈఓ వెంకటేశు, మాజీ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామివారి ఎదుట వుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో దుర్గగుడి ఆలయ ఏఈఓ రమేష్, కాణిపాకం ఆలయ ఎఇఒ ఎస్వీ, కృష్ణారెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, దుర్గమ్మ దేవస్థానం, సిబ్బంది, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛను కాపాడాలి: ఎపియుడబ్ల్యుజె



విజయవాడ ఎపియుడబ్ల్యుజె అర్భన్ కమిటీ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

### విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కంచల జయరాజ్

### ఎపియుడబ్ల్యుజె అర్బన్ కమిటీ అధ్యక్షుడిగా చావా రవి

**విజయవాడ, అక్టోబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి :** దేశంలో, రాష్ట్రంలో పాత్రికేయులు, ప్రచురణ, ప్రసార మాధ్యమాల నియంత్రించాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబులో జరిగిన "ఎపియుడబ్ల్యుజె" విజయవాడ యూనిట్ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. మీడియాపై జరుగుతున్న దాడులు ప్రజాస్వామిక విలువలను కాలరాస్తున్నాయని, అటువంటి చర్యలను అడ్డుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానించింది. వైఎస్సార్సీపి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలకోరింది. అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, ప్రెస్ అకాడమీ పాలకవర్గం ఏర్పాటుతో పాటు వృత్తిపరమైన కమిటీలు అన్నింటిని నియమించాలని రైల్వే పాసులు పునరుద్దరించాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. "ఎపియుడబ్ల్యుజె" అర్బన్ అధ్యక్షులు చావా రవి అధ్యక్షతన ఆదివారం ఉదయం విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లోని జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిధులుగా "ఎపియుడబ్ల్యుజె" రాష్ట్ర అధ్యక్షులు ఐవిసుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్‌లు హాజర య్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి, మీడియా స్వేచ్ఛకు తూట్లు పొడిచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పాత్రికేయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. మీడియా, పాత్రికేయులను పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం మీడియా కమీషన్‌ను, పత్రిక చట్టాన్ని తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో "ఎపియు డబ్ల్యుజె" విజయవాడ కమిటీ, విజయవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

"ఎపియుడబ్ల్యుజె" విజయవాడ కమిటీ అధ్యక్షులుగా చావా రవి, ఉపాధ్యక్షులుగా ఎంవి సుబ్బారావు, సురేంద్ర కుమార్, కార్యదర్శిగా ఆర్ఎస్ కిరణ్ (వసంత్), కోశాధికారిగా పివి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా జిబి బాబు, జి.శ్రీనివాస్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యం.బురయ్యతో పాటు మరో ఆరుగురిని నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా కంచల జయరాజ్, ఉపాధ్యక్షులుగా ఎం.మురళీకృష్ణ, టి శివరామకృష్ణ, కార్యదర్శిగా దాసరి నాగరాజు, సహాయ కార్యదర్శిగా ఇవి కోటిరెడ్డి, పి రత్నాకర్‌రావు, ట్రెజరర్‌గా సయ్యద్ అహ్మద్ హుస్సేన్‌తో పాటు మరో ఆరుగురిని ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గంగా ఎన్నుకున్నారు.

# చిత్తూరు, తిరుపతి జిల్లాల సిట్టింగ్ ఎమ్మెల్యే టిక్కెట్లపై అంచనాలు

**తిరుపతి, అక్టోబరు 8ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎన్నికల రాజకీయం మొదలైంది. నిర్ణీత సమయంలోనే 2024లో ప్రభుత్వం ఎన్నికలకు సమాయత్తమవుతున్నా.... అందుకు వైఎస్సార్సీ శ్రేణుల్ని, మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలను సిద్ధం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్ కార్యాచరణ రూపొందించారు. ఆ దిశగా వేస్తున్న అడుగుల్లో విజయవాడలో సోమవారం(నేడు)ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సొంతజిల్లా అయిన చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 14నియోజకవర్గాలకు గాను 13స్థానాల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు.

నవరత్నాలతో...పేదప్రజల ఆకాంక్షలే పార్టీ సిద్దాంతం నినాదంతో 2019లో వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర సునామితో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాను అన్ని నియోజకవర్గాలు ఆపార్టీ దక్కించుకుంది. గత నాలుగుసంవత్సరాలుగా 13మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉండగా వారిలో ఒకరు ఉపముఖ్యమంత్రి, మరో ఇద్దరు మంత్రి పదవుల్లో కొనసాగుతున్నారు. ఇదే సమయంలో రెండేళ్ల క్రిందట జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలతో సహా మున్సిపల్, తిరుపతి, చిత్తూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లోనూ పార్టీ సత్తాచాటి జిల్లాలో ఎదురులేని నేతలుగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు విజయ బావుటా ఎగరవేస్తూ వచ్చారు. అయితే ఈ ఏడాది జరిగిన చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం అభ్యర్థులు గెలుపొందారు. అప్పటి నుంచి తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వైఎస్సార్సీ అంచనాలు వేస్తున్నా ప్రతిపక్ష టిడిపిని ఎక్కడకక్కడ అణచివేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో 2024ఎన్నికలకు సమాయత్తమయ్యే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పక్కా వ్యూహం రచించారు. ఓ సర్వే సంస్థ ప్రతినిధులు జరిపిన సర్వేల ఆధారంగానేగాక పార్టీకి క్షేత్రస్థాయిలో ఉన్న బలాన్ని బేరీజువేసుకుని సిట్టింగ్ ఎమ్మెల్యేల పనితీరు, వారి భవిష్యత్తుపై నివేదికలు సిద్ధంచేసుకున్నారనేది పార్టీలో చర్చ. ఇప్పుడు సోమవారం విజయవాడలో ఎమ్మెల్యేలు, మంత్రులతో, ప్రతినిధులతో సమావేశమవుతుండటంతో ఉభయ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేల్లో టిక్కెట్ భవితవ్యం ఏమిటనే సందిగ్ధత నెలకొంది. ఎమ్మెల్యేల పనితీరు, ప్రజల్లో ఉన్న విశ్వాసం బట్టి భవిష్యత్తు నిర్ణయిస్తారనే వ్యాఖ్యలు సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొంత టెన్షన్‌కు కారణంగా మారింది. పనితీరు బాగాలేని ఎమ్మెల్యేలు ఎవరనేది ఇప్పటికే సమచారం ఉన్నా సత్యవేడు, గూడూరు, సూళ్ళూరుపేట నియోజక వర్గాల్లో అభ్యర్థులుగా కొత్తవారిని తెరపైకి తీసుకువచ్చే అవకాశం లేకపోలేదనేది పార్టీవర్గాల్లో చర్చ మొదలైంది. ఉభయజిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో బాటు మరో నలుగురు సిట్టింగ్‌లకు మినహా మిగిలిన వారికి టిక్కెట్ వచ్చే అవకాశం లేదనేది గుప్పుమంటోంది.

ఇప్పటికే చంద్రగిరి టిక్కెట్ ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే, తుడ ఛైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడికే కేటాయిస్తున్నట్లు సిఎం జగన్ స్పష్టత ఇచ్చారనే విషయం తెలిసిందే. తిరుపతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కుమారుడు నగరపాలక ఉపమేయర్ భూమన అభినయ్‌రెడ్డి పేరు ఖరారైందనేది పార్టీవర్గాల సమాచారం.



పట్టువస్త్రాలను తీసుకువస్తున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు

## ఘనంగా ముగిసిన కాణిపాకం బ్రహ్మోత్సవాలు

**కాణిపాకం, అక్టోబరు 8 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో 21 రోజులు పాటు జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి జరిగిన తెప్పోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఆలయంలో గత నెల 18 నుండి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి. ఈమేరకు ఈనెల 19న ధ్వజారోహణం, హంసవాహనసేవతో ప్రారంభమైన నవరాత్రి బ్రహ్మోత్సవాలు 27న జరిగిన ధ్వజావరోహణం, వడాయత్తుఉత్సవం, ఏకాంతసేవతో ముగిశాయి. అదేవిధంగా 28న అధికార నందివాహనసేవతో ప్రారంభమైన ప్రత్యేక ఉత్సవాలు ఆదివారం రాత్రి జరిగిన తెప్పోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఈఉత్సవాలను 21 రోజులుపాటు అత్యంత వైభవోపేతంగా నిర్వహించడంలో ఆలయ అధికారులు సఫలీకృతులయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉభయదారులు పోటీలుపడి ఉత్సవాలను నిర్వహించడంతో వైవిధ్యభరితంగా ఉత్సవాలు సాగాయి. అలాగే ఉత్సవాల సందర్భంగా స్దానిక ఆస్థాన మండపంలో సంప్రదాయమైన రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఆహుతులను రంజింపజేశారు. రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ కాణిపాకం సందర్శనార్ధం వచ్చే భక్తులకు 21 రోజులుపాటు దేవస్థానం ఆధ్వర్యంలోని నితాన్నదాన పథకం ఉచితభోజన వసతి కల్పించారు. ఈకార్యక్రమానికి భక్తులనుండి అనూహ్య స్పందన లభించింది. ఇదిలావుండగా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు కీలకపాత్ర పోషించారు.

చితూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవి శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు భారీబందో బస్తు ఏర్పాటు చేశారు. ముందస్తు ప్రణాళికలతో చిన్న చిన్న అవాంచనీయ సంఘటనలు సైతం కూడా జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవడంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

# ఆశా వర్కర్లు దేవుళ్లతో సమానం

### ఆశా వర్కర్ కృపమ్మ కుటుంబానికి లోకేష్ రూ.2లక్షల ఆర్థికసాయం





కృపమ్మ కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందజేస్తున్న పంచుమర్తి అనురాధ, పీతల సుజాత, నన్నపనేని రాజకుమారి తదితరులు

**అమరావతి, అక్టోబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి:** తాడేపల్లి ఆశావర్కర్ రేపూడి కృపమ్మ కుటుంబానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ మంజూరుచేసిన రూ.2లక్షల ఆర్థికసాయాన్ని టిడిపి మహిళా నేతలు అందజేశారు..ఆదివారం ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి పీతల సుజాత, రాష్ట్ర మహిళ కార్పొరేషన్‌మాజీ చైర్ పర్సన్ నన్నపనేనిరాజకుమారి కృపమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఈ ఆర్థికసాయం అందించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ, ఆశా వర్కర్లు దేవుళ్లతో సమానమని పేర్కొన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకపోయినా అధిక పనిఒత్తిడి కారణంగానే కృపమ్మ మృతి చెందిందని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు సరైన ట్రైనింగ్ ఇవ్వకుండా ఈ ప్రభుత్వం ఒత్తిడికి గురిచేస్తోందని విమర్శించారు. అరకొర జీతాలు ఇస్తూ ఆశా వర్కర్లకు నవరత్నాలు ఆపేశారని అన్నారు.. ఆరోగ్య సురక్ష పేరుతో ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా బిపి, షుగరు ముందలే ఇస్తున్నారని అనురాధ విమర్శించారు. టిడిపి, సిఐటియు రెండు రోజుల నిరసనతో ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. తమ పార్టీ నేత లోకేష్ బాధలో ఉన్నప్పటికీ నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్నారని అనురాధ పేర్కొన్నారు.

# బిసిల జనగణనపై నోరెత్తని జగన్‌రెడ్డి

### టిడిపి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో బిసిల జనగణన

### పొలిట్ బ్యూరో సభ్యుడు 'యనమల' వెల్లడి



**అమరావతి, అక్టోబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో బిసిల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి దోహదపడే బిసిల జనగణనపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు బిసిలకు తీరని ద్రోహం చేస్తోందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. దేశంలో అనిన రాష్ట్రాలకంటే ముందే టిడిపి హయాంలో శాసనసభలో బిసి జనగణనపై తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని అన్నారు. ఇప్పటి వరకు ఆమోదంపై సిఎం ఎందుకు శ్రద్ధ పెట్టలేదని ప్రశ్నించారు.. ఢిల్లీ పర్యటనల్లో బిసి జనగణన గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. జగన్‌కు బిసిల అభివృద్ధి ఇష్టంలేకే బిసిల జనగణనపై నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.. బీహార్‌లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వం జనగణన మొదలుపెట్టి పూర్తి చేస్తే, ఆంధ్రప్రదేశ్‌లోమాత్రం అక్రమ కేసులు, వేధింపులతో జగన్‌రెడ్డి మునిగి తేలుతున్నారని అన్నారు. టిడిపి మహానాడులో కూడ బిసి జనగణనపై తీర్మానం చేయటం జరిగిందని అన్నారు. బిసి జనగణనకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోనసం తెలుగుదేశం పార్టీ పనిచేస్తుంటే,, పెత్తందార్ల కోసమే వైఎస్సార్సీ పనిచేస్తోందని అన్నారు.. బిసి సబ్‌ప్లాన్‌ను తీసుకొచ్చి 139 కులాలకు టిడిపి సమన్యాయం చేస్తే జగన్‌రెడ్డి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను దారి మళ్లిస్తూ పెత్తందారులకు కాపలాదారుడిగా మారారని అన్నారు.. బిసిల అభ్యున్నతి కోసం మురళీధర్‌రావు కమిషన్‌ను ఏర్పాటు చేయటంతోపాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, చేతి వృత్తిదారులకు ప్రోత్సాహం, బిసిలకు సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, బిసి స్టడీ సర్కిళ్లు, బిసిలకు విదేశీ విద్య, ఆదరణ వంటి పథకాలకు శ్రీకారం చుట్టింది తెదేపానే అన్నారు. తెదేపా అధికారంలోకి రాగానే బిసి జనగణన చేపట్టి బిసిల అభివృద్ధికి బాటలు వేస్తామని యనమల పేర్కొన్నారు.

## నేటి నుంచి పుణె ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 8 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుతం పుణె హడాప్సర్-హైదరాబాద్-పుణె హడాప్సర్‌ల మధ్య నడుపుతున్న నెంబర్ 17014/13 త్రై వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 09 సోమవారం నుంచి సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని ఖాజీపేట వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి సోమ, గురు, శనివారాల్లో ఖాజీ పేట నుంచి పుణె హడాప్సర్‌కు బయల్దేరే నెం.17014 త్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు ఖాజీ పేట నుంచి సాయంత్రం 6:15 గంటలకు బయల్దేరి, జనగాం 06:59/07:00, భువనగిరి 07:29/30, సికింద్రాబాద్‌కు రాత్రి 8:25/35, బేగంపేట 08:46/47, లాతూర్ రోడ్ తెల్లవారు జామున 03:00/05, పుణె హడాప్సర్‌కు ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాలలో ఉదయం 10:50 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పూణె హడాప్సర్ నుంచి ఖాజీ పేటకు బయల్దేరే నెంబర్ 17013 త్రై వీక్లీ ఎక్స్ ప్రెస్ ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాలలో మధ్యాహ్నం 03:30-గంటలకు పుణె హడాప్సర్ నుంచి బయల్దేరి, లాతూర్‌రోడ్డు రాత్రి 9:30/35, బేగంపేట 02:09/10, సికింద్రాబాద్‌కు తెల్లవారుజామున 02:35/45, భువనగిరి 03:19/20, జనగాం 03:49/50, ఖాజీపేటకు ప్రతి బుధ, శని, సోమ వారాల్లో ఉదయం 6:45గంటలకు చేరుకుంటుంది.

వార్త

చక్కగా మాట్లాడదలుచుకున్నవారు ముందు చక్కగా వినడం నేర్చుకోవాలి.

-ఆర్.ఫోకాల్ట్

# మరుగుతున్న పశ్చిమాసియా!

ఒకపక్క రష్యా ఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధం మారణహోమం సృష్టిస్తుంటే ఇప్పుడు తాజాగా అకస్మికంగా ఎలాంటి సంకేతాలు లేకుండా ఇజ్రాయెల్, పాలస్తీనాలోని హమాస్ మధ్య శనివారం ప్రారంభమైన భీకరపోరు ఒక్కసారిగా యావత్ ప్రపంచాన్ని ఉలిక్కిపరిచింది. పశ్చిమాసియాలో ఈ యుద్ధం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాధినేతలు ఈ ఉగ్రదాడులను ముక్తకంఠంతో ఖండిస్తు న్నారు. ఇప్పటికే ఈ పోరులో వందలాదిమంది మృతి చెందగా వెలాదిమంది క్షతగాత్రు లయ్యారు. శనివారం 'ఆపరేషన్ అక్సా ఫ్లడ్' పేరుతో ఇజ్రాయెల్‌పై దాదాపు ఏడువేల రాకెట్లతో అటు జల, వాయు ముప్పేటగా పాల స్తీనా మిలిటెంట్ల మెరుపు దాడులకు దిగగా ఇజ్రాయెల్ కూడా అందుకు దీటుగా 'ఆపరేషన్ స్వోర్డ్స్ ఆఫ్ ఐరన్' పేరుకు దిగడంతో రక్తపు టేరులు పారుతున్నాయి. ఇజ్రాయెల్ పౌరుల యూదుల పర్వదినాలైన సిమాన్స్ టోరా, యామ్‌కిప్పురా హిబ్రూ షబ్బత్ వేడుకల్లో మునిగి ఉండగా హమాస్ ఉగ్రవాదులు ఒక్కసారిగా రాకెట్లతో విరుకుపడ్డారు. సముద్రమార్గం, గగనతలంతోపాటు సరిహద్దుల్లోని ఫెన్సింగ్‌ను ఎక్స్‌కలేటర్లతో కూల్చివేసి ఇజ్రాయెల్‌లోకి చొచ్చుకువచ్చారు. ఈదాడులు ఆదివారం కూడా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు దాదాపు ఆరు వందల మందిపైగా మృతిచెందగా వేలాదిమంది క్షతగాత్రులయ్యారు. గాయపడ్డవారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. పాలస్తీనా మిలిటెంట్లు ఎంతో పకడ్బందీగా తమ దాడులు గూర్చి ముందుగా ఏమాత్రం సమాచారం బయటకు పొక్కకుండా గట్టి పటిష్టమైన వ్యూహాన్ని పన్నడం అందరినీ ఆశ్చర్య పరుస్తున్నది. బి5 వంటి అధునాతమైన యుద్ధవిమానాలు, విధ్వంసకర క్షిపణులు, సుశిక్షిత బలగాలు, శక్తివంతమైన దేశంగా గుర్తింపు పొందిన ఇజ్రాయెల్ ఈ దాడిని పసిగట్టక పోవడం ఆశ్చర్యపరుస్తున్నది. అన్నిటికంటే ముఖ్యంగా ప్రపంచంలోనే గుర్తింపుగల సాంకేతిక పరికరాలతో ఇంతో పటిష్టమైన గూఢచారి వ్యవస్థ ఆ దేశానికి ఉంది. అలాంటి దేశంపై చిన్న మిలిటెంట్ ముఠా ఇలా మెరుపుదాడి చేసి భీభత్సం సృష్టించడం కలవర పరుస్తున్నది. ఇజ్రాయెల్ సరిహద్దు మొత్తాన్ని అనుక్షణం వీక్షించేలా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల కళ్లు కప్పి ఉగ్రవాదులు ఇజ్రాయెల్ చరిత్ర లోనే అతిపెద్ద చొరబాటుకు పాల్పడ్డారు. హమాస్ ఉగ్రవా దులు ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించినా, సరిహద్దుల్లోని ఫెన్సింగ్ తొలిగించినా నిఘావర్గాలు పసిగట్టకపోవడం అనేక విమర్శలకు గురిచేస్తున్నాయి. హమాస్ చేసిన మొదటి దాడి కాదిది. గతంలో ఎన్నోసార్లు దాడులకు పాల్పడింది. హమాస్‌కు దాదాపు మూడు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. లోపాయకారీగా ఎన్నో దేశాలు సహకరిస్తున్నాయి. హమాస్ (హర్కత్ అల్ ముఖావామా అల్ ఇస్లామియా) పాలస్తీనాలోని రెండు రాజకీయ పక్షాల్లో ఇది ఒకటిగా చెప్పవచ్చు. 1987లో వెస్ట్‌బ్యాంక్, గాజా తూర్పు జెరూసలేంలో ఇజ్రాయెల్ ఆక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీన ప్రాంతంలో జరిగిన మొదటి తిరుగుబాటు సమయంలో షేక్ అహ్మద్ యాసిన్ నేతృత్వంలో హమాస్ ఏర్పాటయింది. అప్పట్లో అది ముస్లిం బ్రదర్‌హుడ్ సంస్థకు అనుబంధ విభాగంగా ఉండేది. ఇజ్రాయెల్‌ను ధ్వంసం చేయాలని ఒకప్పటి పాలస్తీనాను పునరుద్ధరించి ఇస్లామిక్ సమాజాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు 1988 హమాస్ తన చార్టర్‌లో ప్రచురించింది. 1993లో పాలస్తీనా నేత యాసర్ ఆరాఫత్, అప్పటి ఇజ్రాయెల్ ప్రధాని ఇజ్హాక్ రాబిన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. ఓస్లో ఒప్పందం ప్రకారం వెస్ట్‌బ్యాంక్ గాజాల్లో పాలస్తీనా ఆధ్వర్యంలో పరిమిత స్వయంపాలన ప్రభుత్వం ఏర్పాటుకు నాంది పలికారు. కాని ఈ ఒప్పందాన్ని, స్వయంపాలనను హమాస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ ఒప్పందాన్ని అంగీకరించమని ఆందోళనలు, నిరసనలతో హింసా మార్గంవైపు అడుగులు వేసింది. అదే యేడాది మొట్టమొదటిసారిగా ఏప్రిల్‌లో ఆత్మాహుతి దాడికి పాల్పడింది. అప్పటినుంచి ఎక్కడ వీలైతే అక్కడ అవకాశం దొరికినప్పుడల్లా దాడులకు పాల్పడుతూనే ఉంది. దీంతో అమెరికా, బ్రిటన్ లాంటి దేశాలు విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించాయి. రెండువేల సంవత్సరంలో మరో తిరుగుబాటుకు హమాస్ నాయకత్వం వహించి ఉగ్ర దాడులకు పాల్పడింది. వందలాది ఇజ్రాయెల్ వాసులను బలితీసుకున్నది. 2006లో ఇజ్రాయెల్ సైనికుడు షాలిత్‌ను హమాస్ కిడ్నాప్ చేసి, ఐదేళ్ల తరువాత వెయ్యిమంది పాలస్తీనా ఖైదీలను వదిలిపెట్టిన తరువాతకానీ విడిచిపెట్టలేదు. నిఘా విభాగాల కళ్లుగప్పి దేశంలోకి ప్రవేశించి దాడు లకు పాల్పడడం బహుశా ఇజ్రాయెల్ చరిత్రలో ఇదే మొదటి సారి కావచ్చు. దాడులనుంచి తేరుకుని తిరిగిఎదురుదాడులు చేసేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎంతో ఆస్తినష్టం జరిగింది. ఎన్నోప్రాణాలు పోయాయి. ఈ పరిస్థితుల్లో ఆదేశానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. 'తీవ్రవాదం ఎప్పటికీ సమర్థనీయం కాదని, తమ పౌరులను రక్షించుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని, ఈ పరిస్థితిని ఎవరైనా అవకా శంగా తీసుకుంటే ఊరుకునేది లేదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉగ్రవాదం ఏరూపంలో ఎక్కడున్నా పజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిందే.

మంచి పనిని మించిన పూజ లేదు. మానవతను మించిన మతం లేదు.



అంబేద్కర్

మనకున్న దురాభిప్రాయాన్ని పట్టుకొని వేళ్లాడేకంటే దాన్ని మార్చుకోవడమే మంచిది.



సోక్రటీస్

## ప్రజావాక్కు



### బకాయిలకు మోక్షం ఎప్పుడు?

దాదాపు సంవత్సరకాలం నుండి ఉపాధ్యాయులకు చెల్లించవలసిన సిపిఎస్ ఉద్యోగులకు ఇచ్చేటటువంటి 90 శాతం నగదు డిఏ మూడు విడతలుగా ఇచ్చే బకాయిలు, సంవత్సరకాలమైన ఇంకా మంజూరుకాలేదు. పిఆర్‌సి బకాయిలు కేవలం నాలుగు విడతలుగానే ఇచ్చారు. దాదాపు అవి కూడా పెండింగ్ ఉద్యోగులకు ఇచ్చే మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్ ఎన్ క్యాష్మెంట్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటి చెల్లింపులు ఎప్పుడు? అర్థంకాని పరిస్థితి ఉంది. ట్రెజరరి అధికారులు కూడా సమాచారం ఇవ్వడం లేదు. ఆర్థికశాఖ నుండి క్లియరెన్స్ వచ్చినా కూడా బిల్లులు చెల్లించడం లేదు. ఎన్నికలు తరముకొస్తున్న వేళ, ఇకనైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా అధికారులు స్పందిస్తే బాగుంటుంది.

-యాడవరం చంద్రకాంత్ గౌడ్, హైదరాబాద్

### వృద్ధులను కాపాడండి

కంటికి రెప్పలా కాపాడాల్సిన జననీ జనకులను వృద్ధాశ్రమాల పాలు చేస్తున్నారు కొంతమంది సుపుత్రులు. తమ కష్టార్జితంతో రెక్కలు ముక్కలుచేసుకొని తమ పిల్లలకు బంగారు భవిష్యత్తును అందించిన తల్లిదండ్రుల పట్ల అత్యంత బాధ్యతారాహిత్యంగా కర్కశంగా వ్యవహరిస్తున్నారు. మాతృదేవోభవ, పితృదేవోభవ అనే పవిత్రపదానికి తూట్లు పొడుస్తున్నారు నేటితరం యువకులు. ముఖ్యంగా నవమోసాలు మోసి కనీ పెంచిన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏమాత్రం జాలి, దయ లేకుండా వారివురిని వృద్ధాశ్రమాల పాలు చేస్తున్న కొంతంది సుపుత్రుల తీరు తెన్నులు ఏమాత్రం క్షమార్హం కానివి. నేటితరంయువత కళ్లుతెరచి జరుగుతున్న దారుణాలను చూసి చూడనట్లుగావ్యవహరించకుండా వారికష్టసుఖాలలో పాలు పంచుకుంటూ వారికిఉన్నంతలోఎలాంటి లోటు లేకుండా చూడాల్సిన కనీస ధర్మం బాధ్యత యువత భుజస్కంధాలపై ఉంది.

-బి.మధుపాళి, నంద్యాలజిల్లా

### నిప్పుతో చెలగాటం

భారతదేశ సరిహద్దుల్లో చైనా,పాకిస్థాన్, తదితర దేశ ఉగ్రవాదులు, సైనికులు, పదేపదే మన భూభాగంలోకి చొచ్చుకు రావడం కవ్వింపు చర్యలు చేపట్టడం క్షమించరానిది. డ్రోన్ల ద్వారా అప్పుడప్పుడు కలకలం సృష్టించి,ప్రాణనష్టం, ఆస్తినష్టం చేయడం పరిపాటి. శాంతికి మారు పేరయిన మన సహనాన్ని పరీక్షించడంజవాన్‌లపై, భూభాగంపైకానీ కయ్యానికి కాలు దువ్వుతుండడం ఎంతమాత్రం సహించేది లేదు.

-ఆర్.వెంకటేష్ చరణ్, బెంగళూరు

### రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి

రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలు కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ ఫోన్ మాట్లాడకూడదని అందరికీ తెలుసు. అయితే దానిని పాటించడంలో మాత్రం తీవ్రనిర్లక్ష్యం చూపుతున్నారు. డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్‌లు ఉపయోగించడం వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలురోజురోజుకు అధికమవుతున్నాయి. ద్విచక్ర వాహన దారులు కచ్చితంగా నాణ్యమైన హెల్మెట్లు ధరించాలి. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి. హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యం వహించరాదు. అనేక కారణాల వల్ల యేటా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడం బాధాకరం.

-పి.మహమ్మద్ రఫి, హైదరాబాద్

### ఆధ్యాత్మిక విలువ ఆధారిత విద్య

ఒక వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ అతి ముఖ్యమైనది. అతని భవిష్యత్తును నిర్దేశం చేస్తూ అతని వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసి రూపుదిద్దేది ఈ దశే. ఆధ్యాత్మిక ఆదర్శమే ఎల్లప్పుడూ భారత్ స్వభావం,ఆకాంక్ష. ఆత్మశక్తితో జీవితాన్ని జయించడం మన ఆదర్శం. దైవఅభివృద్ధికి జరిగేప్రయత్నంగా ప్రపంచాన్ని అంగీకరించాలి. ఇంతవరకు సాధించని అభివృద్ధికై జరిగే ప్రయత్నంగా ఆధ్యాత్మిక విద్యాకృషిని అంగీకరించాలి. సత్యం, వెలుగు, ధర్మ, ఆత్మశక్తితో మన విద్యావిధానం పోతపోయాలి. ఆధునిక పోకడలను ఆకలింపు చేసుకుంటూనే మానవతా విలువలు పెంపొందించే పాఠ్యప్రణాళికలను సిద్ధం చేయాలి. ఆత్మనిర్భర్ భారత్ శక్తితో యువత ముందుకు సాగాలి. ఈ విషయాన్ని సదా మననం చేసుకోవాలి. ఈ గొప్ప పరివర్తన దిశగా పనిచేయడం భారత్‌కే సాధ్యం. వ్యక్తికొరకు అతని వికాసం కోసం అంతర ఆధ్యాత్మిక జీవనాన్ని భారత్ ఆవిష్కరణ చేసింది.

-డా. ఎం. ఉపేంద్రశర్మ, శ్రీకాకుళంజిల్లా

### ప్రతినిధులకు విద్యార్హతలు అవసరం

పంచాయతీ నుండి పార్లమెంటు వరకు గల్లీ నుండి ఢిల్లీ వరకు 2024వ సంవత్సరంలో జరగబోయే ప్రతి ఎన్నికలలో గ్రామ మండల జిల్లా రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధుల నియోజకవర్గాలు స్థాయిలనుబట్టి ప్రజాప్రతినిధులకు విద్యార్హతలు నిర్ణయించాలి. నిరక్షర్యాసులు ప్రజాప్రతినిధులుగా ఉన్నచోట సంక్షేమ పథకాలు అభివృద్ధి కుంటుపడుతుంది. కనుక తప్పనిసరిగా విద్యావంతులైన నిరుద్యోగులు ప్రజాసేవ ప్రజాప్రతినిధిగా ఎన్నిక కావడానికి సేవచేయడానికి అవకాశం ఉంటుంది. అవినీతి నిర్మూలన జరుగుతుంది. సకాలంలో పనులు జరుగుతాయి.

-ఆర్. రవీందర్, జనగాం

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# సంక్షేమాభివృద్ధి రాజకీయలబ్ధికి కాకూడదు!

**అటు ప్రజలు కానీ ఇటు ప్రభుత్వాలు కానీ బాధ్యతాయుతంగా ఈ 'ఉచితాల' ప్రణాళికలను అమలుపరుస్తేనే నిజమైన అభివృద్ధి, సంక్షేమం ఈ పథకాల ద్వారా లభ్యపడుతుంది. విద్య, ఆరోగ్యం, ఉచితంగా అందించే బాధ్యత ప్రభుత్వాలదే అన్న విధానం తు.చ తప్పకుండా ఆచరిస్తే ఎన్నికల ప్రలోభాల కోసం ఆ పేరుతో రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకుంటున్నాయన్న విమర్శగా వినిపిస్తున్న వాస్తవం, తక్షణం తొలగిపోతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలకు అది శుభసూచికగా మారుతుంది. ఏ విధంగా అభివృద్ధి సాధించాలన్నది ప్రస్తుతం రాష్ట్రాలకూ, కేంద్రానికి సవాలుగా మారిన ఈ తరుణంలో అభివృద్ధి,సంక్షేమం, జనామోదంతో రాజకీయాలబ్ధికోసం, ఓట్లను ప్రభావితం చేయడం కోసం కాకుండా నిజమైన ప్రగతికోసం తలపెట్టినప్పుడే జాతి పురోభివృద్ధిని సాధిస్తుంది. రాజకీయ పార్టీలు ఆ వాస్తవాన్ని గుర్తిస్తే బాగు. అందరికీ మేలు చేసినవారవుతారు.**



రావులపాటి సీతారాంరావు

ఎన్నికల హడావిడి మొదలైందని కాదు కానీ అభివృద్ధి సంక్షేమం అన్న ఎజెండాలతో అన్ని పార్టీలూ ఓటర్లను ఆకట్టుకోవడానికి మేనిఫెస్టోలు రూపొందించుకొని ఎన్నికలతో సంబంధం ఉన్న ప్రతివారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు యిహ మళ్లీ మొదలు పెట్టారు. కాంగ్రెస్‌పార్టీ స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వ పగ్గాలు చేపట్టి పంచవర్ష ప్రణాళికలతోపాటు రాజకీయ స్వాతంత్రం, ఆర్థిక స్వాతంత్రం కూడా దేశ ప్రజలకు సమకూర్చాలని ఆరాటపడ్డ మాటను ఎవరూ కాదనలేరు! నాగార్జున సాగర్‌లాంటి బృహత్తర కార్యక్రమాలూ, మౌలిక వసతులు కల్పించే ప్రాజెక్టులు, రోడ్లు, బ్రిడ్జిలు, రైల్వేలు, విమానాశ్రయాలు, మారిన్ ప్రాజెక్టులు (పోర్టులు, హార్బర్లు, డాక్స్ లాంటివి) బిల్డింగ్ ప్రాజెక్టులు (పేద, మధ్య తరగతి గృహసముదాయాలు) ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు (పవర్ ప్లాంట్స్, స్టీల్ ప్లాంట్స్, ఫర్టిలైజర్ ప్లాంట్స్ లాంటివి) పెద్దఎత్తున తలపెట్టి నిజమైన అభివృద్ధికి రాజబాటలను వేసింది. ఇతర రాజకీయ పార్టీలు కూడా కాంగ్రెస్ పార్టీ దేశాధికారాన్ని కోల్పోయిన తర్వాత అభివృద్ధితోపాటు సంక్షేమం మీద దృష్టిపెట్టి అవసరాలు తీర్చడానికి అట్టడుగు మైనార్టీ వర్గాల వారికి ఉచితంగా సంక్షేమ చర్యలు తలపెట్టాయి. దేశానికి కావల్సింది ప్రజలు సుఖసంతోషాలతో ఉండటం సామాజికాభివృద్ధితోపాటు, రాజకీయ ఎదుగుదల, ఆర్థికాభివృద్ధిని ప్రతి ఒక్కరూ సాధించడం, రాజ్యాంగం వెల్ఫేర్ స్టేట్ స్థాపించాలన్న మార్గదర్శక సూత్రాన్ని ఎంపిక చేసుకోవడానికి ముఖ్య కారణం కూడా అభివృద్ధి సంక్షేమం ప్రజలకు సాధించుకోవాలనే! ప్రధానమంత్రి సెప్టెంబరు 14న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 50,700 కోట్ల రూపాయలు వెచ్చించే ప్రాజెక్టులకు నిర్మాణాలకు పునాదిరాళ్ల కార్యక్రమం పెట్టుకున్నది ఎన్నికల సందర్భంగానే. ఆ విధంగానైనా రాష్ట్రానికి మంచి జరిగితే ఎవరు కాదనగలరు? అయితే పునాదిరాళ్లను ఎన్నికల తర్వాత మర్చిపోతే ప్రజలు ఇలాంటి వాగ్దానాలను ఎన్నికల వాగ్దానాలుగానే గుర్తుపెట్టుకుంటారు. పదికొత్త పారిశ్రామిక ప్రాజెక్టులతోపాటు, కెమికల్ కాంప్లెక్స్ కూడా ఈ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంలో ఒక భాగం. సెప్టెంబర్ 18న తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఓటర్లకు 'గ్యారంటీ కార్డు' ఎన్నికల హామీగా ప్రసాదించింది. మహిళలకు 2,500 రూపాయలు నెలసరి ఆర్థిక సహాయం,500 రూపాయలు చేసే గ్యాస్ సిలిండర్లు, ఐదు లక్షలు పేదలకు ఇళ్లు కట్టుకోవడానికి, ఉచితంగా రాష్ట్రంలో మహిళలకు బస్సు ప్రయాణం, రూ.15వేలు యేడాదికి ప్రతిరైతుకు ఉచిత ఆర్థిక సహాయం, 200 యూనిట్ల కరెంట్ సహాయం, ప్రతిపేద గృహస్థుకూ, 10 లక్షల ఉచిత ఇన్సూరెన్స్ కవర్, ఐదు లక్షల ఆర్థిక సహాయం ప్రతి పేద విద్యార్థికీ (పెద్ద చదువుల నిమిత్తం)



ఉచితాలుగా ఎన్నికల సందర్భంగా ప్రకటించింది. ఇలాంటివి కర్ణాటక రాష్ట్ర ఎన్నికల సందర్భంగా ప్రకటించి కాంగ్రెస్ ఎన్నికలు గెలిచింది కూడా. తెలంగాణలో నిన్నగాక మొన్న ప్రధానమంత్రి ఉచితాలు తన పర్యటనలో ప్రకటించడం కూడా ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకోవాలి. అభివృద్ధి అనేది నెమ్మదిగా కాలక్రమేణా సాధించుకొనే ప్రగతిని సూచిస్తే, ఉచితాలు ఎన్నికల సందర్భంలో ఓట్లను ఆకర్షించే ఆయుధంగా గుర్తించడానికి ప్రజలు మన దేశంలో అలవాటుపడ్డారు. అయితే ఈ మధ్య కాలంలో అభివృద్ధి పథకాలు, సంపద సృష్టి అన్ని రాష్ట్రాల్లోనూ కుంటుపడుతున్నది. జనాకర్షక పథకాలు లెక్కకు మించి లెక్కలోకి వస్తున్నాయి. అప్పుచేసి పప్పుకూడు రాజకీయ పార్టీలు తినిపిస్తున్నాయి. అని అందరూ అనుకుంటున్నారు. అయితే ఆ అప్పు తమ తలల మీదనే భవిష్యత్తులో పెనుభారంగా పడబోతున్నదన్న సంగతి తక్షణ సహాయం లభించిందనే సంతోషంతో లాభం పొందినవారు లెక్క చేయడం లేదు. అది వేరే సంగతి. ఆర్థికాభివృద్ధి సాధించాలనే విషయాన్ని తప్పుపట్టడానికి ఎవరూ సాహసించరు కానీ జనాకర్షక పథకాలు కాలగమనంలో ఎలాంటి ప్రగతిని సాధిస్తాయన్నది ఇంకా జవాబు దొరకని ప్రశ్నగానే మిగిలిపోయింది. సంపద సృష్టికి అప్పులు చేసి ఆ సృష్టించిన సంపద ద్వారా అప్పుల బెడదను అధిగమించి, ప్రగతిని రాష్ట్రాభివృద్ధికి సాధించడం అందరూ హర్షిస్తారు. జనాకర్షక పథకాలు అంటే ఎక్కువగా 'ఉచితాలు'గా గుర్తింపబడుతున్న ఆర్థిక సహాయాలు, ఒక విధంగా దళారీ వ్యవస్థకు స్వస్తి పలికినమాట నిజం. నేరుగా ఉచితాలు పొందు వారి బ్యాంకుల్లోనే చాలావరకు డబ్బు చేరుతుండడం వలన కొన్ని లొసుగులు వున్నా వారి చేతికి ఆ సహాయం అందుతున్నదనే తృప్తి ప్రభుత్వాలకు కలగొచ్చు. అయితే ఆ సహాయాన్ని పొందిన వారు వారి అభివృద్ధికి వినియోగించుకుంటున్నారా- లేదా అనేది ఇంకా లోతుగా అధ్యయనం చేస్తేనే గాని తెలదు. చదువుకుంటున్న పిల్లల తల్లులకు విద్యకోసం నేరుగా చేసే సహాయం ఎంత వరకు సద్వినియోగపడుతున్నది? ఆవిధంగా కాకుండా పిల్లలు చదివే విద్యాసంస్థలకే నేరుగా ఆ డబ్బు అందచేస్తే కచ్చితంగా ఆ విద్యార్థులు విద్యకే ఉపయోగపడుతుంది కదా! తల్లులు తమకు పిల్లల విద్యకోసం అందే సహాయం అనేక కారణాలవల్ల వినియోగించుకోవడం లేదనేది ఈ మధ్య వినపడుతున్న విమర్శ. కేవలం ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం ఇలాంటి ప్రణాళికలను ఉపయోగించుకోవడం సరిగాదు. ఈ ఉచితాల కోసం ప్రభుత్వాలు అప్పు చేయక తప్పదు. ఆ అప్పు ఏవిధంగా తీర్చుకోవాలన్నది ఆ అప్పు చేసిన ప్రభుత్వాల బాధ్యతే అన్న నిబంధన విధించే అవకాశం రాజ్యాంగంలో లేదు. అటు ప్రజలు కానీ ఇటు ప్రభుత్వాలు కానీ బాధ్యతాయుతంగా ఈ 'ఉచితాల' ప్రణాళికలను అమలుపరుస్తేనే నిజమైన అభివృద్ధి, సంక్షేమం ఈ పథకాల ద్వారా లభ్యపడుతుంది. విద్య, ఆరోగ్యం, ఉచితంగా అందించే బాధ్యత ప్రభుత్వాలదే అన్న విధానం తు.చ తప్పకుండా ఆచరిస్తే ఎన్నికల ప్రలోభాల కోసం ఆ పేరుతో రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకుంటున్నాయన్న విమర్శగా వినిపిస్తున్న వాస్తవం, తక్షణం తొలగిపోతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలకు అది శుభసూచికగా మారుతుంది. ఏ విధంగా అభివృద్ధి సాధించాలన్నది ప్రస్తుతం రాష్ట్రాలకూ, కేంద్రానికి సవాలుగా మారిన ఈ తరుణంలో అభివృద్ధి,సంక్షేమం, జనామోదంతో రాజకీయాలబ్ధికోసం, ఓట్లను ప్రభావితం చేయడం కోసం కాకుండా నిజమైన ప్రగతికోసం తలపెట్టినప్పుడే జాతి పురోభివృద్ధిని సాధిస్తుంది. రాజకీయ పార్టీలు ఆ వాస్తవాన్ని గుర్తిస్తే బాగు. అందరికీ మేలు చేసినవారవుతారు. ●

# గ్రామాల స్వయం సమృద్ధి ద్వారానే దేశాభివృద్ధి

గడీల సుధాకర్‌రెడ్డి

ఒక ఆలోచన దాని ఆచరణ జీవితాలను అత్యున్నత స్థాయికి చేరుస్తుంది. సమిష్టి కృషి అభివృద్ధికి పునాదులు వేస్తుంది. రాచబాటలై రారాజులను చేస్తుంది. ఎవరో వచ్చి ఏదో చేసి మన బతుకులు బాగు చేస్తారనే బానిస మనస్తత్వాన్ని వదులుకోవడం నేటి రైతులకు నిరుద్యోగులకు అత్యావశ్యకం. అదీ దేశానికే వెన్నెముకలైన రైతులకు మరీ అవసరం. రైతులుస్వయం ఆలోచనలతో తమ వ్యవసాయం ద్వారా స్వయం సమృద్ధిసాధిస్తే దేశాభివృద్ధికి ఢోకా ఉండదు. మానవ సమాజం పురోగమిస్తోంది. ప్రతి అపజయం విజయానికి మెట్టుకావాలి. అనుభవం జీవితాలకు గుణపాఠంకావాలి. అప్పుడే సరైన వ్యవసాయం ద్వారా ప్రతి పల్లె ప్రగతి బాటలో పయనిస్తుంది. పట్టణ నగర జీవన వసతులతోపాటు ప్రకృతి సౌందర్య సొగసులు పల్లె ప్రజల జీవితాలను ఆనందమయం చేస్తాయి. అత్యద్భుతమైన మానవ సమాజ నిర్మాణానికి నాంది పలుకుతాయి. ఐకమత్యమే మహాబలం అనే సామెత ఊరకనే పుట్టలేదు. ఇప్పటి మూడున్నర దశాబ్దాలరైతుల ఆత్మహత్యలపరంపర విషాదానికి ప్రధాన కారణం గ్రామాలలోని రైతుల్లో ఐక్యతాభావన కొరవడడం, సమిష్టి కృషికి స్వస్తి పలకడం, తాము కంపెనీల వలలో చిక్కుకుని నిరంతరంగా చేస్తున్న స్వయం తప్పిదాల నుండి ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోకపోవడమే కాకుండా పూర్తిస్థాయిలో పరాయీకరించబడిన బానిస మనస్తత్వాన్ని వదలకపోవడం, ప్రగతిశీల ఆలోచనారాహిత్యం మొదలగు అవలక్షణాలు గ్రామీణ వ్యవసాయ సంక్షోభానికి అతిపెద్ద కారణంగా చెప్పొచ్చు. బహుళజాతి కంపెనీల కుట్రలు కుతంత్రాలకు వ్యవసాయం బలిపీటమెక్కి ప్రజాజీవితం విషపూరిత ఆహారంతో రకరకాల కేన్సర్‌లాంటి అతిభయంకర రోగాలతో పటాపంచలవుతుంది. మానవ జీవనానికి మూలాధారమైన భూమిలో విచక్షణారహితంగా ఇంకా ఇతరత్రా అవాంఛనీయ రసాయన పదార్థాలను వాడి నిర్జీవం చేసి రైతులు అధిక పెట్టుబడి భారంతో ఆత్మహత్యల పాలవుతూ ఆరోగ్యకరమైన ఆహార సంక్షోభానికి కారణమవుతున్నారు. సరైన ఆలోచన చేస్తే అభివృద్ధికి సవాలక్ష మార్గాలు. ఆచరిస్తే అభివృద్ధి సుగమవుతుంది. పర్యావరణ, ప్రకృతిహిత వ్యవసాయానికి దారులు పడతాయి. నేటి, రాబోయే తరాల ఆరోగ్య జీవనాలకు మార్గ నిర్దేశనం చేసిన



వారవుతారు. గతం నుండి నేర్చుకొని, వర్తమానంలో ఆచరిస్తూ, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి. స్వయం తప్పిదాలకు స్వస్తి పలకాలి. అంకితభావంతో కూడిన నిరంతర సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమనే నగ్నసత్యాన్ని ఆధునిక రైతులు గ్రహించాలి. గ్రామగ్రామాన రైతులు వ్యవసాయాన్ని సమూల మార్పులతో రసాయనరహితంగా, స్థానిక విత్తనాలతో, పంటల వైవిధ్యంతో మోనోకల్చర్‌కు స్వస్తి పలకడం ద్వారా గ్రామాలు వ్యవసాయం ద్వారానే స్వయం సమృద్ధి సాధిస్తూ దేశాభివృద్ధికి పెద్ద పీట వేయవచ్చు. స్వయం సమృద్ధి సాధించిన గ్రామాల్లో అంకాపూర్ దేశంలోనే ప్రముఖమైనది. ఒకప్పుడు అన్ని గ్రామాల లాగే విత్తనాల పెట్టుబడులతో అప్పుల బాధలతో ఆత్మహత్యలు వెళ్లదీసిన చరిత్ర అంకాపూర్‌కూ ఉన్నది. కానీ ఆ రైతులు తాము చేస్తున్న స్వయం తప్పిదాలను గ్రహించారు. ఆత్మావలోకనంతో స్థానిక విత్తనాలతోనే సంక్షోభం గట్టెక్కొచ్చు అనే అభిప్రాయానికి వచ్చి ఎర్రజొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పసుపును విరివిగా మేలు రకంగా పండించడం మొదలు పెట్టారు. ఆ విత్తనాలకు స్థానికంగా, జిల్లావ్యాప్తంగా, రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో డిమాండ్ పెరిగింది. కోట్ల రూపాయలు గడించింది. రైతులు ధనికులయార్యరు. 35 సంవత్సరాల క్రితమే గ్రామాభివృద్ధి కమిటీతోపాటు ఇతర కమిటీలు వేసుకొని సమిష్టిగా ఐక్యతతో రాజకీయాలను పక్కన పెట్టి వ్యవసాయాభివృద్ధికి పునాదులు వేశారు. గ్రామాభివృద్ధి కమిటీ చర్యల ద్వారా లాభదాయక వ్యవసాయ విధానాలను అవలంబిస్తూ నాటుకోళ్లనుపెంచడం మొదలు పెట్టారు. 32 విత్తనశుద్ధి కర్మాగారాలు అక్కడ నెలకొన్నాయి. ఏ రైతు బంధు పథకాలు, బీమాలు తమను వ్యవసాయ సంక్షోభం నుండి గట్టెక్కించలేవని, తమ పురోగమన ఆలోచనలే, గ్రామ రైతుల స్ఫూర్తిదాయక విధానాలే తమ అసలైన బంధులని గ్రహించాలి. ఇప్పుడున్న రాజకీయాల వలన ఇంకో వంద సంవత్సరాలైనా తాము అప్పుల బాధల నుండి గట్టెక్కలేమనిగ్రహించి తమ విత్తనాలకు తామే ధరలు నిర్ణయించుకునేలా, తాము ఏ పంటలు పండించాలో తామే నిర్ణయించుకుంటే గ్రామ స్వయం సమృద్ధిని సాధించడం ఖాయం. దేశం అభివృద్ధి చెందడం సులభం. పాలకులకు ఇసుమంత చిత్తశుద్ధిఉన్నా గ్రామ రైతుల స్ఫూర్తిని వాళ్ల వ్యవసాయ విధానాలను, వాళ్ల సమిష్టితత్వాన్ని, మహిళా రైతుల శ్రమతత్వాన్ని ముందుకు తీసుకెళ్తే యావద్దేశాన్నే స్వయం సమృద్ధిని సాధించేలా చేసి విదేశీ అప్పులనుండి బంధ విముక్తి గావించొచ్చు. మనమే ఇతర దేశాలకు రుణలివ్వొచ్చు. రాజకీయం వ్యాపారంకాదు. రాజకీయాలు ప్రజాసేవార్థమనే భావన ప్రతి ఆధునిక రాజకీయ నాయకుడిలో కలగాలి. ఆచరించాలి. ●

# ఆర్థిక స్థిరీకరణ కోసం ఉగ్రవాదాన్ని అరికట్టవలసిందే!

డాక్టర్ పి.ఎస్.చారి

భారతదేశం తన అంతర్గత భద్రత నిర్వహణలో అనేక రకాల సవాళ్లను ఎదుర్కొంటోంది. వాటిలో ఉగ్రవాదం ఒకటి. ఆధునిక కాలంలో "ఉగ్రవాదం" అనగా ఒక ప్రైవేట్ సమూహం మీడియా దృశ్యాన్ని సృష్టించే విధంగా అమాయక ప్రజలను చంపడం. నవంబర్ 2004లో, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నివేదిక ఉగ్రవాదాన్ని "పౌరులు లేదా పోరాటేతరులకు మరణం లేదా తీవ్రమైన శారీరక హానికలిగించే ఉద్దేశం, జనాభాను భయ పెట్టడం లేదా ప్రభుత్వం లేదా అంతర్జాతీయ సంస్థను ఏదైనా చర్య చేయమని లేదా చేయకుండా ఉండమని బలవంతం చేసే చర్యగా అభివర్ణించింది. ఉగ్రవాదం దాని అన్ని రూపాలు దేశాల పౌరుల భద్రతకు, అంతర్జాతీయ స్థిరత్వం, శ్రేయస్సుకు ప్రత్యక్ష ముప్పును కలిగిస్తుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రవాద కార్యకలాపాలు, సరిహద్దు ఉగ్రవాద కార్యకలాపాలు, తిరుగుబాటు గ్రూపులు తీవ్రమవుతున్నాయి. ఉగ్రవాదం ఇప్పుడు ప్రపంచ స్థాయిలను సంతరించుకుంది. కమ్యూనికేషన్ వ్యవస్థ, రవాణా, అధునాతన ఆయుధాలు, అనేక ఇతర మార్గాల రూపంలో అందుబాటులో ఉన్న హైటెక్ సౌకర్యాలను ఉపయోగించి టెర్రరిస్టు గ్రూపులు, సంస్థలు అనుసరించే పద్ధతులు ఆధునిక కమ్యూనికేషన్, టెక్నాలజీని ఉపయోగించుకుంటాయి. దీంతో వారు ఇష్టానుసారంగా దాడులు చేసి ప్రజల మధ్య భయాందోళనలు సృష్టించగలిగారు. భారతదేశంలో మతపరమైన రూపంలో ఉగ్రవాద కార్యకలాపాలు ఉన్నాయి. మతపరమైన ఉగ్రవాదం అనేది సమూహాలు లేదా వ్యక్తులు చేసే ఉగ్రవాదం, సిద్ధాంతాలు, విశ్వాసం, అభిప్రాయ వ్యవస్థను వ్యాప్తి చేయడం లేదా అమలు చేయాలనే ఆశతో శతాబ్దాలుగా తీవ్రవాద కార్యకలాపాలు ఉద్యమాలకు కారణమని చెప్పవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో దేశీయ, తీవ్రవాద కార్యకలాపాలు పెరుగుతున్నాయి. ఇది కాకుండా మతతత్వ, రాజకీయాలు, మత ఉద్యమాలు, రాజకీయ, మత నాయకుల బాధ్యతారహిత ప్రకటనలు, మానవ హక్కులు అతిక్రమించడం మొదలైనవి ఉగ్రవాదానికి కారణాలు. 1947 నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలోని 608 జిల్లాల్లో కనీసం 232 జిల్లాలు వివిధ తిరుగుబాటు, తీవ్రవాద ఉద్యమాల ద్వారా విభిన్న తీవ్రతలతో బాధపడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో దాదాపు 800 ఉగ్రవాద సంస్థలు పనిచేస్తున్నాయి. కొన్ని ప్రధాన తీవ్రవాద దాడులు గమనిస్తే మార్చి 12, 1993 వరుస 13 బాంబులు 257 మందిని చంపాయి. మార్చి 14, 2003 ములుండ్‌లో రైలులోబాంబు పేలడంతో 10 మంది మరణించారు. అక్టోబరు 29,2005 ఢిల్లీ బాంబు దాడులు, 2005 అయోధ్యలో రామజన్మభూమి దాడి, 2006 వారణాసి బాంబు దాడులు, జులై 11,2006 రైళ్లలో ఏడు బాంబుల శ్రేణి పేలింది. నవంబరు 26, 2008 నుంచి నవంబరు 29, 2008 వరకు సమన్వయంతో జరిగిన దాడుల్లో కనీసం 170 మంది మరణించారు. ఫిబ్రవరి 15, 2010 సిల్దా క్యాంప్ దాడిలో 28మంది మరణించారు. 13 జులై, 2011 ముంబై బాంబు పేలుళ్లలో 26 మంది మరణించారు. మార్చి 11, 2014 ఛత్తీస్‌గఢ్ దాడిలో 16 మంది మరణించారు. జూన్ 18, మార్చి 25 2019 జమ్మూ బస్టాండ్ గ్రెనేడ్ పేలుడులో ముగ్గురు మృతి, ఏప్రిల్ 20, 2023 పూంచ్-రాజౌరీ దాడిలో అయిదుగురు మృతి, 8 ఏప్రిల్ 2023 ఎలత్తూరు రైలు దహనంలో ముగ్గురు మృతి చెందారు. భారతదేశంలో ఉగ్రవాద సూచి 2002 నుంచి 2021 వరకు సగటున 7.65 పాయింట్లు, 2011లో ఆల్ టైమ్ గరిష్టస్థాయి 8.12 పాయింట్లు, 2004లో రికార్డు కనిష్టస్థాయి 7.22పాయింట్లకు చేరుకుంది. భారత తీవ్రవాద సూచిక-విలువలు, చారిత్రక డేటా చార్టులు-మే 2023న చివరిగా నవీకరించబడింది. హింసకు సంబంధించిన ఆర్థిక వ్యయంలో ప్రపంచంలోని 163 దేశాలలో భారత దేశం 102వ స్థానంలో ఉంది. ఈ వ్యయం భారతదేశ జిడిపిలో 5శాతం. తీవ్రవాదం ఆస్తి, జీవితాలను నేరుగా ఆర్థికంగా నాశనం చేయడం, మార్కెట్ అనిశ్చితి, జెనోఫోబియా, పర్యాటక నష్టం ద్వారా ఆర్థిక వ్యవస్థను పరోక్షంగా ప్రభావితం చేస్తుంది. ఆర్థిక తీవ్రవాదం అనేదిదేశ ఆర్థిక వ్యవస్థను తారుమారు చేస్తుంది. అయితే ఆర్థిక తీవ్రవాదం కూడా అస్పష్టంగా ఉండవచ్చు. ఆర్థిక ఆంక్షల పేరుతో మనం ఇప్పటికే ఎంతో మంది పౌరులను కోల్పోయాం. మన సాయుధ బలగాలపై ఖర్చుకాకుండా, కేవలం తిరుగుబాటును ఎదుర్కోవడానికి, సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి మొత్తం ఏర్పాటును నిర్వహించడానికి, ఆర్థిక వ్యయం రూ.45,000 కోట్లు. తీవ్రవాదం లేదా తిరుగుబాటు వ్యతిరేక కార్యకలాపాల కారణంగా గత 15 యేళ్లలో బడ్జెట్ పెరుగుదల 26 రెట్లు పెరిగింది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మానవాళికి శత్రుత్వం కలిగించే థీసిస్‌కు కఠిన శిక్షలు విధించేందుకు ప్రత్యేక ఉగ్రవాద వ్యతిరేక చట్టాలను రూపొందించడం అవసరమని భావించారు. అందువల్ల చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (యుఎపిఎ) 1967, టెర్రరిస్ట్ అండ్ డిస్ట్రప్టివ్ యాక్టివిటీస్ నివారణ చట్టం(టిఎడిఎ) 1987, మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్,1999 (ఎంసిఒసిఎ), ఉగ్రవాద నిరోధక చట్టం (పిఒటిఎ),2002, చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ సవరణచట్టం (యుఎపిఎ),2004 మొదలైన చట్టాలు తీసుకువచ్చారు. ఉదాహరణకు పంజాబ్‌లో ఉగ్రవాదులతో పోరాడడం ద్వారా దేశ భద్రత, సమగ్రతను రక్షించడానికి టాడా అమలు చేయబడినప్పటికీ, జాతీయ భద్రతకు ఎటువంటి ముప్పులేని ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లకు కూడా ఇది వర్తింపజేయబడింది. అనుమానాస్పద లావాదేవీలను నివేదించాలని కోరేచట్టాలు ఉగ్రవాదాన్ని నిరోధించడంలో సహాయపడతాయి. ఉగ్రవాదం ప్రపంచరూపాన్ని సంతరించుకున్నందున, ఉగ్రవాదదాడులను నిరోధించడంలో లేదా తగ్గించడంలో దేశాల మధ్య గూఢచార భాగస్వామ్యంకీలకం. తీవ్రవాద కంటెంట్‌పై ప్రపంచసహకారం అవసరం ఈ ప్రణాళికపై భారతదేశం సంతకం చేసింది. ఉగ్రవాద నిరోధక అధిపతులపై యుఎన్‌ఒ అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రసంగిస్తూ, భారతదేశం ఐదుపాయింట్లఫార్ములాను విస్తరించింది. సమయానుకూలమైన చర్య తీసుకోగల తెలివితేటల మార్పిడి, ప్రైవేట్‌రంగం సహకారంతో ఆధునిక కమ్యూనికేషన్ దుర్వియోగాన్ని నిరోధించడం, మెరుగైన సరిహద్దునియంత్రణల కోసం సామర్థ్యాలను పెంపొందించడం, సమాచారాన్ని పంచుకోవడం. ప్రయాణికుల కదలికకు సంబంధించి, గ్లోబల్ టెర్రర్‌తో పోరాడటానికి కౌంటర్-టెర్రర్ ఫోకల్‌పాయింట్ల హోదా అవసరం మొదలైన వాటిని సూచించింది. ప్రపంచ ఉగ్రవాదంపై పోరాడేందుకు ఐక్యరాజ్యసమితి ప్రపంచకేంద్రంగా మారాలి. ఉగ్రవాద ముప్పును తటస్థం చేయడానికి భారతదేశం చురుకైన పాత్రపోషించాలి. ఉగ్రవాద గ్రూపులను కఠినంగా ఎదుర్కొనేందుకు ప్రపంచం చేతులు కలపాలి. భారత్ ప్రతిపాదించిన అంతర్జాతీయ ఉగ్రవాదంపై సమగ్ర సదస్సు (సిసిఐటి)ని ఆమోదించడం మంచి మొదటి అడుగు. ●

# వచ్చే ఎన్నికల్లో వైకాపాకు గుణపాఠం తప్పదు: జీవీ

వినుకొండ,అక్టోబర్8,ప్రభాతవార్త: వచ్చే ఎన్నికల్లో వైకాపాకు గుణపాఠం తప్పదని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తెదేపా హయాంలో కార్పొరేషన్ రుణాలు ఇచ్చి వారి ఆర్థిక పురోభివృద్ధికి బాటలు వేసిన నేత చంద్రబాబునాయుడు అని వైకాపా అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ రుణాలు కాజేసిన నమ్మక ద్రోహి జగన్‌రెడ్డి కక్షతో చంద్రబాబుపై అక్రమ కేసులు మోపారని జిల్లా తెదేపా అధ్యక్షులు జీ.వీ ఆంజనేయులు అన్నారు. తెదేపా చేపట్టిన బాబుతో మేము సైతం రిలే నిరాహార దీక్షలు ఆదివారం



26వ రోజుకు చేరుకోగా బొల్లాపల్లి మండల నాయకులు దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి చేస్తున్న అవినీతి, అక్రమాలు, దోపిడిపై చంద్రబాబు పోరాటం చేస్తున్నందుకే రాజకీయ కక్షతో నిరాధారమైన అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటకు వస్తారని ప్రజలంతా చంద్రబాబుకు అండగా ఉన్నారని జగన్‌రెడ్డిని తరిమికొట్టడం ఖాయమన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా తాటాకు చప్పుళ్ళకు బెదిరేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు జరపాల గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పెసల వెంకటనారాయణ, కోటేశ్వరరావు, హనుమానాయక్, అర్ధలపూడి శ్రీను, ఖాసిం, గోపాల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం 7 అంశాలపై తీర్మానం

మంగళగిరి, అక్టోబర్ 8, ప్రభాతవార్త : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం తాడేపల్లిలో ఆదివారం జరిగింది.సమావేశానికి 26జిల్లాల నుండి బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు,కార్యదర్శులు,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి 7అంశాలను ఎజెండాగా ప్రవేశపెట్టారుఇటీవల పార్లమెంట్లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లులో 33శాతం వాటాల ఓబిసి మహిళలకు వాటా ఎంత ఓబిసి మహిళా వాటా చేర్చకపోవటాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం



చేయడం. జిల్లా మండల గ్రామస్థాయిలో పటిష్టమైన సంఘ నిర్మాణం చేయడం, ఇటీవల జరుగుతున్న దాడులను ఖండిస్తూ బీసీల సమస్యలపై చర్చించడం, బిసి భవన్ నిర్మాణానికి భూమిపూజ చేయడం , 26జిల్లాల్లో చైతన్యాన్ని పెంపొ ందించడానికి బస్సుయాత్ర నిర్వహించడం, 2024సార్వత్రిక ఎన్నికల్లో మనం అనుసరించాల్సిన పాత్రను గురించి చర్చ, బిసి ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించాలని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం , పై అంశాలను కమిటీ సమావేశంలో చర్చించి ఆ తీర్మానాలను ఆమోదించడానికి బీసీలందరూ కలసి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ సెక్రటరీ అన్నవరపు నాగమల్లేశ్వరరావు,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కా ంద్రు కమల గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్,రాష్ట్ర కమిటీ మంగళగిరి నియోజకవర్గ పట్టణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుకేతుపూజలు అర్జీత సేవలు రద్దు



పెదకాకాని,అక్టోబర్8ప్రభాతవార్త: పెదకాకాని శ్రీమల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈనెల11 నుండి13 వరకు జరుగు పవిత్రోత్సవాల సందర్భంగా రాహుకేతు పూజలతో సహఅన్ని అర్జిత సేవలు నిలిపి వేసినట్లు ఆలయ సహయ కమిషనర్ ఎం.శ్రీనివాసరెడ్డి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు.తిరిగిఈనెల 14నుండి అమావాస్య సందర్భంగా ఉ.గం.5నుండి రాహుకేతుపూజలు ,శ్రీస్వామివారికి అమ్మవార్లకు నిత్యకైంకర్యములు,అన్ని అర్జితసేవలు యధాతధముగా జరుగునని తెలిపారు.భక్తులు సదరు విషయంగ్రహించి ఆలయఅధికారులకు సహకరించవలసిందిగా కోరారు.

## చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ గంగానమ్మతల్లికి పూజలు

పెదకాకాని, అక్టోబర్ 8. ప్రభాతవార్త: తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ అయనకు మద్దతుగా అదివారం ఉదయం9.00గం.లకు మండలపరిధిలోని తక్కెళ్లపాడుగ్రామం గంగానమ్మతల్లిగుడి వద్ద పూజలు మరియు కబ్బరికాయకొట్టే కార్యక్రమం



నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పొన్నూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. నారాచంద్రబాబు నాయుడు నిర్దోషగా బయటకు రావాలని, చాలా మంది పూజలు, ప్రార్థనలుచేస్తున్నారని తెలిపారు

**ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి**

గుంటూరుజిల్లా తుళ్ళూరు మండలం, వడ్లమాను గ్రామానికి చెందిన గుంటూరు సీతారామిరెడ్డిగారి తాతగారైన కీ.శే. గుంటూరు కృష్ణారెడ్డి S/o అయ్యప్పరెడ్డికి చెందిన పల్నాడు జిల్లా, అమరావతి మండలం, యాండ్రాయి గ్రామ సర్వేనెం:291లో 2.50 ఎకరాల పొలంకి చెందిన రిజిస్టర్ డాక్యుమెంటు (ఒరిజినల్) నెం:11/1962. రెండవ డాక్యుమెంటు సర్వే నెం.291లో 2.50 ఎకరాల పొలంకి చెందిన రిజిస్టర్ డాక్యుమెంటు (ఒరిజినల్) నెం: 614/1955. వడ్లమాను నుంచి తుళ్ళూరుకు బైకుపై వస్తున్న క్రమంలో జారిపడి పోయాయి. ఎవరికైన దొరికినచో గుంటూరు సీతా రామిరెడ్డి ఫోన్.నెం: 9660363229 తెలపగలరని మనవి.

# గుంటూరు వార్త

# చంద్రబాబుకి మరక అంటించడం మీ తరమా?

### రిలే నిరాహారదీక్షలో ప్రత్తిపాటి

చిలకలూరిపేట,అక్టోబర్8,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అదినేత, మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి అవినీతి మరక అంటించడం మీ తరమా అని మాజీమంత్రి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. రాష్ట్రంలో అలుపెరగకుండా చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా జరుగుతున్న ఉద్యమాలు చెప్పడంలేదా చంద్రబాబు అంటే ఏమిటో అని ప్రత్తిపాటి వైసిపిని ఉద్దేశించి ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో 26 రోజులుగా జరుగుతున్న రిలేనిరాహారదీక్షలో ప్రత్తిపాటి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధీర్ఘ రాజకీయ జీవితంలో ఏరోజు చంద్రబాబుకు అవినీతి మరక అంటలేదని,ఆయనకి మరక అంటించడం జగన్ తరం కూడా కాదని ప్రత్తిపాటి అన్నారు. నైపుణ్యాభివృద్ధి కేసు పేరుతోచంద్రబాబుపై బురదజల్లడానికి జగన్ ముఠా ఎన్నోవిధాలుగా అబద్దాల దాడి చేసున్నా, ఈ రోజు రాష్ట్రంలో ప్రజలెవరూ నమ్మడానికి సిద్దంగా లేరని ప్రత్తిపాటి వెల్లడించారు. ప్రజాసమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు, తన చేతగాని తనాన్ని అక్రమ కేసులు, అరెస్ట్‌లతో హీరోయిజంగా చూపించుకోవడానికి సిఎం జగన్ పడరాని పాట్లు పడుతున్నారని ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. కోట్లాదిమంది యువత భవితను దృష్టిలో పెట్టుకొని ప్రారంభించిన మహత్తర ప్రాజెక్ట్‌ను ఇలా కక్షసాధింపులకు వాడుకోవడమే అతిపెద్ద దుర్మార్గం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌కళ్యాణ్ మద్దతు ప్రకటనతో సగంమంది నోళ్ల మూతపడ్డాయని,చంద్రబాబు అరెస్ట్ తర్వాత మిగిలిన నాయకుల నోళ్లుకూడా పెగలడం లేదన్నారు. టిడిపి జనసేన కలయికతో ఏకపక్ష ఎన్నికలు జరగబోతున్నాయని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. వైసిపి నాయకులు వారి పేటిఎం బ్యాచ్‌లు, కుహానా మేధావులు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు ఖండిస్తూ ఎండగడుతున్న



ఐటిడిపి కృషిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. మరో 6నెలలు కష్టపడితే రాష్ట్రాన్ని రాక్షసుడి చెరనుంచి విడిపించడం తధ్యమన్నారు. ఎన్నికేసులతో వేదించినా, అరెస్ట్‌లు చేసినా, బెదిరించినా, ట్రోలింగ్‌లు ఇలా వైసిపి పేటియం బ్యాచ్ ఎన్ని నీచాలకు ఒడిగడుతున్నా ఐటిడిపి కార్యకర్తలు అన్నింటికి ఎదురొడ్డి పోరాడుతోందన్నారు. చంద్రబాబు అరెస్ట్, అనంతర పరిణామాలతో జగన్ తన రాజకీయ భవిష్యత్‌తోపాటు మొత్తం వైసిపి నేతలందరిని రోడ్డున లాగేశారని విశ్లేషకులు అంచనాలు నిజం కాబోతున్నాయని, ఆరోజు ఎంతో దూరంలో లేదని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. ఇన్నేళ్లు రాష్ట్రం ఏం నష్టపోయిందో ప్రజలు గమనించారని, జగన్ భాద్యతలేని వ్యక్తి, మోసాలు చేయడంలో దిట్ట అని, ఆయనది ధనబలం, రౌడియిజం మాత్రమేనని అవి ఎప్పటికి శాశ్వతం కాదని ప్రత్తిపాటి అన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్ మళ్లి గెలిచే పరిస్థితి లేదన్నారు.చంద్రబాబుకు ప్రజా మద్దతు వెల్లువలా వెల్లువెత్తుతుందని, వెల్లువలా వస్తున్న జనాభిమాన సునామీలో వైసిపి కొట్టుకుపోవడం ఖాయమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇలాంటి కుతంత్రాలను ఓటు ద్వారా తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. వైసిపి నాయకులు జైళ్లకు వెళ్లేరోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కాగా ఆదివారం జరిగిన రిలేనిరాహదీక్షలో ఐటిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మోకాళ్లపై నిలబడి ఆర్ధనగ్నంగా ప్రదర్శన ద్వారా నిరసన వ్యక్తం చేశారు. టిడిపి దీక్షలకు జనసేన నియోజకవర్గ నాయకుడు పెంటేల బాలాజీ, నాయకులు తోట రామాంజనేయులు, సుమలత, అమరేశ్వరి, తోటకూర అనిల్‌కుమార్‌లు దీక్షలో పాల్గొని మద్దతు తెలియచేశారు.

## తాడేపల్లిలో రైల్‌నీర్ ప్రాజెక్టు చేపట్టాలి: అంగిరేకుల



గుంటూరు విద్య, అక్టోబర్ 8, ప్రభాతవార్త : తాడేపల్లిలో ప్రతిపాదిత రైల్వే స్థలంలో రైల్‌నీరు ప్రాజెక్టును వెంటనే చేపట్టేందుకు డిపిఆర్ రూపకల్పన చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ జైన్‌కు దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకుల సంప్రదింపుల కమిటీ సభ్యులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో వరప్రసాద్ మాట్లాడారు.సముద్రంలో వృధాగా పోయే నీటిని వినియోగించుకునేందుకు కృష్ణానది నుండి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా తాడేపల్లిలోని నిర్ధేశిత రైల్వే నీరు ప్రాజెక్టు స్థలంలో నీటిని స్టోరేజ్ చేసుకొని వాటిని శుద్ధి పరచి ప్రత్యేక బాటిలింగ్ విధానం ద్వారా మంచినీరును ప్రయాణీకులకు రూ.5లకే లీటర్ విక్రయించే విధంగా తీసుకోవాలని కోరారు.దీనికోసం దక్షిణ మధ్యరైల్వే ఐఆర్ సిటిసిని సమన్వయ పరచుకొని తాడేపల్లి రైల్‌నీర్ ప్రాజెక్టు ప్రత్యేక ప్రణాళిక రూపకల్పన చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ జైన్‌కు వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## చిన్నతనం నుంచే సమాజహితం అలవర్చుకోవాలి : తులసి రామచంద్రప్రభు

గుంటూరు, అక్టోబర్ 8, ప్రభాతవార్త ప్రతినిధి: చదువకు అండగా నిలవటంతోపాటు ఎపుడు ముందుండే తులసి రామచంద్రప్రభు, భారతీయ జనతాపార్టీ నాయకులు తులసి యోగీష్ ఆదివారం చౌడవరంలోని చేతనపురిలో హీల్ (హెల్త్ అండ్‌ఎడ్యుకేషన్ ఫర్ ఆల్) సంస్థ లోని 125 మంది అనాథ బాలబాలికలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రొఫెషనల్ కమిటీ మెంబర్ తులసి రామచంద్రప్రభు మాట్లాడుతూ, ఎలాంటి స్వార్థం లేకుండా ఇలాంటి తల్లిదండ్రులు లేని బాలబాలికలకు తోడ్పాటు నివ్వటంలోనే దైవత్యం ఇమిడి ఉందన్నారు..





అందువల్లే మా కుటుంబంలో ఎలాంటి శుభకార్యం జరిగినా ఇలాంటి కార్యక్రమాలు చేస్తుంటామని తెలిపారు. ఇదే విషయాన్నికృష్ణపరమాత్మ భగవద్గీత బోధనలో 'నిష్కామ కర్మ.. 'గా పేర్కొన్నారని తెలిపారు. అలాగే హీల్ సంస్థలో 10వ తరగతి పైబడి చదువుకునే విద్యార్థులకు తమను తనవంతుగా ఉపకారవేతనాలు అందజేస్తామని తెలిపారు. ఇది తన దేశం కాబట్టి, తనవంతు బాధ్యతగా ఇలాంటి సమాజ హితం కోరే కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు.. పిల్లలందరూ పెద్దవారైన తర్వాత ఉన్నత విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించటానికి కృషిచేయాలన్నారు. దేశం కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. శత్రువులను తరిమికొడుతూ దేశాభివృద్ధికి కృషిచేయాలన్నారు. తులసి యోగీష్ మాట్లాడుతూ, తమ తండ్రి తులసి ప్రభు స్కాలర్‌షిప్‌లతో చదువుకున్నారని,అందుకే మేం ఆ విషయాన్ని మరువకుండా ఇప్పటి వరకు కొన్ని వేలమంది విద్యార్థులకు రూ.20 కోట్లకుపైగా ఉపకారవేతనాలు , కొన్ని పాఠశాలల్లో ఆల్‌ఇన్ వన్ బుక్స్, నోటుపుస్తకాలు, అల్పాహారం పంపిణి చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే ఆదివారం హీల్ శరణాలయంలో అన్నదానం నిర్వహించినట్టు తెలిపారు. ఈ శరణాలయానికి ఏమైనా అవసరాలుంటే వాటిని మా దృష్టికి తీసుకొస్తే సహకరిస్తామని అన్నారు. 125 మంది పిల్లలకు స్వయంగా ఆహారం వడ్డించి వారితోకలిసి తులసిరామచంద్రప్రభు , తులసి యోగీష్ సహపంక్తి భోజనాలు చేశారు. తులసి సీడ్స్ డైరెక్టర్ తులసి అరుణ, జెకె రాంబాబు, సుమతి, 'హీల్' కోఆర్డినేటర్ మరుద్వతి, సూపరింటెండెంట్ పద్మ, హోమ్ మదర్స్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ మహిళా సంగీత సన్మండలి వాగ్గేయకార సంగీత మహోత్సవాలు

గుంటూరు కల్చరల్, అక్టోబర్ 8, ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణమండపం వేదికగా గాయత్రి మహిళా సంగీత సన్మండలి రెండు రోజులపాటు ఉదయం,సాయంత్రం నిర్వహిస్తున్న వాగ్గేయకార సంగీత మహోత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి.సంస్థ కార్యదర్శి ఎం.వై.శేషురాణి,కార్యవర్గం ఆధ్వర్యంలో ఉదయం కార్యకలాపాలు విశ్రాంత అధ్యాపకురాలు ఎం.బి.కే.ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల,ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,పాటిబండ్ల జానకి జ్యోతి ప్రకాశం చేసి ప్రారంభించారు.విధూషీ పి.ఎల్.జయతి,పిఎల్ మహతి సిస్టర్స్ గాత్ర యుగళ సంగీత కచేరి



ఆహుతులను అలరించింది.శ్రీత్యాగరాజ కృతులతో పాటు అనేక వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలాపించి సంగీతాభిమానులను అలరించారు.వయోలిన్‌పై గాయత్రి వరేణ్య,మృదంగంపై పివిఎస్ బాలాజీ యువరాజ్ లు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు.అనంతరం సంస్థ వారు కళాకారులను సత్కరించారు. సాయంత్రం కార్యక్రమాలను ఐటిసి-ఏబిడి హైమావతి జ్యోతి ప్రకాశం చేసి ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా న్యాయమూర్తి ఏపి హైకోర్టు జస్టిస్ బొప్పుడి కృష్ణమోహన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగీతానికున్న ప్రత్యేక స్థానాన్ని వివరిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న గాయత్రి మహిళా సంగీత సన్మండలిని ప్రశంసించారు.

**గురవాయపాలెంలో రూ.16.30 కోట్లతో సంక్షేమం: ఎమ్మెల్యే గోపిరెడ్డి**

6లో

# కొండెక్కిన చికెన్ ధరలు!

## అందుబాటులో చేపలు

కొల్లిపర,ప్రభాతవార్త: బ్రాయిలర్ కోడి మాంసం ధరలు కొండెక్కాయి.నిన్న మొన్నటి వరకు కిలో మాంసం స్కిన్‌తో అయితే రూ.200 రూపాయలు,స్కిన్‌లెస్ అయితే 210 ఉన్న ధర ఏకంగా రూ.240 కు,రూ.260 కి చేరింది.దీంతో మాంస ప్రియులు





మాంసం కొనుగోలు చేయాలంటే వెనకడుగు వేస్తున్నారు.ధరలు ఈ విధంగా పెరగటానికి ప్రధాన కారణం కోళ్ళ మేతకు వాడే దాణా ధరలు విపరీతంగా పెరగటమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు.మొక్కజొన్న క్వింటాళుకు రూ.2400,రూ.గతంలో 30 రూపాయలు ఉన్న సోయా ధరలు ప్రస్తుతం రూ.110 కి చేరటం వలన బ్రాయిలర్ కోళ్ళ ధరలు తగ్గటం లేదని మాంసం వ్యాపారులు చెబుతున్నారు .దీంతో కోళ్ళు ధరలు ఒక్కసారే మాంసం దుకాణాదారులు ధరలు అమాంతం పెంచక తప్పటం లేదంటున్నారు.చేపలు ధరలు కాస్తంత అనుకూలంగా ఉండటంతో కోడి మాంసం కొనుగోలు చేయలేనివారు చేపలు కొనుగోలు చేస్తున్నారు.మార్కెట్‌లో చేపలు కిలో 160 నుంచి 200 వరకు ధరలు ఉండటంతో మధ్య తరగతి,చిన్న తరహా ప్రజలు చేపలు కొనుగోలుపై మొగ్గుచూపుతున్నారు.మండలంలో దాదాపు 15 నుంచి 20 వరకు చేపల ఆటోలు వెలిసాయి.ఆదివారం వచ్చిందంటే చాలు రోడ్ల ప్రక్కన చేపలు ఆటోలతో కోలాహాలంగా ఉంటుంది.అందులో కొల్లిపరలో దాదాపు 4 ఫిష్‌లాండ్‌లు,5 ఆటోలు నిత్యం చేపలు అమ్మకం చేస్తుంటే మాంస ప్రియులకు పండగ అని చెప్పాల్సిందే.


**కొల్లిపర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్.**
కొల్లిపర గ్రామం, కొల్లిపర మండలం, గుంటూరు జిల్లా.

**బహిరంగ వేలం ప్రకటన**

మా కొల్లిపర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుండి ఈ దిగువ పట్టికలో తెలిపిన ఋణగ్రహీతలు తీసుకున్న ప్లెడ్జి రుణము గడువు తీరి లోపు చెల్లించమని కోరుతూ మేము నోటీసులు జారీ చేసియున్నాము. లోను బకాయి చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సంఘం వారు ఋణగ్రహీతలు తనఖా ఉంచిన పసుపు బస్తాలను సహకార సంఘముల చట్టం 1964రు ను అనుసరించి బహిరంగ వేలం ద్వారా విక్రయించి ఖాతాలకు జమ చేయుటకు నిర్ణయించడమైనది. కావున ది.24-10-2023వ తేది లోపు బకాయి మొత్తము చెల్లించవలసినదిగా కోరుచు న్నాము. సదరు బకాయి చెల్లించని ఎడల ది.25-10-2023వ తేదిన బుధవారం నాడు కొల్లిపర గ్రామ డోరు నెం.8-92రు. కూరపాటి ఉమామాధురి భర్త రవిశేఖర్ రెడ్డి గారి గోడాము నందు వేలం వేయబడునని తెలియపర చుచున్నాము. కావున ఆసక్తి గల పాటదారులు ది.25-10-2023వ తేదిన సదరు పై తెలిపిన గోడాము లోని పసుపు బస్తాలను తనిఖీ చేసుకుని బహిరంగ వేలంలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.


వేలం తేది. 25-10-2023 సమయం: ఉదయం గం.11-00ని.లకు.

నియమ నిబంధనలు : - 1)పాటలో పాల్గొనదలచినవారు రూ.5,000/-లు ముందుగా దరావత్తు చెల్లించి పాల్గొనవలయును. 2) సఫలీకృత పాటదారుడు రూ.5,00,000/-లు డిపాజిట్ క్రింద ఉంచవలెను. పాట దారుడు డిపాజిట్ అమౌంట్ పోను మిగిలిన అమౌంట్ పది రోజుల లోపు చెల్లించి సరుకును స్వాధీనం చేసుకోగలరు. పాట దారు బ్యాలెన్స్ అమౌంట్ పది రోజులలో కట్టకపోయిన ఎడల దిగువ పాట దారునికి పాట కొట్టివేయబడును. 3) సఫలీకృతుడైన పాటదారు సదరు పసుపు బస్తాలను తరలించుటకు అవసరమగు హమాలీ ఖర్చులు మరియు ఇతరములు మొత్తము సఫలీకృతదారుడే భరించుకొనవలయును 4)సఫలీకృత పాటదారుడు సదరు పసుపు బస్తాలను సంఘం ఇచ్చిన గడువు లోపల తీసుకోని ఎడల డిపాజిట్ క్రింద ఉంచిన అమౌంట్ కోల్పోవుదురు. 5)కొటేషన్ అంగీకరించుటకు, లేదా కొటేషన్‌ను తిరస్కరించుటకు, రద్దు పరచుటకు, వేలం వేయుటకు, వేలం నియమనిబంధనలు మార్చుటకు వేలం సందర్భమున సంపూర్ణ అధికారములు కొల్లిపర ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారు కలిగియున్నారు. ఇతర వివరములకు సంప్రదించండి.ఫోన్ నెం. 9949479889రు & 9985829999ల్లు.

| క్ర.సం. | లోను ఖాతానెం | ఋణగ్రహీత పేరు, చిరునామా | బాకీ | కింటాళ్లు |
|---|---|---|---|---|
| 1. | పి.114రు | కొల్లిపర మౌనిక భర్త రాజ్ కుమార్, కొల్లిపర కొల్లిపర మండలం, గుంటూరు జిల్లా | రూ.10,00,000/-లు +వడ్డీ. | 245 |
| 2. | పి.115రు | ఆరుమళ్ల వాణి భర్త శరత్ కుమార్, కొల్లిపర కొల్లిపర మండలం, గుంటూరు జిల్లా | రూ.10,00,000/-లు +వడ్డీ. | 245 |
| 3. | పి.116రు | కొల్లిపర నాగమ్మ భర్త వీరయ్య కొల్లిపర, కొల్లిపర మండలం, గుంటూరుజిల్లా | రూ.10,00,000/-లు + వడ్డీ. | 245 |
| 4 | పి.117రు | లక్కపోగు డేవిడ్ రాజు తండ్రి కృపారావు, కొల్లిపర, కొల్లిపర మండలం, గుంటూరుజిల్లా | రూ.10,00,000/-లు + వడ్డీ. | 245 |
| 5. | పి.118రు | కొల్లిపర వాణి భర్త అశోక్ కుమార్, కొల్లిపర, కొల్లిపర మండలం, గుంటూరు జిల్లా | రూ.9,40,000/-లు +వడ్డీ. | 224 |
| 6. | పి.119రు | కొల్లిపర అశోక్ కుమార్ తండ్రి పున్నయ్య కొల్లిపర, కొల్లిపర మండలం, గుంటూరుజిల్లా | రూ.9,40,000/-లు +వడ్డీ. | 224 |
| 7. | పి.120రు | మల్లోల రమేష్‌బాబు తండ్రి ప్రకాశరావు, కొల్లిపర, కొల్లిపర మండలం, గుంటూరుజిల్లా | రూ.9,40,000/-లు +వడ్డీ. | 224 |
| 8. | పి.121రు | కొల్లిపర రాజ్ కుమార్,తండ్రి పున్నయ్య కొల్లిపర, కొల్లిపర మండలం, గుంటూరుజిల్లా | రూ.9,40,000/-లు +వడ్డీ. | 224 |

తేది 09-10-2023 సం/- చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కొల్లిపర పి.ఎ.సి.యస్.

పల్నాడు జిల్లా వార్త



## ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఐటిడిపి నేతల పూజలు

చిలకలూరిపేట, అక్టోబర్8,ప్రభాతవార్త: పట్టణంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఐటిడిపి ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు నిర్దోషిగా జైలునుంచి త్వరగా విడుదల కావాలని కోరుతూ ఐటిడిపి నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లి కోటి, అమరా మణికుమార్, పెరవలి భరత్, బాచిన శరత్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆలయం చుట్టూ మోకాళ్లపై ప్రదక్షణాలు చేశారు.



## ఐటిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకృష్ణకు అభినందన

నాదెండ్ల,అక్టోబర్8,ప్రభాతవార్త: నాదెండ్ల మండలం, నాదెండ్ల గ్రామానికి చెందిన దేవాభక్తుని శివకృష్ణ ఐటిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం పట్టణంలోని ప్రత్తిపాటి నివాసంలో శివకృష్ణ ప్రత్తిపాటిని కలిసి తనను ఐటిడిపి రాష్ట్ర కార్యవర్గంలో నియమింపచేసినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. అనంతరం ప్రత్తిపాటి శివకృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, ఐటిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మారెళ్ల అప్పారావు, నియోజకవర్గ అధ్యక్షులు పిల్లి కోటి, పట్టణ అధ్యక్షులు అమరా మణి, ఐటిడిపి నాయకులు ఎన్ బాలాజీసింగ్, నార్నె దిలీప్, షేక్ మస్తాన్‌వలి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సాయి ప్రశాంతి వృద్ధాశ్రమంలో అన్నదానం

చిలకలూరిపేట,అక్టోబర్8,ప్రభాతవార్త: చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయి ప్రశాంతి వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు కరణం విజయ లక్ష్మి, రామకోటేశ్వరరావు అత్తగారైన కరణం రామ తారకం పేరుమీద ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు మారెళ్ల ఇందిర తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డైరక్టర్లు పుప్పాల రమ, కొరటాల లక్ష్మి, కరణం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

చిలకలూరిపేట టౌన్,అక్టోబర్8,ప్రభాతవార్త: పట్టణ యాదవసంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని సింగ్ కళ్యాణమండపంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎర్పాటుచేసిన సమావేశానికి పట్టణ అధ్యక్షుడు గాలం కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. నూతన అధ్యక్షులుగా ఎం శ్రీనివాసరావు, కార్యదర్శిగా గోపిదేశి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా వై రామాంజనేయులు, సహయ కార్యదర్శిగా టి శ్రీనివాస రావు, కోశాధికారిగా జి గంగాధర్, కార్యవర్గ సభ్యులుగా 11మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా కార్యవర్గ గౌరవ అధ్యక్షుడిగా గోరంట్ల నారాయణ, గాలం కోటేశ్వరరావు, పోటు శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలుజి పోలేరు, జి శ్రీనివాసరావు, ఎన్ నాగరాజు, జి నాగప్రసాద్, జి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



## కాశీఅన్నపూర్ణ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం సేవలు ప్రశంసనీయం :షేక్ రఫాని

చిలకలూరిపేట,అక్టోబర్8,ప్రభాతవార్త: కాశీఅన్నపూర్ణ వృద్ధాశ్రమం మరియు నిత్యాన్నదాన సత్రం సేవలు మరువలేనివని, ఆర్యవైశ్య కుటుంబాలను ఆదుకోవడంలో వారి సేవలను వెలకట్టలేనివని మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగిన కాశీ అన్నపూర్ణ వృద్ధాశ్రమం మరియు నిత్యాన్నదాన కమిటి సమావేశంలో రఫాని ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సమావేశంలో పట్టణానికి చెందిన కందకట్ల శ్రీదేవి కుమారుడు, కుమార్తెకు చదువునిమిత్తం రూ 31వేలు చెక్కును ఛైర్మన్ షేక్ రఫాని చేతులమీదుగా అందించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్టిశ్రీరాములు మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కాశీఅన్నపూర్ణ సత్రం సమావేశం గుబ్బా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా కరోనాలో కుటుంబంలో పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలను విద్యాపరంగా ఆదుకునుందుకు సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా వారిని దత్తత తీసుకునేందుకు కూడా సమావేశంలో పాల్గొన్న సభ్యులు కె విలాస్, యం లక్ష్మయ్య, బి వాసులు మరియు కోర్‌కమిటి సభ్యులు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా 2005వ సంవత్సరంలో నెలకొల్పిన కాశీఅన్నపూర్ణ సత్రం ఆధ్వర్యంలో ఇప్పటివరకు రూ28 కోట్లు విద్యనిమిత్తం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొల్లా రామారావు, డాక్టర్ నలమోతు మురళీచంద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, అర్వపల్లి ప్రసాద్, రాంలక్ష్మణ్ సిల్క్స్ అధినేత లక్ష్మణ్, విద్యానిధి కార్యదర్శి మాజేటి నరేంద్ర, కోటా కృష్ణుడు, గట్టా హేమ, మురికిపూడి ప్రసాద్, పెరుమాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్‌సైదాకు సత్కారం

చిలకలూరిపేట,అక్టోబర్8,ప్రభాతవార్త: శ్రీశైల దేవస్థాన అర్చకులు నిర్వహిస్తున్న శ్రీ శైల దేవస్థాన ఉత్సవమూర్తుల ఊరేగింపు పట్టణంలో వినాయక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్‌సైదా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక ట్రస్ట్ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు జాన్‌సైదాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, పోతవరం సర్పంచ్ భాష, ఎన్‌వి రత్నారెడ్డి, గొంటు శ్రీనివాసరెడ్డి, ముగ్దుం, మానుకొండ శేషిరెడ్డి బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

## టౌన్‌హాల్లో ఎస్పీ బాలుకు ఘన నివాళి

నరసరావుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : పట్టణంలోని టౌన్‌హాల్లో ఆదివారం పల్నాడు జిల్లా ఆర్కెస్ట్రా కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పాడుతా - తీయగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ పాడుతా తియ్యగా అంటూ ఎస్పీ బాలు తెలుగు పాటలకు పట్టాభిషేకం



చేశారన్నారు. తెలుగువారి లోగిళ్లలో పాటల పూల వనాలని పూయించారని తెలిపారు. అక్షర తోటమాలి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని అన్నారు. ఆయన తృతీయ వర్ధంతిని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. 2020లో ఆయన కనుమూయడం జరిగిందన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలిపారు. బహుళ బాషలలో ఆయన అద్భుతంగా పాడారని తెలిపారు. ఇళయరాజా, రెహమాన్, ఆర్.డి.బర్మన్ వంటి దిగ్గజ సంగీత దర్శకులతో పని చేశారని, 40 వేలకు పైగా పాటలు పాడటం గొప్ప విషయమని ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు బి.ఆర్.సుశీల్‌కుమార్, కమిటీ సభ్యులు దప్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## గురవాయపాలెంలో రూ.16.30 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి



నరసరావుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : మండలంలోని గురవాయపాలెం గ్రామంలో రూ.16.30 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్తులకు అందించామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. గ్రామంలో 135వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో సిఎం వై.ఎస్.జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సి.సి.రోడ్లు, డ్రైన్లు, నూతన సచివాలయం నిర్మించడం జరిగిందన్నారు. అదే విధంగా గ్రామస్తులు నరసరావుపేటకు ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగించేందుకు కోటప్పకొండ నుండి పట్టణం వరకు రూ.15 కోట్లతో రోడ్ల నిర్మాణం ఏర్పాటు చేశామని వివరించారు. అదే విధంగా చంద్రబాబునాయుడు వంద కోట్ల అవినీతి చేసి జైలుకు వెళ్తే ఆ పార్టీ నాయకులు ప్రజల నుండి స్పందన లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. చంద్రబాబు పాపం పండిందని, అవినీతి కేసులు ఒకొక్కటిగా బయటకు వస్తున్నాయని తెలిపారు.

## దోమల బారినుండి కాపాడాలని 7వ వార్డు ప్రజల వినతి

నరసరావుపేట టౌన్, అక్టోబరు8 ప్రభాతవార్త : పట్టణంలోని 7వ వార్డులో నివాసం ఉంటున్న వారికి దోమల బారి నుండి రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు మునిసిపల్ అధికారులకు వినతిపత్రం అందించారు. శనివారం ఎంఐఎం నాయకులు మస్తాన్‌వలి ఈ సందర్భంగామాట్లాడారు. 7వ వార్డుకు సంబంధించి ప్రజలు ఆస్తిపన్ను, చెత్త పన్ను కడుతున్నారని తెలిపారు. స్థానిక సచివాలయ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వీడాలని సైడ్ కాలువలు నిర్మించాలన్నారు. కనీసం మురికి కాల్వలు నిర్మించేందుకు ముందుకు రాకపోవటం ఏమిటన్నారు.తమ డిమాండ్ నెరవేర్చకపోతే వంట వార్పు కార్యాలయం ముందు నిర్వహిస్తామని నాయకులు మస్తాన్‌వలి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉదయగిరి వెంకటస్వామి, సలాం, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పాలన అవినీతిమయం : 26వ రోజు దీక్షలో టిడిపి నాయకులు

నరసరావుపేట, అక్టోబరు8 ప్రభాతవార్త : రాష్ట్రంలో వైకాపా పాలన అవినీతిమయంగా ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం



వద్ద 26 రోజు మాజీ సిఎం చంద్రబాబు అరెస్ట్‌కు వ్యతిరేకంగా దీక్షకార్యక్రమం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ధర్నాలో పార్టీ నాయకులు దాసరి రాజా, గోనుగుంట్లకోటేశ్వరరావు, వేములపల్లి వెంకట నర్సయ్య, చేకూరి సాంబశివరావు, కొట్టా కిరణ్, కుమ్మెత కోటిరెడ్డి, సిపిఐ, ఎంఎయం నాయకులు కాసా రాంబాబు, కరీముల్లా, వాసిరెడ్డి రవి, షరీఫ్, వనమా పవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం దౌర్జన్యంగా అరెస్ట్‌లు, కేసులు పెడుతుందన్నారు. రాష్ట్రానికి తిరిగి అభివృద్ధి మంచి పాలన రావలంటే చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవటమే మార్గమని తెలిపారు. అన్ని వర్గాల సమస్యల పరిష్కారం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటంతో సాధ్యమవుతుందన్నారు. నారా చంద్రబాబును అవినీతి పేరుతో వేధించాలని వైకాపా భావించటం హాస్యస్పదంగా ఉందన్నారు. ఎంతో మందిరాజకీయ నాయకులను చూసారని, కొద్ది నెలలో టిడిపిని చంద్రబాబు నాయుడు అధికారంలోకి తీసుకుని వస్తారని టిడిపి నాయకులు ధీమా వ్యక్తం చేసారు.

## పట్టణంలో 'ఇంటింటా బాబుతో నేను' కార్యక్రమం

నరసరావుపేట, అక్టోబరు8 ప్రభాతవార్త : పట్టణంలోని 8వ వార్డు పరిధిలో ఉన్న వెంగళరెడ్డి నగర్‌లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్‌చదలవాడ అరవిందబాబు ఇంటింటా బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. అదే విధంగా



వారికి పార్టీ రాబోయే కాలంలో ప్రజలకు అదించే వివిధ సంక్షేమ పథకాలు తెలిపారు. దీంతో పార్టీ అధినేతచంద్రబాబునాయుడు అరెస్ట్‌కు సంబంధించి టిడిపి నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలలో భాగంగా కాంతితో క్రాంతి పేరుతో వినూత్న నిరసన చేపట్టాటం జరిగిందన్నారు. రాష్ట్రంలో సైకిల్ పాలన రావాలని అందుకు అన్ని వర్గాల ప్రజలు తగిన విధంగా టిడిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కరపత్రాలను పంచి పెట్టారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో పాటు స్థానిక పార్టీ నాయకులు మీరావలి, రఫీ, బుడే, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో శ్రీశ్రీ కళావేదిక కవితోత్సవం సంతోషకరం : ఎమ్మెల్యే డా.గోపిరెడ్డి

నరసరావుపేట, అక్టోబరు8 ప్రభాతవార్త : పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కవితోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. పుడా ఛైర్మన్ మిట్టపల్లి రమేష్‌తోపాటు ప్రముఖులు కత్తిమండ ప్రతాప్, బిఆర్ సుశీల్‌కుమార్, కందుల ఎజ్రా, శాంతిభాయ్, గుండాల రాకేష్, కాల్వరవి, కందుల ఎజ్రా,




తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు, నటులు, కళా వేదిక సభ్యులనుద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. పల్నాడు ప్రాంతం అన్ని రంగాలలో ఎంతో పేరు సాధించిందన్నారు. అదే విధంగా ఎందరో కవులు ఈ ప్రాంతానికివన్నె తెచ్చారని తెలిపారు. కవితోత్సవం, తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు జిల్లా కేంద్రంలో నిర్వహించటం పట్ల కళావేదిక సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. జాతీయస్థాయి కవి సమ్మేళనం నిర్వహించి కవులందరిని ఒకే వేదిక పైకి చేర్చటం అందరికి ఆనందమన్నారు. కళావేదిక నిరంతర సాహితీ యజ్ఞంలో భాగంగా రూపొందించిన శాంతిభాయ్ పాడిన పాట సిడిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అ విష్కరించారు.

## రాష్ట్రానికి టిడిపి శ్రీరామరక్ష: నాగోతు శౌరయ్య

నకరికల్లు, అక్టోబర్ 8 ప్రభాతవార్త : రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు తెలుగుదేశంపార్టీ పాలనే శ్రీరామరక్ష అని ఆ పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు నాగోతు శౌరయ్య అన్నారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడుతో చీకట్లు కమ్ముకున్నాయన్నారు. వైకాపా ప్రభుత్వం అన్యాయంగా, అక్రమంగా బాబును అరెస్ట్ చేసిందన్నారు. 40 ఏళ్ళకు పైగా రాజకీయాలలో అవినీతి మచ్చలేని చంద్రబాబుపై అవినీతి కేసు బనాయించి జైలుకు పంపడం దారుణమన్నారు. గత నెల రోజులుగా తెలుగుదేశంపార్టీ శ్రేణులతో పాటు సిపిఐ, సిపిఎం, జనసేన, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారన్నారు. అనుభవం అభివృద్ధిని ఆకాంక్షించే నాయకుడు చంద్రబాబుఅని, ఆయనపై అవినీతి ఆరోపణలు న్యాయస్థానంలో నిలవబోవని తెలిపారు. ప్రభుత్వంపై రోజు రోజుకు ఆగ్రహావేశాలు పెరుగుతున్నాయన్నారు.

## 'వాసవిక్లబ్ సేవలు అభినందనీయం'

వినుకొండ,అక్టోబర్8,ప్రభాతవార్త: వినుకొండ వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 19వ వార్షికోత్సవ వేడుకలు డిస్ట్రిక్ గవర్నర్ పట్టణానికి చెందిన కజ్జాయం విజయలక్ష్మి సుబ్బారావుల ఆధ్వర్యంలో స్థానిక ఎన్నార్టీ రోడ్డు నందు గల కెజిఎల్ కన్వెన్షన్ ఏసీ హాలు నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్‌కు చెందిన కెసిజిఎఫ్ ఆగిరి వెంకటేష్, వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వాసవిక్లబ్ సేవలను




కొనియాడారు. అనంతరం పలు క్రీడా విభాగాల్లో విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేసి మెమోంటోలు అందజేశారు. కజ్జాయం విజయలక్ష్మి సుబ్బారావు దంపతులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుడిపాటి రమేష్, పొట్టి హనుమంతరావు, కొత్తూరి శ్రీనివాసరావు, సుజాత కొత్తమాసు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న అఘోరాలు



దుర్గి, అక్టోబర్ 8, ప్రభాతవార్త :అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారిని ఆదివారం అగోరాలు దర్శించుకున్నారు. కాశీకి చెందిన 10 మంది అగోరాల బృందం దేశ పర్యటనకు బయలుదేరింది. పర్యటనలో పలు దేవాలయాల సందర్శనలో భాగంగా ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయానికి వచ్చిన అగోరాలను భక్తులు ఆసక్తిగా చూశారు. వీరి పర్యటన వివరాలను వెల్లడించడానికి అంగీకరించలేదు.

## ఆధ్యాత్మిక చింతనతో జీవించాలి: ఎమ్మెల్యే పీఆర్కే



విజయపురిసౌత్, అక్టోబర్ 8 ప్రభాత వార్తః ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. ఆదివారం మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో గల చర్చిలో నూతన గదుల నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కక్షలు విడనాడి ప్రశాంత జీవనం గడపాలన్నారు. చర్చి అభివృద్ధికి తన వంతు సాయం అందిస్తానని తెలిపారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కేను గ్రామస్తులు, చర్చి పెద్దలు దుశ్శాలువలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ నేత బూడిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతల జలదీక్ష

విజయపురిసౌత్, అక్టోబర్ 8 ప్రభాతవార్తః టీడీజీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా మాచర్ల మండలం అనుపు జలాశయంలో ఆదివారం టీడీపీ నేతలు జలదీక్ష నిర్వహించారు. జలాశయంలోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదించమని వేడుకున్నారు. ప్రభుత్వ అవినీతిపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం



ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు. చంద్రబాబునాయుడును జైలు నుంచి విడుదల చేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు. చంద్రబాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను తీసివేయాలని డిమాండ్ చేశారు. జై చంద్రబాబు, జైజై తెలుగుదేశం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, కుర్రి శివారెడ్డి, నేరేటి వీరాస్వామి యాదవ్, గుండాల శ్రీనివాసరావు, గోరంట్ల నాగేశ్వరరావు, చప్పిడి రాము, బాబుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల మధ్య వివాదం: వ్యక్తిపై గొడ్డలితో దాడి

మాచర్ల, అక్టోబర్ 8 ప్రభాతవార్తః మహిళల మధ్య నెలకొన్న వివాదం ఘర్షణగా మారి వ్యక్తిపై గొడ్డలితో దాడికి కారణమైంది. ఈ సంఘటన మాచర్ల మండలం కంభంపాడులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కంచర్ల గురవయ్య, బెల్లంకొండ నరసింహారావు గృహాల వద్ద మహిళల మధ్య వివాదం జరిగింది. మాటా మాటా పెరిగి గురవయ్య, నరసింహారావుల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో గురవయ్య ఆగ్రహించి నరసింహారావుపై గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో నరసింహారావుకు స్వల్ప గాయాలయ్యాయి. నరసింహారావు దీనిపై మాచర్ల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


## వ్యక్తి దారుణ హత్య: వివాహేతర సంబందమే కారణం!



కారంపూడి, అక్టోబర్ 8 ప్రభాతవార్తః వివాహేతర సంబంధం ఓ వ్యక్తి హత్యకు కారణమైంది. ఈ సంఘటన మండల కేంద్రమైన కారంపూడిలోని చోటుచేసుకుంది. బొల్లాపల్లి మండలం జయంతిపురం గ్రామానికి చెందిన మిర్యాల శ్రీనివాసరావు (45) కారంపూడి యానాది కాలనీలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. శనివారం సదరు మహిళను కలిసేందుకు ఆమె ఇంటికి రాగా, ఆమె నాగుల్‌మీరా అతని కాళ్లు, చేతులు కట్టేసి గొంతు నులిమి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజినేయులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## అర్థాంతరంగా నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

### నిధులు మురిగిపోయే అవకాశం ఉందంటున్న ఉపాధ్యాయులు



కారంపూడి, అక్టోబర్ 8 ప్రభాతవార్తః మండల కేంద్రమైన కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్మాణం చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం అర్థంతరంగా ఆగిపోయాయి. హైస్కూల్‌లోని 17 అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 కోట్లు కేటాయించింది. గదుల నిర్మాణ పనులు ప్రారంభించి లెంటర్ లెవల్ వరకు రావడం అప్పటి నుంచి పనులు నిలిపివేశారు. అదనపు తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. రెండు నెలల నుంచి పనులు నిలిపివేయడం వలన పాఠశాలలో ఉన్న ఇనుము, కంకర, సిమెంట్ సామాగ్రి గుర్తు తెలియని వ్యక్తులు తీసుకుపోతున్నారు. పాఠశాలకు మంజూరు నిధులు పనులు చేయకపోవడంతో రూ. 8 లక్షలు గ్రాంటును వినుకొండ నియోజకవర్గంలోని గణేషుని పాఠశాలకు మళ్లించారు. కాంట్రాక్టర్ పనులు చేయకుంటే మంజూరు అయిన నిధులు కూడా మురిగిపోయే అవకాశం ఉందని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు కింద లక్షల రూపాయలను ప్రభుత్వం విడుదల చేస్తోంది. అధికారులు చొరవచూపి అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## గుంటూరు, పల్నాడు జట్ల మధ్య టెస్ట్ క్రికెట్ పోటీలు

నరసరావుపేట, అక్టోబర్ 8 ప్రభాతవార్త : గుంటూరు - పల్నాడు జిల్లాల 23 సంవత్సరాలలోపు బాలుర టెస్ట్ క్రికెట్ పోటీలు స్థానిక ఏసిఏ ఎస్‌కెఆర్‌బిఆర్ క్రికెట్ గ్రౌండ్ నందు ఆదివారం జరిగాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల మూడు రోజుల టెస్ట్ క్రికెట్ పోటీలను పర్యవేక్షిస్తున్న ఏపి క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ ఇన్‌ఛార్జి ఎన్.సీతాపతిరావులు పోటీల వివరాలను తెలియజేశారు. గుంటూరు జిల్లా జట్టు 63 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 13 పరుగుల ఆధిక్యం లభించింది. మహిమ కుమార్ 44 పరుగులు, జానీబాషా 29 పరుగులు చేశారు. ప్రకాశం జిల్లా జట్టు 44 ఓవర్లలో 171 పరుగులు చేసింది. ఆ జట్టులో పవన్ కార్తికేయ 64 పరుగులు, అఖిల్ 37 పరుగులు చేశారు. చిత్తూరు జిల్లా జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 52 పరుగులు చేసింది. ఆ జట్టు విజయానికి 107 దూరంలో ఉంది.

# బాపట్ల జిల్లా వార్త



# వైఎస్ కుటుంబంతోనే సంక్షేమ పాలన

## -మసీదుల ప్రచార కమిటీ కన్వీనర్ షేక్ నాజర్

పొన్నూరు, అక్టోబర్ 8,ప్రభాతవార్త: నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు వైఎస్ జగన్మోహనరెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టి కొనసాగిస్తున్నారని మసీదుల ప్రచార కమిటి కన్వీనర్ షేక్ నాజర్ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో ఆదివారం హమ్ సబ్ జగన్ కే సాథ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాజర్ మాట్లాడుతూ ముస్లింలకు మేలు చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి



మాత్రమేనన్నారు. ముస్లింలకు నాలుగుశాతం రిజర్వేషన్ అమలు చేసి ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి చిరస్థాయిగా నిలిచారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తండ్రి ఆశయాన్ని పుణికిపుచ్చుకొని ముస్లింల అభివృద్ధికి, మసీదులు ఇమామ్‌ల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో కూడా ముస్లింల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. గత పాలకులు ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూశారే తప్ప చేసిందేమీ లేదన్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ఇమాములకు సరిగ్గా గౌరవ వేతనం అందుతుందా..?లేదా..? అనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. ముస్లింల సంక్షేమానికి, మసీదుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చేయడమే హమ్ సబ్ జగన్ కే సాథ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం అందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు షేక్ సుబాని(బంటి), షేక్ సుబాని(టెంట్‌హౌస్), షేక్ బాషీద్, కార్యదర్శులు షేక్ జానా, షేక్ జానీ, షేక్ సాదిక్, షేక్ సలీం, నాయకులు నాగూర్ షరీఫ్, గౌస్, సుభాని,సులేమాన్, గోకుల్, సుభాని,బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు కిరణ్‌చంద్ ఆధ్వర్యంలో బడ్డీకొట్లు పంపిణీ

మంగళగిరి, అక్టోబర్ 8, ప్రభాతవార్త : పెద్దవడ్లపూడి గ్రామంలో చిరువ్యాపారులకు సుమారు రూ.60వేలతో మూడు బడ్డీకొట్లను జవ్వాది కిరణ్‌చంద్ సహాకారంతో అందజేశారు. గ్రామంలోని చింతల కాలనీకి చెందిన బాణావత్ అంజమ్మ,కొత్తపాలెం కు చెందిన షేక్ అల్లాభక్షు,చెక్ పోస్టు సెంటర్‌కు చెందిన ముద్రబోయిన మస్తానమ్మలకు బడ్డీకొట్లను అందజేశారు. తమకు బడ్డీకొట్టు అందజేసి జీవనోపాధికి అండగా నిలిచిన టిడిపి రాష్ట్ర నాయకులు జవ్వాది కిరణ్‌చంద్‌కు లబ్ధిదారులు ప్రత్యేకంగా




ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య,జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు నడపన దుర్గారావు,సీనియర్ నాయకుల మాదల రమేష్‌బాబు,కొడవలి ఆనంద్,అన్నే చంద్రశేఖర్,చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు,గుడిమెట్ల మరియదాసు,కటారి సాంబయ్య,కట్టా దుర్గారావు,బుస్సా శివయ్య,షేక్ అమీర్‌బేగ్,మారేళ్ళ నాగేశ్వరరావు,కోట ప్రసాద్,మొద్దుకూరి రమేష్,జాలాది సందీప్,కంచర్ల బద్రి,కటారి అనిల్,ఓంకార్,కొండూరు నరేంద్ర, ఉన్నం నాని,రఘు,శృంగారపాటి రాజశేఖర్,పోతురాజు వెంకట్రామయ్య,శ్రీను,రాఘవయ్య,షేక్ జాన్‌బాబు, జగదీష్, అశోక్,బొల్ల అంకబాబు, ఆసిఫ్, రాంబాబు, రవికుమార్, బాజీవలి,దీపు, లోహిత్‌సాయి,బాలాజీ,తెలుగుదేశం పార్టీ శ్రేణులు,జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న తెదేపా రిలే దీక్షలు

సత్తెనపల్లి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : మాజీముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ బాబుకు తోడుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 26 రోజుకు చేరుకుంది. నందిగామ గ్రామ తెలుగుదేశంపార్టీ తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని దీక్షల్లో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి



విరమింపజేశారు. అదే విధంగా పట్టణంలోని కన్నా లక్ష్మీనారాయణ క్యాంప్ కార్యాలయంలో తెలుగుయువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబుకు తోడుగా రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న వారికి కన్నా నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుందని, ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారన్నారు. చంద్రబాబుపై అక్రమంగా కేసులు బనాయించి జైలుపాలు చేయడం ఎంతో దుర్మార్గమన్నారు. అరాచకపాలనకు స్వస్తి చెప్పాల్సిన రోజులు దగ్గరకు వచ్చాయని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని పిలుపునిచ్చారు.

## మాచాయపాలెంలో పూర్తయిన జగనన్న భూ సర్వే

బెల్లంకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న భూ సర్వే కార్యక్రమాలు మండల పరిధిలోని మాచాయపాలెం గ్రామంలో పూర్తయినట్లు మండల సర్వేయర్ వీరయ్య తెలిపారు. గ్రామంలో 1200 ఎకరాలకు పైగా మెట్ట మార్గాన భూములు ఉన్నాయని, ఎటువంటి వివాదాలు లేకుండా భూ సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సర్వే



సమయంలో జేసి శ్యామ్‌ప్రసాద్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజకుమారి, తహశీల్దార్ నిర్మలా,గ్రామ సర్వేయర్‌లు, వివిధస్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## 'నాయకుల దిగజారుడు వ్యాఖ్యలు'

గుంటూరు కల్చరల్, అక్టోబర్ 8, ప్రభాతవార్త : ఇటీవల కొందరు నాయకులు వాడుతున్న అనారోగ్య వికృత పదజాలం,వ్యక్తిగత ధూషణలు శృతిమించి పోతున్నాయని ముఖ్యంగా మహిళలను కించపరిచేలా వారి హోదాకు కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగేలా కొందరు నాయకులు చేస్తున్న వెకిలి చేష్టలు,అసభ్యకర విమర్శలు తిట్ల పురాణాలు సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉన్నాయని అవగాహన సంస్థ ఖండిస్తుంది.దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్న నాయకుల తీరుపై వారికి ఓట్లేసి గెలిపించిన ప్రజలు కూడా అసహనంతో ఉన్నారని తమ ప్రజాప్రతినిధులు,నాయకులు ఇంత భ్రష్టుపట్టారేమిటి,రాజకీయాలు ఇంత జుగుప్సాకరంగా మారాయేమిటని బాధపడుతున్నారని తగు సమయంలో తగురీతిలో వారికి గుణపాఠం చెప్పటానికి సిద్దంగా ఉన్నారని అవగాహన సంస్థ పేర్కొంది

## 'మానవ హక్కులకర్త డాక్టర్ బాలగోపాల్ చిరస్మరణీయుడు'

పొన్నూరు, అక్టోబర్ 8,ప్రభాతవార్త: మానవ హక్కుల కర్త, మానవ హక్కుల వేదిక నిర్మాత దివంగత డాక్టర్ కె.బాలగోపాల్ ఎప్పటికీ చిరస్మరణీయులని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ తుమాటి రాజారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో డాక్టర్ కె.బాలగోపాల్ 14వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజారావు మాట్లాడుతూ మానవ హక్కులను నిర్వహించిన వ్యక్తి, స్వతంత్ర ఆలోచనలతో ఎదిగి, సామాజిక ఉద్యమాల స్ఫూర్తితో హక్కుల ఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళిన ఏకైక నాయకుడు డాక్టర్ కె.బాలగోపాల్ అని



చెప్పారు. ఆయన మృతి ప్రతి పౌరుడికి తీరని లోటని చెప్పారు. బాలగోపాల్ హక్కుల స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత హక్కుల సంఘాలపై ఉందన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు జి.యస్.రాయెల్ మాట్లాడుతూ హక్కుల సంఘాలు ఏ సంస్థలకు అనుబంధంగా ఉండకుండా, స్వతస్సిద్ధమైన ఆలోచనలతో హక్కుల కోణంలో ఆలోచిస్తూ ముందుకెళ్ళాలన్నారు. హక్కుల సంఘాలు సమాజాన్ని చైతన్య పరుస్తూ, సమాజాభివృద్ధికి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడికి వున్నటువంటి మానవ హక్కులను ప్రతి ఒక్కరికి తెలిసేలా చేయాల్సిన బాధ్యత సంఘాలపై ఉందన్నారు. తొలుత డాక్టర్ కె.బాలగోపాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుల నిర్మూలనా పోరాట సమితి నాయకుడు తోడేటి శ్రీనివాస్, గుడిసెవాసుల సంఘం నాయకుడు బలగాని వెంకటేశ్వర్లు, హక్కుల కార్యకర్తలు కొప్పుల విజయ్‌కుమార్, షేక్ సుబాని, న్యాయవాది ప్రకాష్ తదితరులు ప్రసంగించారు.

## ఎంఎ మొహమ్మద్ వారధిగా పనిచేయాలి

### -ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్

పొన్నూరు, అక్టోబర్ 8,ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడిగా నియామకమైన ఎంఎ మొహమ్మద్ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసి ప్రభుత్వ ఫలాలను అర్హులందరికీ అందేవిధంగా చూడాలని పొన్నూరు ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ అన్నారు. స్థానిక ఆర్మీ అసోసియేషన్ కార్యాలయంలో ఎంఎ మొహమ్మద్‌కు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడుతూ ఎంఎ మొహమ్మద్ పదవి రాకముందు కూడా అనేక సేవా కార్యక్రమాలు చేయడంలో



ఎప్పుడూ ముందుండేవారన్నారు. ప్రస్తుతం పట్టణాధ్యక్షుడిగా చేయడంతో ఆయన బాధ్యత మరింత పెరిగిందని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేసి మంచి పేరు పొందాలని ఆకాంక్షించారు. సన్మానగ్రహీత ఎంఎ మొహమ్మద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చారని, పదవి న్యాయం జరిగేవిధంగా, ప్రజలందరికీ సమానమైన న్యాయం పాటించి తనపై ఉంచిన బాధ్యతను, కర్తవ్యాన్ని తు.చ.తప్పకుండా పాటిస్తానని చెప్పారు. పట్టణాధ్యక్షుడిగా నియామకంతో తన బాధ్యత మరింత పెరిగిందని భావిస్తున్నట్లు చెప్పారు. తన పరిధిలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, మళ్ళీ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం కొనసాగేలా చూడాలని ప్రతి ఒక్కరిని వేడుకొన్నారు. అనంతరం ఎంఎ మొహమ్మద్‌ను శాలువాలతో, బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకుడు రఫీ, కెప్టెన్ గుమ్మడి ప్రసాదరావు, అంజుమన్ కమిటి అధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము), వలిభాష తదితరులు పాల్గొన్నారు.

# 'అంబటి వ్యాఖ్యలు అప్రజాస్వామికం'

సత్తెనపల్లి, అక్టోబర్ 8 ప్రభాతవార్త : పత్రికా విలేకర్లపై రాష్ట్ర జలవనరులశాఖామంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు అప్రజాస్వామికమని తెలుగుదేశంపార్టీ లీగల్ సెల్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మంత్రి రాంబాబు పత్రికా యాజమాన్యాలపై విరుచుకుపడటం సరైంది కాదన్నారు.



విలేకర్ల సమావేశాలలో మీది ఏ పత్రిక అంటూ ఇష్టమొచ్చినట్లుగా విరుచుకు పడుతూ మాట్లాడటం రాంబాబుకు సరైంది కాదన్నారు. వైకాపా సంస్కృతి, స్వేచ్ఛ స్వతంత్రాలను హరించడంలో బ్రిటీష్‌వారిని మించిపోయారన్నారు. ఇప్పటికైనా పత్రికలపై ఇష్టానుసారంగా మాట్లాడటం మానుకోవాలని, లేకుంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సమావేశంలో లీగల్ సెల్ అధ్యక్షులు ఎం.వి.చలపతిరావు, సభ్యులు అనుమోలు జయరాం, ఉన్నం శేషగిరిరావు, ఖాజావలి, శ్రీనివాసరావు, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

## నర్గీస్‌కు నోబుల్ శాంతి బహుమతి పట్ల హర్షం

గుంటూరు కల్చరల్, అక్టోబర్ 7, ప్రభాతవార్త : ఇరాన్‌లో మహిళల అణచివేతకు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి,మానవ హక్కుల పరిరక్షణ,అందరికీ స్వేచ్ఛకోసం ఉద్యమం సాగిస్తున్న మానవహక్కుల కార్యకర్త "నర్గీస్ మొహ్మది" కి ప్రతిష్టాత్మక నోబుల్ శాంతి పురస్కారం లభించడం పట్ల అవగాహన సంస్థ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు..నోబుల్‌శాంతి బహుమతి పొందిన నర్గీస్ ప్రస్తుతం ఇరాన్‌లో ఖైదు చేయబడిఉన్నారని మహిళల హక్కుల కోసం,మరణ శిక్షరద్దుకోసం,ఇరాన్ జైళ్ళలో స్థితిగతుల మెరుగుదల కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న ధీరవనిత నర్గీస్‌కు నోబుల్ శాంతి బహుమతి రావడం అభ్యుదయ వాదులు,ప్రగతిశీల కాముకులకు బలం చేకూరినట్లయిందని,నర్గీస్‌కు శాంతి బహుమతి ప్రకటించడం పట్ల అవగాహన సంస్థ సభ్యులు అభినందనలు తెలిపారు.

## మెరిట్ విద్యార్థినికి ఆర్థిక చేయూత

తెనాలి, అక్టోబరు 8, ప్రభాత వార్త : విద్యలో ఉన్నతంగా రాణిస్తూ విద్యా అవసరాలకు తగు ఆర్థిక సహకారం లభించని విద్యార్థులకు చేయూతనిచ్చే విషయంలో భరోసా స్వచ్ఛంద సంస్థ తన వంతుగా సహకారం అందిస్తుందని సంస్థ నిర్వాహకులు కఠిక శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని నందివెలుగు



గ్రామంలో నిరుపేద విద్యార్థిని లీలావతి విద్యా అవసరాల నిమిత్తం ఆదివారం రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని భరోసా స్వచ్ఛంద సంస్థ ద్వారా కఠిక శ్రీకాంత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి, దేవమణి, పిరాటి రమేష్, ఎస్.మహేశ్వరరావు, పవన్‌కుమార్, కె.హనుమంత్, ప్రసాద్‌బాబు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాయకుడు చంద్రబాబు: ఆలపాటి రాజా

తెనాలి, అక్టోబరు 8, ప్రభాత వార్త : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సుదీర్ఘ కాలం రాష్ట్ర అభ్యుదయం కోసం పాటుపడిన చంద్రబాబునాయుడు సామాన్య వ్యక్తి కాదని ప్రజల శక్తి ఆయన వెంట ఉందని ఇప్పటికైనా రాష్ట్ర పాలకులు తెలుసుకోవాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా స్వరాజ్ సెంటర్లో బాబుతో మేము సైతం పేరిట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. పెద్ద ఎత్తున పార్టీలోని క్రియాశీలక నాయకులు రిలే దీక్షలో పాల్గొని చంద్రబాబుకు తమ సంఘీబావం తెలుపుతూ రాష్ట్ర



పాలకుల తీరును నిరశిస్తూ నినాదాలు చేశారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, శిబిరంలో దీక్షలో ఉన్న వారికి నిమ్మరం ఇచ్చి దీక్షను విరమింజేశారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి అడుగంటిపోయిందని సంక్షేమం ప్రచారానికే పరిమితం అయ్యిందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు పాలకుల తప్పులను ఎత్తిచూపే పరిస్థితిని జీర్ణించుకోలేకపోతున్నారని, పాలకులు లోపాలను సవరించుకోవాలే కాని ప్రతిపక్షాలపై దాడులకు పాల్పడే సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు. ఈ విధానాలపై ప్రజల్లో స్పష్టమైన ఓ నిర్ణయం ఏర్పడిందని రానున్న రోజుల్లో రాష్ట్ర పాలకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు తరువాత ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజాస్వామ్య వాదులందరూ కంకణ బద్దులై నిరసనలు తెలియజేస్తూ తమ ఉనికిని తెలియపరుస్తున్నారని ఆలపాటి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కావేటి సామ్రాజ్యం, అన్నం పిన్నారావు, పార్టీలోని వివిద స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'అంబేద్కర్ జీవిత చరిత్రను జనకథగా మలిచిన ప్రభాకర్ అభినందనీయుడు'

తెనాలి, అక్టోబరు 8, ప్రభాత వార్త : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను జనబాహుల్యంలోకి తీసుకువెళ్ళే ప్రక్రియలో భాగంగా జనకథగా రూపొందించిన మేకతోటి ప్రభాకర్ అభినందనీయులని నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్ అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చరిత్రను జనకథ కళారూపాల్లో గ్రామ గ్రామానికి తీసుకువెళ్ళాలని విశాంత్ర ఉపాధ్యాయులు మేకతోటి ప్రభాకరరావు రూపొందించిన జనకథ రూపక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం స్థానిక ఐతానగర్‌లోని పొట్టి శ్రీరాములు కళ్యాణ మండపంలో నిర్వహించారు.



మేకతోటి ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రొఫెసర్ కనపర్తి అబ్రహం లింకన్ మాట్లాడుతూ భారతదేశ సమతుల్యమైన సమతా భావంతో ముందుకు వెళ్ళాలంటే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అంబేద్కర్ త్యాగ నిరతి చాలా మందికి తెలియదని ఇప్పుడు ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. సమతావాదులు మానవతా వాదులు, అంబేద్కరిస్టులు సమిష్టిగా ముందుకు కదలాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ 2 అత్తోట నాగవేణి, దళిత మహాసభ నాయకులు నూకకోటి బాబురావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, న్యాయవాది పిల్లి విద్యాసాగర్, పల్నాటి శ్రీరాములు, దేవరపల్లి వీరయ్య, కంచర్ల శేషు, జాషువా విజ్ఞాన సమితి కన్వీనర్ న్యూటన్, రంగస్థల కళాకారులు ఎవి కోటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, గుమ్మడి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ కళావేదికచే ప్రజ్ఞాచారికి సత్కారం

తెనాలి, అక్టోబరు 8, ప్రభాత వార్త : శ్రీశ్రీ కళావేదిక నిర్వహించే సాహితీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నర్సరావుపేట రాధా సుందర కళ్యాణ మండపంలో శ్రీశ్రీ కళావేదిక పల్నాడు జాతీయ శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమం జరిగింది. జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో తెనాలి రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన మధుర కవి నూతక్కి అబ్రహం కుమారుడు సాయితీ రత్న




జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత నూతక్కి ప్రజ్ఞాచారిని శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక సాహితీ సేవ అనే శిర్షికతో సీసపద్య పఠనం తొలుతు నిర్వహించారు. అనంతరం కవిసమ్మేళనంలో పాల్గొన్న రచయితలను, కవులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ రమావతి, పల్నాడు శాఖ అధ్యక్షురాలు రమాబాయి, రాష్ట్ర కార్యదర్శి గుండాల రాకేష్ తదితర ప్రముఖులు నూతక్కి పూర్ణప్రజ్ఞాచారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక కార్యవర్గ సభ్యులు, పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

## గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీగా.. వైకాపా తీరు

### లోక్‌సత్తా నేత బండారు రామమోహన్‌రావు


తెనాలి, అక్టోబరు 8, ప్రభాత వార్త : రాష్ట్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలకులు కేంద్రంలోని ఎన్డీయేతో వ్యవహరించే వ్యవహారం గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తి తీరుగా ఉందని రాష్ట్రానికి రావాల్సిన ఏ రాయితీలను తెచ్చుకునే విషయంలో స్పష్టత లేకుండా రాజదాని లేని రాష్ట్రాన్ని పరిపాలించడం దురదృష్టకరమని ఇప్పటికైనా అమరావతి ఒక్కటే ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని అనే విషయాన్ని స్పష్టం చేయాలని లోక్‌సత్తా రెండు తెలుగు రాష్ట్రాల ఉద్యమ నాయకులు బండారు రామమోహన్‌రావు



డిమాండ్ చేశారు. ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు తెనాలి వచ్చిన రామమోహన్‌రావు స్దానిక బృందావనం కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. ఆంధ్రులకు అమరావతి ఒకటే రాజదాని అనే విషయంలో స్పష్టత కల్పించాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలను అమలు చేయడం పట్ల గత తొమ్మిదేళ్ళుగా అన్యాయం చేస్తుందని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలోని పాలకులు సైతం పైకి మూడు రాజధానులు వద్దు ఒక రాజధాని ముద్దు అని చిలక పలుకులు పలుకుతున్నారని విమర్శించారు. గత తొమ్మిదేళ్ళుగా కడప ఉక్కు కర్మగారం ఊసే లేదని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం డిపిఆర్ ఆమోదించి ఆర్థిక అంచనాలు పెంచే విషయంలో కూడా మీనమేషాలు లెక్కపెడుతున్నారని విమర్శించారు. తెలంగాణా రాష్ట్రంలో ఎన్నికలు వస్తున్నందున అక్కడ ఓటర్లపై కపట ప్రేమను చూపిస్తూ కేంద్ర పాలకులు వరాలు కురిపిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గాల పున:ర్ విభజన చట్టం అడ్డం వస్తే జమ్మూకాశ్మీర్‌లో ఏ రకంగా నియోజకవర్గాలనుపునర్విభజన విభజన చేశారని రామోహన్‌రావు కేంద్ర పాలకులను ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో మెలికలు తీసివేసి రానున్న 2024ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు అయ్యేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలను బూచిగా చూపిస్తూ రిజర్వేషన్ అంశాన్ని పక్కన పెడుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర సభ్యులు శరత్‌చంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప దీక్షాపరులకు సద్ది ప్రారంభం

తెనాలి, అక్టోబరు 8, ప్రభాత వార్త : మాలాదారులై నియమ నిష్టలతో దీక్షను నిర్వహించే అయ్యప్పస్వాములకు 103రోజులు సద్ది ప్రసాదాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక బాలాజీరావుపేట అయ్యప్పపురంలోని ప్రధాన అయ్యప్ప దేవాలయంలో ఘనంగా ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపక అర్చక స్వామి అయ్యప్ప భక్తులకు మాలధారణలు చేసే గురుస్వామి దుర్భాహరిబాబు స్వామి నేతృత్వంలో మాల ధరించిన స్వాములకు సద్ది ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన క్రమంలో హరిబాబు స్వామి మీడియాతో మాట్లాడుతూ 2006వ సంవత్సరం అక్టోబరు 18వ తేదిన అయ్యప్పస్వామి



దేవాలయాన్ని నిర్మించే కార్యచరణ చేపట్టి అప్పటి నుండి ప్రతి సంవత్సరం స్వాములకు దీక్ష పూర్తయ్యే వరకు సద్ది ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 17వ వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ఇక నుండి ప్రతి సంవత్సరం అక్టోబరు 8వ తేదిన స్వాములు తొలి మండల దీక్షలో స్వామిని దర్శించుకునేందుకు సద్ది ప్రసాదాన్ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జనవరి 17వ తేది వరకు నిర్వహించే ఈ కార్యక్రమంకొనసాగిస్తామన్నారు. ఈనెల 15వ తేది నుండి 24వ తేది వరకు దేవిశరన్నవరాత్రోత్సవాలు కార్యక్రమంలో భాగంగా అష్టభుజ దుర్గాదేవి అమ్మవారికి తొమ్మిది రోజులు పూజలను ఏర్పాటు చేసినట్లు హరిబాబుశాస్త్రి తెలిపారు.

# బుల్లితెర ప్రీమియర్ డేట్, టైం



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన హిట్ మూవీ వాల్తేరు వీరయ్య. బాబీ దర్శకత్వం వహించారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించింది.. బాక్సా ఫీసు వద్ద భారీ వసూళ్లు రాబట్టుకుంది.. ఈచిత్రం ఇపుడు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా బుల్లితెర ప్రేక్షకులకు కనువిందు చేయబోతోంది.. ఈ చిత్రం దసరా సందర్భంగా బుల్లితెరపై కన్పించనుంది.. అక్టోబర్ 24న సాయంత్రం 6 గంటలకు జెమినీ టివిలో ప్రసారం కాబోతోంది.. ఈ చిత్రంలో శ్రుతిహాసన్ హీరోయిన్‌గా నటించింది.. మాస్‌మహారాజా రవితేజ ,కేథరిన్ థెరిస్సా, ప్రకాష్‌రాజ్, జయం సింహ కీలకపాత్రల్లో అలరించిన సంగతి తెలిసిందే. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించారు. మైత్రీమూవీ మేకర్స్ ఈచిత్రాన్ని నిర్మించింది.

# డిజిటల్ ప్రీమియర్‌కు రెడీ




యంగ్ హీరో సుధీర్‌బాబు ప్రధానపాత్రలో నటించిన తాజా చిత్రం మామా మశ్చీంద్ర. ఈచిత్రానికి నటుడు, రైటర్ హర్షవర్ధన్ రచన, దర్శకత్వం వహించారు.. అక్టోబర్ 20 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుందని అమెజాన్ ప్రైమ్ వీడియో ప్రకటించింది.. డిజిటల్ ఫ్లాట్‌ఫామ్ ఈ దసరా సీజన్‌కు కొన్ని చిత్రాలను విడుదల చేస్తోంది.. మామా మశ్చీంద్ర అందులో ఒకటిగా నిలిచింది.. సుధీర్‌బాబు నటించిన ఈచిత్రం థియేటర్లలో విడుదలైన తర్వాత ఇపుడు ఓటిటిలోకి రాబోతోంది. హర్షవర్ధన్, ఆలీరెజా, రాజీవ్ కనకాల, హరితేజ, అజయ్, మిర్చికిరణ్, తదితరులు నటించారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్‌ఎల్‌ఎల్‌పి , సృష్టిసెల్యులాయిడ్‌లపై ఈసినిమాను నిర్మించారు. చైతన్ భరధ్వాజ్ సంగీతం అందించారు.. ఈషారెబ్బా, మృణాళిని రవి హీరోయిన్లుగా నటించారు.

# ఫెయిల్యూర్ మూవీస్ నుంచే కొత్త విషయాలు నేర్చుకుంటా..

క్లాస్,మాస్ అనే తేడా లేకుండా అన్నివర్గాల ప్రేక్షకుల పల్స్ తెలిసిన దర్శకుడు మారుతి.. ఆయన సినిమాలు థియేటర్‌లో బెంచ్ టికెట్ నుంచి బాల్కనీ దాకా ఆడియెన్స్ ఎంజాయ్ చేసేలా ఉంటాయి. కమర్షియల్ సినిమాలు చేస్తూ ఆ కథలోన్ల ఏదో ఒక మంచి విషయాన్ని ప్రేక్షకులకు చెప్పటం మారుతి ప్రత్యేకత. ఈ రోజుల్లో బస్‌స్టాప్ సినిమాలతో యూత్‌ట్రెండ్ మళ్లీ తీసుకొచ్చారాయన.. డిజిటల్ టెక్నాలజీ ఉపయోగించుకుని 5డీలో పిక్చరైజ్ చేసి సక్సెస్‌ఫుల్ సినిమా ఇవ్వొచ్చని ప్రూవ్ చేశారు.. ప్రేమకథా చిత్రమ్‌తో హారర్ కామెడీతో మారుతి ఒక ట్రెండ్ క్రియేట్ చేశారు. భలే భలే మగాడివోయ్ సినిమాతో ఇండస్ట్రీకి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అందించి



డైరెక్టర్‌గా మరో మెట్టు ఎదిగారు మారుతి. ఆయన సినిమాలు యావరేజ్‌గా ఆదరణ పొందినా డిస్ట్రిబ్యూటర్స్, ప్రొడ్యూసర్స్‌కు లాభాలు తెచ్చిపెడుతుంటాయి... హీరోలందరి ఫేవరేట్ డైరెక్టర్ మారుతి.. తన ఫెయిల్యూర్ మూవీస్ నుంచే నిత్యం కొత్త విషయాలు నేర్చుకుంటానని అందుకే కంటిన్యూ ఫ్లాప్స్ తనకెపుడూ రాలేదని చెబుతుంటారు.. తనే ఒక ప్రొడ్యూసర్ కావటంతో ప్రొడ్యూసర్ యాంగిల్‌లో అనుకున్న బడ్జెట్‌లోసినిమాలు చేయటం దర్శకుడిగా మారుతి ప్రొఫెషనలిజం చూపిస్తుంటుంది.. ప్రస్తుతం స్టార్ హీరో ప్రభాస్‌తో భారీ పాన్‌ఇండియా మూవీ రూపొందిస్తున్నారు.. ఇది ఆయన కెరీర్‌లో ఒక సెన్సేషనల్ మూవీ కాబోతోంది.. హీరో ప్రభాస్ ఇమేజ్‌కు తగినట్టు ఉంటూనే తన స్ట్రెంగ్త్ అయిన ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈసినిమా ఉంటుందని మారుతి చెప్పారు.. మంచి పాజిటివ్ వాతావరణంలో ప్రభాస్‌తో తన సినిమా ప్రోగ్రెస్ అవుతోందని మారుతి పేర్కొన్నారు.

# నేషనల్ సినిమా డే సందర్భంగా 'ద్రోహి'

సందీప్‌కుమార్, దీప్తి వర్మ జంటగా విజయ్ పెందుర్తి దర్శకత్వం వహిస్తున్న చిత్రం ద్రోహి.. గుడ్‌ఫెలో మీడియా సఫైరస్ మీడియా, వెడ్‌నెస్‌డే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై విజయ్ పెందుర్తి, శ్రీకాంత్‌రెడ్డి.డి సమర్పిస్తున్నారు.. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈచిత్రం ఈనెల 13న విడుదల కానుంది.. ఆ రోజు నేషనల్ సినిమా డే సందర్భంగా యూనిట్ ఈచిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.. అక్టోబర్13న మాత్రం మల్టీప్లెక్స్‌లో చూడాలని కోరారు.. ఈసందర్భంగా మీడియా సమావేశంలో త్రిగుణ్ టీజర్‌ను విడుదలచేశారు.. అనంతరం ఆయన



మాట్లాడారు.. దర్శకుడు, హీరోకు కళ అంటే ప్రాణమని, ఈ టీం అంతా ప్రేమతో ఈ చిత్రం చేశారన్నారు. మంచి టైటిల్‌తో వస్తున్నారని, టీజర్ ఆసక్తికరంగా ఉందన్నారు. దర్శకుడి పనితీరు టీజర్‌లో కన్పించిందన్నారు. ఈచిత్రం తప్పకుండా హిట్ అవుతుందని అన్నారు. హీరో సందీప్ మాట్లాడుతూ, ద్రోహి టైటిల్ వినగానే వెంటనే ఓకే చేశానని తెలిపారు. అద్భుతమైన డ్రామాగా తెరకెక్కిందన్నారు.. క్రిమినల్ అనగానే క్రైమ్, థ్రిల్లర్ అనుకుంటామని, ఇందులో అన్ని అంశాలు ఉన్నాయన్నారు.. ఈనెల 13న ఈచిత్రం విడుదల అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో హీరోయిన్ డెబా డాలీ, దర్శకుడు తదతరులు మాట్లాడారు.




# నరేష్‌కు టర్కీ గ్లోబల్ కల్చర్ అంబాసిడర్ గౌరవం...

ప్రముఖ సినీనటుడు డాక్టర్ నరేష్ విజయకృష్ణ చిత్ర పరిశ్రమలో తన 50 ఏళ్ల స్వర్ణోత్సవం సందర్భంగా టోకట్ నగరంలో హామ్కీ గ్రూప్ అండ్ టర్కీ సాంస్కృతిక మంత్రిత్వశాఖ నిర్వహించిన ఇండో టర్కిస్ ఫెస్టివల్ ఆఫ్ కల్చర్స్ ఈవెంట్‌లో టోకట్ గవర్నర్,సెక్రటరీ జనరల్ చేతులమీదుగా ప్రపంచ సాంస్కృతిక రాయబారి (గ్లోబల్ కల్చర్ అంబాసిడర్) బిరుదు, గౌరవాన్ని



అందుకున్నారు.. నరేష్‌కు టర్కీ, అనేక ఇతర దేశాలతోమంచి దౌతనయ సంబంధాలు ఉన్నాయి.. నరేష్ యునైటెడ్ నేషన్స్‌లో వింగ్ అయిన యునిగోలో కౌన్సిల్ జనరల్‌గా క్రియాశీలకంగా ఉన్నారు.. సినిమా పరిశ్రమకు సేవ అందించటంలో భాగంగా ఆయన టర్కీ, ఇతర దేశాల్లో సినిమా షూటింగ్‌లను ప్రోత్సహించటానికి ఆసక్తి కనబరుస్తున్నారు.. నటుడు శివబాలాజీ (మా కోశాధికారి), హీరో సుమన్, బాలీవుడ్ నుంచి చాలా మంది గాయకులు, మేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'భగవంత్ కేసరి' నుంచి అర్జున్ రాంపాల్ పరిచయం....

నందమూరి బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లోరూపొందుతున్న చిత్రం భగవంత్ కేసరి.. చిత్రంతోనేషనల్ అవార్డు విన్నింగ్ యాక్టర్ అర్జున్ రాంపాల్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు.. అర్జున్ రాంపాల్‌ను రాహుల్ సంఘ్వీగా టెర్రిఫిక్ లుక్‌లో పరిచయం చేస్తూ మేకర్స్ ఆదివారం ఆయన క్యారెక్టర్ పోస్టర్‌ను విడుదల చేశారు.. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో అర్జున్ రాంపాల్ డిజైనరీ వేర్‌లో సూపర్ స్టైలిష్‌గా కన్పిస్తున్న ప్పటికీ , తన ఇంటెన్స్ లుక్స్‌తో భయపెట్టారు. సింహాసనంపై కూర్చునన అర్జున్ రాంపాల్ రాయల్ వైబ్‌న క్రియేట్ చేశారు.. ట్రైలర్‌ను రివీల్ చేసే సమయానినకూడ పోస్టర్ ద్వారా మేకర్స్ తెలిపారు.. ట్రైలర్‌ను సోమ వారం రాత్రి 8.16 గంటలకు విడుదల చేయనున్నారు.. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు.. బాలకృష్ణ సరసన, కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీలీల కీలకపాత్రలో కన్పించ నుంది.. జాతీయ అవార్డు విన్నర్ అర్జున్ రాంపాల్ టాలీవుడ్ లోకి అడుగుపెడు తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు.. దసరా కానుకగా ఈనెల 19న విడుదల కానుంది.






# వరల్డ్ కప్ మ్యాచ్‌లో 'టైగర్ నాగేశ్వరరావు'

ప్రపంచ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆదివారంటీమిండియా ఆస్ట్రేలియా జట్టుతో చెన్నై మైదానం వేదికగాజరిగిన మ్యాచ్‌లో తెలుగు క్రికెట్ లైవ్‌షోలో 'టైగర్ నాగేశ్వరరావు'- మాస్ మహారాజా రవితేజ ఒకింత సందడి చేశారు.. తన ఎనర్జీతో ఆయన ఊపుతెప్పించారు.. వ్యాఖ్యాలతో కలిసి ఆయన కామెంటరీ ఇచ్చారు. క్రికెట్ అభిమానులతోనూ రవితేజ ముచ్చటించారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇపుడు వైరల్ అయ్యాయి. క్రికెటర్స్ సిరాజ్, కోహ్లీ అంటే ఇష్టమని రవితేజ పేర్కొనాననరు. కోహ్లీలోఉండే అగ్రెషన్, యాటిట్యూడ్, లుక్ తనకెంతో ఇష్టమని రవితేజ కామెంట్ చేశారు. ఆయనలోమంచి కాన్ఫిడెన్స్ కన్పిస్తుందని అన్నారు.

# చేగువేరా వర్ధంతి సందర్భంగా 'చే' టీజర్



తెరపై మరో బయోపిక్ రాబోతోంది.. క్యూబా పోరాట యోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'చే'.. క్యూబా తర్వాత ప్రపంచంలో తొలిసారి భారతీయ చిత్ర పరిశ్రమలో రూపొందుతున్న చేగువేరా బయోపిక్ ఇది. నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్ బ్యానర్‌పై బిఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషిస్తూ. దర్శకత్వం వహిస్తున్నారు.. సూర్య, బాబు, దేవేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్నారు.. ఈమూవీలో లావణ్య సమీరా, పూల సిద్ధేశ్వర్, కార్తీక్ నూనె, వినోద్, పసల ఉమామహేశ్వర్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. రవిశంకర్ సంగీతం అందిస్తున్నారు. త్వరలో సినిమా సెన్సార్‌కు వెళ్లనుంది..ఇటీవల చేగువేరా కూతురు డాక్టర్ అలైదా గువేరా ఈమూవీ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అక్టోబర్ 9న చేగువేరా వర్ధంతి సందర్భంగా టీజర్‌ను యూనిట్ విడుదల చేసింది. అనంతరం హీరో, దర్శకుడు బిఆర్ సబావత్ నాయక్ మాట్లాడుతూ, విప్లవవీరుడు , యువత స్ఫూర్తిదాయకుడు చేగువేరా జీవిత చరిత్రను సినిమాగా తీయటం చాలా గర్వంగా ఫీలవుతున్నానని అన్నారు. ఆయనచేసిన పోరాటాలు, త్యాగాలు ఈచిత్రంలో తీశామన్నారు. అప్పటి పరిస్థితులకు అద్దం పట్టేలా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.. ఫస్ట్‌కాపీరెడీ అయ్యిందని, నవంబర్‌లో మా చిత్రాన్ని విడుదల చేయనున్నామని తెలిపారు.

# 'తెలుగింటి సంస్కృతి' వీడియో

పెళ్లాం ఊరెళితే,,ఇంద్ర వంటి చిత్రాల ఫేమ్, నటి ప్రశాంతి హారతి కూతురు తాన్య హారతి నటించిన వీడియో ఆల్బమ్.. 'తెలుగింటి సంస్కృతి'.. మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటూ సూపర్బ్ సక్సెస్ అందుకుంది.. ఈమ్యూజిక్ వీడియోకు ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య కాన్సెప్ట్ తయారుచేసిరూపొందించారు. తెలుగింటి సంస్కృతిలో కిరణ్ గుడిపూడి మరో లీడ్‌రోల్ చేశారు..



దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు రిలీజ్ చేసిన ఈ మ్యూజిక్ వీడియో వన్ మిలియన్‌కు పైగా వ్యూస్‌తో మంచి సక్సెస్ అందుకుంది... తెలుగింటి సంస్కృతి మ్యూజిక్ వీడియో సక్సెస్ తమ టీమ్‌లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ఆడియెన్స్ నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ఆనందంగా ఉందని, మ్యూజిక్ వీడియో టీం తెలిపింది.. ఈ మ్యూజిక్ వీడియోకు రాధాకృష్ణ హారతినిర్మాతా వ్యవహరించారు.. మురళీ రుద్ర అన్వేష్ మామిళ్లపల్లి, ఆనంద్ పవన్‌నాయకుడు ఎడిటర్స్ కాగా, ఎస్ఎ ఖుద్దూస్ సంగీతం అందించారు. ఈ ఆల్బమ్‌ను ప్రముఖ నేపథ్య గాయని శ్రీనిధి ఆలపించారు.

# బన్నీ అపుడే చెప్పారు...

అల్లు అర్జున్ తాజాచిత్రం పుష్ప2 శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోందనే సంగతి తెలిసిందే.. ఈ చిత్రం కోసం ప్రేక్షకులు,అభిమానులు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. మరో విశేషం ఏంటంటే ఈచిత్రంలో జాతీయ ఉత్తమ నటి ప్రియమణి కూడ నటింబోతున్నారనే టాక్ విన్పించింది.. ఇందులో ఆమె ఓ కీలక పాత్ర పోషిస్తున్న విజయ్ సేతుపతి భార్య పాత్రలో నటిస్తున్నట్టు కూడ రూమర్లు విన్పించాయి.. కాగా తాజాగా పుష్ప2 సినిమాలో తాను నటిస్తున్నట్టు వస్తున్న టాక్‌పై ప్రియమణి స్పందించారు. తాను ఇందులో నటించటం లేదని, అవకాశం వస్తే.. కచ్చితంగా చేస్తానని పేర్కొన్నారామె. అల్లు అర్జున్‌తో ఇప్పటి వరకు నటించకపోవటం బాధగా ఉందని, అయతే ఏదో ఒక రోజు కచ్చితంగా కలిసి నటించే చాన్స్ వస్తుందని అల్లు అర్జున తనతో చెప్పారన్నారు. పుష్ప2 చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ భారీ ఎత్తున నిర్మిస్తోంది.. దేవిశ్రీ ప్రసాద్‌సంగీతం అందిస్తున్నారు.



# ఇజ్రాయెల్ సరిహద్దుల్లో హోరాహోరీ





ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ధ్వంసమైన భవనం, హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో ధ్వంసమైన ఇళ్లు

## 400 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం: ఇజ్రాయెల్ సైన్యం

### రాకెట్ల దాడిని కొనసాగించిన హమాస్ మిలిటెంట్లు

### హమాస్‌కు హిజ్బుల్లా మద్దతు, 600 దాటిన మృతులు

### ఎయిరిండియా విమానాల రద్దు

**టెల్అవీవ్, అక్టోబరు 8:** గాజాలో తలదాచుకున్న సుమారు400మంది హమాస్ ఉగ్రవాదులను మట్టు బెట్టామని, పదులసంఖ్యలో వారిని బందీలుగా పట్టుకున్నామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడిఎఫ్) ప్రకటిచింది. ఈ విషయమై ఐడిఎఫ్ అధికార ప్రతినిధి డానియేల్ హగరి మాట్లాడుతూ హమాస్ ఉగ్రవాదుల కోసం పలు పట్టణాల్లో వేట కొనసాగుతోందని చెప్పారు. ‘ఇప్పటి దాకా కిఫర్అజాలో దళాలు పోరాడుతున్నాయి. వేర్వేరు నగరాల్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అన్ని నగరాల్లో ఐడిఎఫ్ బలగాలు మోహరించాయి. ఐడిఎఫ్ లేని ఊరే లేదని’ ఓ ఇజ్రాయెల్ పత్రికలో ఆయన వ్యాఖ్యానించారు.

రేర్ అడ్మిరల్ హగరి చెప్పిన వివరాల ప్రకారం దళాలు తొలుత గాజా సరిహద్దు వెంబడి నివసిస్తున్న ప్రజలను ఖాళీ చేయిస్తున్నాయి. అక్కడ దాడులను తగ్గించి, భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. అలాగే ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దళాలకు, హమాస్ ఉగ్రవాదులకు మధ్య కిఫర్ అజాలో భకరపోరు కొనసాగుతోంది. ఈ ప్రాంతం గాజా సరిహద్దులో ఉంటుంది. దాంతో కనిపించిన ఉగ్రవాదులందరినీ మట్టుబెట్టేందుకు ఐడిఎఫ్ ప్రయత్నిస్తోంది. ఆదివారం ఉదయం ఇజ్రాయెల్ ఫైటర్ జెట్లు హమాస్ ఉగ్రవాద సంస్థ ఇంటెలిజెన్స్ చీఫ్ నివాసం సమీపంలోని సైనిక కేంద్రాలను ఢీకొట్టాయని ఐడిఎఫ్ పేర్కొంది. అందుకు సంబంధించిన ఓ విడియోను ట్విట్టర్‌లో పోస్టు చేసింది. గాజా సరిహద్దు వెంట దాడులను కొనసాగిస్తామని వెల్లడించింది.

హమాస్ శనివారం నుంచి చేస్తున్న దాడుల్లో మరణించిన వారి సంఖ్య ఆదివారం నాటికి 300 దాటింది. మరో 1864 మంది గాయపడినట్లు తెలిసింది. గాజాలో అనేకమంది ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా పట్టుకున్నారని ఓ ఇజ్రాయెల్ పత్రిక పేర్కొన్నది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇప్పటికే హమాస్‌ను గట్టిగా హెచ్చరించారు. ఐడిఎఫ్ మొత్తం శక్తి సామర్థ్యాలను వినియోగించి దాడులను అణచివేస్తామని ఆయన తాజాగా ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ‘హమాస్ దళాలు ఈ ఉదయం ఇజ్రాయెల్ భూభాగాన్ని ఆక్రమించాయి. సెలవుదినం, షబ్బత్ రోజున అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్నారు. మృతుల్లో పిల్లలు, వృద్ధులు ఉన్నారు. హమాస్ క్రూరమైన, దుష్ట యుద్ధాన్ని మొదలుపెట్టింది. ఈ యుద్ధంలో విజయం మాదే. ఇది



మనందరికీ చాలా కష్టమైర రోజు’ అని పోస్టు పెట్టారు. ఇజ్రాయెల్ పౌరులందరినీ హమాస్ హత్య చేయాలని చూస్తోందని నెతన్యాహు ధ్వజమెత్తారు. అది పిల్లలు, తల్లులు మంచాలపై నిద్రిస్తుండగానే వారిని హతమార్చిన శత్రువని అన్నారు. అంతేకాకుండా చిన్నారులు, యువతులు, బాలికలను హమాస్ అపహరిస్తోందని ఆరోపించారు. సరదాగా సెలవుల్ని గడిపేందుకు వెళ్లిన పిల్లలను,పౌరులను కొట్టి మరీ చంపుతున్నారని చెప్పారు. శనివారం ఇజ్రాయెల్‌లో జరిగిన ఘటనలు మరోసారిజరగకుండా చూసుకుంటానని ఆయన చెప్పారు.

**హమాస్‌కు హిజ్బుల్లా మద్దతు.. ఇజ్రాయెల్‌లోన 600 పెరిగిన మృతుల సంఖ్య:** ఇజ్రాయెల్-పాలస్తీనా సంక్షోభం నేటికి రెండో రోజుకు చేరింది. శనివారం హమాస్ ఇస్లామిక్ గ్రూప్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ భూభాగంపై భారీగా రాకెట్ దాడులు చేపట్టడం తెలిసిందే. హమాస్ ప్రయోగించిన చాలా రాకెట్లు ఐరన్ డోమ్ వ్యవస్థను ఛేదించుకుని ఇజ్రాయెల్ భూభాగంపై విధ్వంసం సృష్టించాయి. దానికితోడు హమాస్ ఉగ్రవాదులు పారా గ్లైడర్ల సాయంతో ఇజ్రాయెల్ గడ్డపై దిగి విచక్షణ రహితంగా కాల్పులు జరిపి నరమేధం సృష్టించారు. చాలామంది ఇజ్రాయెల్ పౌరులను హమాస్ ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్నారు. హమాస్ మారణకాండలో మృతి చెందిన వారిసంఖ్య 600కి పెరిగినట్లు ఇజ్రాయెల్ మీడియా సంస్థలను ఉటంకిస్తూ అంతర్జాతీయ న్యూస్ ఏజెన్సీ రాయిటర్స్ పేర్కొంది. తాజాగా, ఈ సంక్షోభంలో కీలక పరిణామం చోటుచేసుకుంది.హమాస్‌కు లెబనాన్ మిలిటెంట్ గ్రూప్ హిజ్బుల్లా బహిరంగంగా మద్దతు ప్రకిటించింది.‘ మా చరిత్ర, మా తుపాకులు, మా రాకెట్లు.. మాకు సంబంధించిన ప్రతిదీ ఇక మీతోనే’ అంటూ హిజ్బులా సీనియర్ ప్రముఖుడు హాషీమ్ సఫిద్దీన్ పేర్కొన్నారు. పాలస్తీనా యోధులకు సంఘీభావం ప్రకటిస్తున్నట్టు తెలిపారు.

**వారంరోజులపాటు ఎయిర్ ఇండియా విమానాలు రద్దు**


ఇజ్రాయెల్‌లో యుద్ధ పరిస్థితుల నెలకొన్న నేపథ్యంలో.. భారత్ నుంచి అక్కడికి రాకపోకలు సాగించే విమానాలను వారంపాటు రద్దు చేసినట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది.‘ ప్రయాణికులు, సిబ్బంది భద్రత దృష్ట్యా టెల్ అవీవ్‌కు రాకపోకలు సాగించే ఎయిర్ ఇండియా విమానాలను ఈ నెల 14 వరకు నిలిపే స్తున్నాం’ అని సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ తేదీల్లో టికెట్ కన్‌ఫర్మ్అయిన ప్రయాణికులకు అన్ని విధాలా తోడ్పాటునందిస్తామని పేర్కొంది. శనివారం సైతం టెల్‌అవీవ్‌కు రాకపోకలు సాగించే విమానాలను ఎయిర్ ఇండియా రద్దుచేసింది.ఇదిలాఉండగా హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై మెరుపుదాడులకు పాల్పడిన విషయం తెలిసిందే.ఈ దాడులనుంచి తిరిగి తేరుకుని ఇజ్రాయెల్.. పాలస్తీనాలోని గాజాపై వైమానిక దాడులకు దిగింది.

**ఈజిప్టులో ఇజ్రాయెల్ యాత్రికులపై కాల్పులు..ముగ్గురు మృతి:** ఇజ్రాయెల్ దళాలకు హమాస్ ఉగ్రవాదులకు భీకరపోరు కొనసాగుతోంది. రెండువైపులా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఈజిప్టులోని ఇజ్రాయెల్ యాత్రికులపై కాల్పులు జరిగాయి. మధ్యధరా సమీపంలోని అలెగ్జాండ్రియా నగరంలో ఆదివారం జరిగిన ఈ ఘటనలో ముగ్గురు అసువులు బాసారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం అలెగ్జాండ్రియా నగరంలో ఉన్న ఓ పర్యాటక కేంద్రంలో స్థానిక పోలీసు ఒకరు టూరిస్టులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇజ్రాయెల్‌కు చెందిన ఇద్దరు పౌరులు, ఈజిప్టు వ్యక్తి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఈజిప్టు మీడియాకు వెల్లడించింది. అంతేకాకుండా, పాంపీస్ పిల్లర్‌సైట్ వద్ద జరిగిన మరొక దాడిలో ఓవ్యక్తి గాయపడినట్లు తెలుస్తోంది. దాడి జరిగిన ప్రాంతాన్ని వెంటనే భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. ఈ ఘటనలో ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## బిజెపి పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎందుకు చేపట్టడం లేదు

### కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** కులగణనపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ మౌనం వహిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. అంతేకాకుండా బిజెపి పాలిత రాష్ట్రాల్లో కులగణనను ఎందుకు చేపట్టడంలేదని ప్రశ్నించింది. కుల గణనను నిర్వహించేందుకు కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ పార్టీ ఈ విధంగా స్పందించింది. భారత్ జోడో యాత్ర సమయంలో రాజస్థాన్‌లో అనేక వర్గాల ప్రజలతో రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ఆసందర్భంగా కుల గణనను అక్కడి బిసి సంఘాలు ప్రధానంగా ప్రస్తావించాయి. వారి మాటలను రాహుల్ గాంధీ పరిగణనలోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే స్థానిక ప్రజల మనోభావాలకు అనుగుణంగా కులగణనను చేపట్టాలని రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది స్వాగతించాల్సిన విషయం అని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ జైరాంరమేశ్ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలతోపాటు ఒబిసిలకోసం విధానాలను రూపొందించేందుకు ఇది దోహదపడుతుందన్న జైరాంరమేష్ సామాజిక న్యాయం,జనాభా ప్రాతిపదికన వారికి హక్కులు కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. అయితే ఇటువంటి చర్యలను బిజెపి పాలిత ప్రభుత్వాలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. ప్రధానమంత్రి కూడా కులగణనపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని జైరాం రమేష్ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. విపక్షాల కూటమి ఇండియా కూడా దీన్నే ప్రధాన ఎజెండాగా తీసుకుని ముందుకు వెళుతోంది. కులగణన చేపట్టి వాటి వివరాలను వెల్లడించడంలో బీహార్ ముందు వరుసలో నిలిచింది. తాజాగా ఆ వైపు అడుగులు వేస్తోన్న రాజస్థాన్ కులగణన చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసింది.



## మణిపూర్‌లో మంత్రి ఇంటిపై బాంబుదాడి, ఇద్దరు జవాన్లకు తీవ్రగాయాలు

**ఇంఫాల్, అక్టోబర్ 8:** బిజెపి పాలిత మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు ఇంకా కొనసాగుతున్నాయి.తాజాగా ఆ రాష్ట్రమంత్రి ఇంటిబయట బాంబు పేలింది. ఈ సంఘటనలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ జవాన్, ఒక మహిళ గాయపడ్డారు. రాజధాని ఇంఫాల్‌లో ఈ సంఘటన జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు.బిజెపి ఎమ్మెల్యే, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ నివాసం వెలుపల గేటు వద్ద గ్రెనేడ్ వంటి బాంబు విసిరాడు. అది పేలడంతో అక్కడ సెక్యూరిటీగా ఉన్న సిఆర్‌పిఎఫ్‌జవాన్, స్థానిక మహిళ గాయపడ్డారు.కాగా, ఈ పేలుడు గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని సమీ క్షిం చారు. మంత్రి ఇంటిబయట పేలుడు నేపథ్యంలో భద్రతను మరింత పెంచారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకుంటామని పోలీస్ అధికారి తెలిపారు.



రాకెట్ నమూనాలతో షార్ వారి ప్రదర్శన

## రాకెట్ నమూనాలతో ఆకట్టుకున్న ఇస్రో ప్రదర్శనలు

### ముగిసిన అంతరిక్ష వారోత్సవాలు

**శ్రీహరికోట (తడ), అక్టోబర్ 8 ప్రభాతవార్త:** ప్రపంచ అంతరిక్ష వారోత్స వాలు 2023 ఆదివారం పలుచోట్ల కన్నులపండువగా కొనసాగాయి. సెలవు రోజు కావడంతో షార్ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమాలను భారీఎత్తున రూపొందించారు. ఈ నెల 4నుంచి జరుగుతున్న కార్యక్రమాలు ఆదివారం సాయంత్రానికి పలు చోట్ల ముగింపు దశకు చేరుకున్నాయి. ఏపీలోని విశాఖపట్నం, రాజమండ్రి, కర్నూలుతో పాటు తమిళనాడులోని తిరుచ్చిరాపల్లిలో ఆదివారం ముగింపు కార్యక్రమాల సందర్భంగా ఇస్రో ఇప్పటిదాకా ప్రయోగించిన రాకెట్ల నమూనాలతో ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా చోట్ల ఇస్రోపై నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు పంచిపెట్టారు. దూరప్రాంతాల్లో జరిగిన ప్రపంచ అంతరిక్ష వారోత్స వాలలో పాల్గొన్న శాస్త్రవేత్తలు మళ్లీ తిరిగి షార్‌ను చేరుకుంటున్నారు. శ్రీహరికోటకు సమీపంలోని సూళ్లూరుపేట పట్టణంలో షార్ ఉద్యోగులు నివాసం ఉండే కాలనీల వారు పెద్దసంఖ్యలో పాల్గొని ఆదివారం ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లలో, వివిధ భారీ వాహనాలలో రాకెట్ నమూనాలు స్థానికులను కూడా ఆకట్టుకున్నాయి. సోమవారం శ్రీహరికోటలో మరోసారి అంతరిక్ష పరిశోధనశాలలను తిలకించే అవకాశం కల్పించారు. మంగళవారం ముగింపురోజు ఆర్‌హెచ్ 200 రాకెట్ ప్రయోగంతో పాటు ముగింపు ఉత్స వాలు షార్‌లో ఘనంగా ఏర్పాటు చేశారు.

# హైదరాబాద్‌లో నకిలీ ‘ఐఫోన్’ల జోరు!

## సెల్‌ఫోన్ దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు, పెద్ద సంఖ్యలో ఐ ఫోన్లు, ఇతర సామాగ్రి జప్తు



టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పట్టుబడ్డ నకిలీ ఐ ఫోన్లు, ఇతర సామాగ్రి

**హైదరాబాద్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో నకిలీ వస్తువుల అమ్మకాలు ఆగడం లేదు. ఇప్పటికే ఆహార వస్తువులు మొదలుకుని సిగరెట్ల వరకు నకిలీ ఉత్పత్తులు పట్టుబడగా తాజాగా ఈ జాబితాలో ఏకంగా సెల్‌ఫోన్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఐ ఫోన్ కంపెని పేరిట నకిలీ ఫోన్లు కూడా చేరిపోయాయి. నగరంలోని అబిడ్స్, హిమాయత్‌నగర్‌లో గల నాలుగు సెల్‌ఫోన్ దుకాణాలలో నకిలీ ఐ ఫోన్లు అమ్ముతున్న వైనంపై రంగంలో దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు దీని బండారం రట్టు చేశారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు పెద్ద సంఖ్యలో నకిలీ ఐ ఫోన్లు, ఇంకొన్ని ఉపకరణాలను జప్తుచేశారు. దీనికి సం బంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు ఆదివారం మీడియాకు వెల్లడించారు. అబిడ్స్‌లోని జగదీష్ మార్కెట్‌లో గల జై రాజేశ్వర్ మొబైల్ దుకాణం, న్యూ కలెక్షన్ టార్గెట్ మొబైల్ దుకాణం, టెలికం మొబైల్ దుకాణం, హిమాయత్ నగర్‌లోని ట్రినిటి మొబైల్ దుకాణంలో నకిలీ ఐ ఫోన్లతో పాటు వాటికి సంబంధించి న ఉపకరణాలను నకిలీవి అమ్ముతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ ఫిర్యాదు ఆధారంగా శనివారం సాయంత్రం ఈ నాలుగు దుకాణాలపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ నేతృత్వంలోని పోలీసు బృందంతో పాటు అబిడ్స్, దోమల్‌గూడ పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా జై రా జేశ్వర్ మొబైల్ దుకాణం యజమాని భరత్ రాం (40) (ఇతనుండేది గౌలిగూడ కాగా స్వస్థలం రాజస్తాన్), న్యూ కలెక్షన్ టార్గెట్ మొబైల్ దుకాణం యజమాని పదం సి ంగ్ (25) (ఇతనుండేది ఆగాపురా కాగా ఇతని స్వస్థలం రాజస్తాన్), టెలికం మొబైల్ దుకాణం యజమాని విసారాం పురోహిత్ అలియాస్ విశాల్ (28) (ఇతనుండేది సుల్తాన్‌బజార్, స్వస్థలం రాజస్తాన్), ట్రినిటి మొబైల్ దుకాణంలో సేల్స్‌మెన్‌గా వున్న శివ వరప్రసాద్ (21) (ఇతనుండేది మోండా మార్కెట్)లను అరెస్టు చేశారు. ఈ స ందర్భంగా నాలుగు మొబైల్ దుకాణాలలో 63 నకిలీ ఐ ఫోన్లతో పాటు పెద్ద సంఖ్యలో ఇతర ఉపకరణాలను జప్తు చేశారు. ఈ ఉపకరణాలన్నీ నకిలీవి కాగా ఇవన్నీ ఐ ఫోన్ కంపెనీకి చెందినవిగా తెలిపే విధంగా వాటి పై స్టిక్కర్లు అంటించారు. నకిలీ ఐ ఫోన్లు అమ్ముతూ దొరికిపోయిన వారిలో అబిడ్స్ పరిధిలో పట్టుబడ్డ భరత్ రాం, పదం సింగ్, విసారం పురోహిత్‌లతో పాటు ఇక్కడ లభించిన నకిలీ వస్తువులను అబిడ్స్ పోలీసులకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించగా శివ వరప్రసాద్‌ను అతని దుకాణంలో లభించిన నకిలీ వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం దోమల్‌గూడ పోలీసులకు అప్పగించారు.



## అఫ్ఘానిస్థాన్ భూకంపంలో 2000కు పెరిగిన మృతుల సంఖ్య

**కాబూల్, అక్టోబర్8:** అఫ్ఘానిస్థాన్ వరుస భూకంపాల్లో మృతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. భూకంపధాటికి ఇప్పటివరకు రెండువేల మందికిపైగా మరణించారు. 400 మందికి పైగా గాయపడ్డారు. హేరాట్ నగరంలో కేవలం గంట వ్యవధిలోనే వరుసగా ఏడు భూకంపాలు సంభవించాయి. పశ్చిమ అఫ్ఘాన్‌లో 6.3 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపం కారణంగా పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి.వందలాది భవనాలు నేలమట్టమయ్యాయి. భవనాలు కూలిపోవడంతో శిథిలాల కిందనలిగిపోయి ఇప్పటివరకు రెండువేల మందికి పైగా దుర్మరణం చెందారు. 402 మంది గాయపడ్డారు. కాగా, హేరాట్ నగరానికి వాయవ్య మూల 40కిలోమీటర్ల దూరంలో భూకంపకేంద్రం ఉన్నట్లు అమెరికా జియాలాజికల్ సర్వే వెల్లడించింది.కాగా,అఫ్ఘాన్‌లో తరచూ ఏర్పడే భూకంపాల కారణంగా తీవ్ర ప్రాణ,ఆస్తి నష్టం ఏర్పడుతుంది. గత ఏడాది జనవరిలో ఏర్పడిన భారీ భూకంపం వల్ల వెయ్యిమంది మృతి చెందగా వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## సరైన మార్గంలో దూసుకు వెళ్తున్న ‘ఆదిత్య’

### లాంగ్రేజియన్ పాయింట్‌కు చేరడానికి ప్రయాణం

**బెంగళూరు, అక్టోబర్8:** ఆదిత్య ఎల్1 మిషన్ భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఆదివారం కీలక అప్‌డేట్‌ను అందించింది. అంతరిక్ష నౌక సక్రమంగానే పనిచేస్తుందని, సూర్యుడివైపు దూసుకుపోతుందని పేర్కొంది. అయితే సరైన మార్గంలో ఆదిత్య ఎల్1ని ఉంచేందుకు కీలకమైన ఆపరేషన్ నిర్వహించినట్లు పేర్కొంది. అయితే సరైన మార్గంలో ఆదిత్య ఎల్ 1ని ఉంచేందుకు కీలకమైన ఆపరేషన్ నిర్వహించినట్లు పేర్కొంది. స్పేస్‌క్రాఫ్ట్‌లోని ఇంజిన్లను 16 సెకన్లపాటు మండించి ట్రాజెక్టరీ కరెక్షన్ మ్యాన్‌యూవర్‌ను నిర్వహించినట్లు పేర్కొంది. ఈ నెల 6న దిద్దుబాటు కార్యక్రమం జరిగిందని, ఈ ప్రక్రియలో స్వల్ప మార్పులు చేసినట్లు పేర్కొంది. ఇలాంటి కరెక్షన్‌ను ఇస్రో చేపట్టడం ఇదే తొలిసారి సెప్టెంబర్ 19న చివరిసారిగా ట్రాన్స్ లాగ్రాంజియన్ పాయింట్ 1 ఇన్స ర్షన్ మాన్యువర్‌ను పూర్తిచేసిన తర్వాత దాని ట్రాక్‌ను సరిచేయడానికి ఇది అవసరమని ఇస్రో పేర్కొంది. ట్రాన్స్ లాగ్రాంజియన్ పాయింట్ చుట్టూ హాలో ఆర్బిట్ చొప్పించాల్సి వచ్చినట్లు ఇస్రో చెప్పింది. ట్రాజెక్టరీ కరెక్షన్ చేయడంతో ఆదిత్య ఎల్ 1 అంతరిక్ష వాహకనౌక ఉద్దేశించిన మార్గంలో సాగుతోందనే విషయం నిర్ధారణకు వస్తుందని పేర్కొన్నారు. ఇంకొన్ని రోజుల్లో మాగ్నెటో మీటర్ మళ్లీ ఆన్ చేయనున్నట్లు వివరించింది.

ఇదిలా ఉండగా ఆదిత్య ఎల్1 మిషన్‌ను సెప్టెంబర్ 2న ఇస్రో చేపట్టిన విషయం తెలిసిందే. పిఎస్ఎల్‌సి 57 లాంచ్ వెహికిల్ నుంచి ఆదిత్య ఎల్ 1ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఎపిలోని శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగం నిర్వహించింది. ఆ తర్వాత కక్ష్యను మార్చుకుంటూ సూర్యుడివైపు బయలుదేరింది. దాదాపు 120 రోజులపాటు ప్రయాణించి లాగ్రేంజియన్ పాయింట్‌కు చేరుకోనున్నది. ఇది భూమికి 1.5 మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడ నుంచి సూర్యుడిపై అధ్యయనం చేయనున్నది. సౌరగాలులు, సౌరతుఫాన్లతో పాటు నక్షత్రాల అధ్యయనంలోనూ సహాయం అందించనున్నది. నక్షత్రాలు, గెలాక్సీ, ఖగోళ శాస్త్రానికి సంబంధించి అనేక రహస్యాలను అర్థం చేసుకోవడం సహాయపడనున్నది.



## దేశంలో కరోనా తాజా కేసులు-43

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,అక్టోబర్8:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది.గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 43 కేసులు నమోద య్యాయి. మృతి నమోదు కాలేదు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,49,99,328కు చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,44,66,925 మంది కోలుకోగా 369మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,32,034కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.82 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.18 శాతంగా ఉంది. మహా రాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,71,707కి చేరగా,80,23,040 మంది వరకు కోలుకున్నారు.1,48,561 మంది ప్రాణాలు కోల్పోయారు.కేరళలో కరోనా పాజిటీవ్ కేసులసంఖ్య 69,07,335కి చేరింది.అందులో 68,35,259 మంది కోలుకున్నారు.72,043మంది మరణించారు.

## అమెరికా నిధులతోనే ఇజ్రాయెల్‌పై దాడి!: బైడెన్‌పై ట్రంప్ తీవ్ర ఆరోపణలు



**వాషింగ్టన్, అక్టోబర్8:** ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పరోక్షంగా కారణమని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. అమెరికా ప్రజలు చెల్లించిన పన్నులతోనే ఈ దాడులకు నిధులు అందడం అవమానకరమని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు బాధాకరం. బలమైన శక్తితో దాడులను తిప్పికొట్టే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది. అమెరికా ప్రజలు చెల్లించిన పన్నులతో ఈ దాడులకు నిధులు అందడం అవమానకరం. బైడెన్ యంత్రాంగం నుంచి బయటికి వచ్చిన పలు నివేదికలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి అని ట్రంప్ ఆరోపించారు. అంతకుముందు రిపబ్లికన్ పార్టీ బైడెన్ యంత్రాంగంపై తీవ్ర ఆరోపణలుచేసింది. ఇరాన్‌కు అమెరికా గత నెలలో ఆరు బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం అందించిందని, ఆ నిధులతోనే హమాస్‌కు ఇరాన్ ఆయుధాలు సరఫరా చేసిందని ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ ఆండ్రూ బేట్స్ ఖండించారు. ఇరుపక్షాలు ఐక్యంగా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వాల్సిన సమయంలో ఇలాంటి ఆరోపణలు చేయడం బాధాకరం. అమెరికా ఇచ్చిన నిధులు ఆహారం, ఔషధాలు వంటి అవసరాల కోసం మాత్రమే ఉపయోగిస్తారు అని ఆండ్రూ బేట్స్ స్పష్టం చేశారు. మరోవైపు హమాస్ ఉగ్రవాదులు వందమంది ఇజ్రాయెల్ పౌరులు, సైనికులను అపహరించినట్లు టెల్‌అవీవ్ తెలిపింది. హమాస్‌కు లెబనాన్‌లోని మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. అయితే ఈ దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు ఇజ్రాయెల్ దళాలు తెలిపాయి.

# పట్టు సడలని రీలే నిరాహార దీక్షలు

## అరగుండుతో భాస్కర్ల నిరసన



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అమలాపురం టౌన్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకుడు అరగుండు గీయించుకోవడం సంచలనం సృష్టించింది. అమలాపురం పట్టణంలో 'మేము సైతం బాబు కోసం' రీలే నిరాహార దీక్షల్లో భాగంగా 26వ రోజు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, పెచెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసగా పట్టణ టిడిపి కార్యదర్శి భాస్కర్ల రామ కృష్ణ అరగుండు చేయించుకుని నిరసన తెలిపారు. అనంతరం సైకో ప్రభుత్వం పోవాలి.. సైకిల్ ప్రభుత్వం రావాలని చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులు కొట్టి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ సోంబాబు, టౌన్ అధ్యక్షులు తిక్కరెడ్డి నేతాజీ, జిల్లా తెలుగు రైతు మహిళా అధ్యక్షురాలు పెచెట్టి విజయలక్ష్మి, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బడుగు సత్యనారాయణ, రాజులపూడి భీముడు, మాక్కిరెడ్డి పూర్ణిమ, దీక్షలలో కూర్చున్న మాజీ ఎంపిపి యేరుబండి వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి రాము, దెంతులూరి వాసురాజు, నడింపల్లి ఉదయబాబు, మంద గెద్దయ్య, గెదా డ సత్యవాణి, క్లస్టర్ ఇంచార్జ్‌లు చొల్లంగి సాయిబాబు, అధికారి జయ వెంకటలక్ష్మి, బాబ్జి, మాజీ ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, కైరం రాము, పొలమూరి ధర్మాపాల్, బత్తుల సాయి, ఈతకోట నాగేశ్వరరావు, గోలకోటి చిన్న, నామడి తారక్, పరమాట రామ్ ప్రసాద్, నడింపల్లి అర్జున్ వర్మ, పిచ్చుక శ్యామ్, సెనగన మల్లేశ్వరరావు, మండలీక సుబ్రహ్మణ్య శర్మ, నంద్యాల దొరబాబు, వాకాపల్లి నాయుడు, బండారు వెంకన్న, బిఎస్ఎన్ మూర్తి, మట్టా సాయి రామారావు, రంకిరెడ్డి బుజ్జి, కుడిపూడి వెంకటేశ్వరరావు, మొటూరి బాలాజీ, ఆకుల సత్తిబాబు, మామిళ్ళపల్లి సుబ్బరాజు, కోడూరి రామ్మూర్తి, పాలగుమ్మి శ్రీను, సిరగం మాధవరావు, కుడిపూడి ఏడుకొండలు, బైరిశెట్టి సాయిబాబు, గోకరకొండ తాతాలు , ఉప్పు వెంకన్న, బండి సర్వేశ్వరరావు, కేతా శ్రీను, ఉందుర్తి జీవరత్నం, తిఉమనదం మురళీ, మండేలా బుజ్జి, దంగేటి వెంకటేశ్వరరావు, నందేపు సత్యానందరావు, చింతా శ్రీనివాసరావు, సరేళ్ళ అంబేడ్కర్, మంద దుర్గారావు, నంద్యాల సూరి ప్రకాష్, కటికిదల పండు, కాట్రు శ్రీను, మండల నాయకులు, కార్యకర్తలు , తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పొలం కబ్జా నేరంపై ఒకరి అరెస్ట్

## రిమాండ్‌కు ఆదేశించిన కోర్టు

**జగ్గయ్యపేట, అక్టోబర్ 8, ప్రభాతవార్త :** ఒక దళిత కుటుంబానికి చెందిన పొలాన్ని ఆక్రమించి రైతును బెదిరించిన నేరంపై పోలీసులు కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశారు. కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం జడ్జి రిమాండ్‌కు ఆదేశించటంతో జగ్గయ్యపేట సబ్‌జైలుకు నిందితుడిని పోలీసులు తరలించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని తిరుమలగిరి గ్రామ పరిధిలో ఈసంఘటన జరిగింది. బాధితుడు కరిసే చైతన్య రాజ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో చిల్లకల్లు పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాల్లోకి వెళితే జగ్గయ్యపేటలో సాయంకాలం దిన పత్రిక నిర్వహిస్తున్న ఎం సైదేశ్వరరావు అన్యాయంగా తన పొలాన్ని ఆయన పొలంలో కలుపుకున్నట్లు బాధితుడు చైతన్య రాజ్‌కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్ లో ఒక చిన్న కంపెనీలో పనిచేస్తున్న చైతన్య రాజ్‌కుమార్‌కు తన గ్రామమైన తిరుమలగిరిలో 1.82 ఎకరాల పొలం ఉంది. ఈపొలం పక్కన గల పొలాన్ని 2022లో నిందితుడు సైదేశ్వరరావు కొనుగోలుచేశాడు. పక్కనగల చైతన్యరాజ్‌కుమార్ పొలాన్ని తనకు అమ్మాలని ఒత్తిడిచేయటం, బెదిరించటం మొదలుపెట్టాడు. చివరికి పొలాన్ని సైదేశ్వరరావుకు అమ్మేందుకు అంగీకరించిన చైతన్య రాజ్‌కుమార్‌కు రూ.18 లక్షలకు బేరం కుదుర్చుకుని అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు చెల్లించేట్లు ఒప్పందం చేసుకున్నారు. దశల వారీగా అడ్వాన్స్ చెల్లించిన సైదేశ్వరరావు అనంతరం రిజిస్టర్ చేయించుకోకుండానే తన ఎకరం పొలంలో మామిడి మొక్కలు నాటించాడని, ఇదేమని ప్రశ్నిస్తే బెదిరించాడని, అడ్వాన్స్‌గా ఇచ్చిన నగదు, ఇస్తే అగ్రిమెంట్ పత్రం ఇస్తానని అనటంతో చైతన్య రాజ్‌కుమార్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌టిజిఎస్ ద్వారా నగదు చెల్లించినట్లు పేర్కొన్నారు. పొలాన్ని ఆక్రమించి తనను బెదిరిస్తున్నాడని, కుటుంబాన్ని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాడని, నీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోపో అంటూండటంతో దిక్కుతోచక పోలీసులు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేసు నమోదుచేసిన చిల్లకల్లు పోలీ సులు శనివారం నిందితుడిని అరెస్ట్‌చేసి నందిగామ కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి 14 రోజులపాటు రిమాండ్ విధించటంతో పోలీసులు జగ్గయ్యపేట సబ్‌జైలుకు తరలించారు. చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

# రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు



ఆలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి కరికాల వల్లవన్

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త:** నెల రోజులుగా జనం లేక వెల వెల బోయిన శివయ్య సన్నిధి రెండు రోజులుగా జనంతో కళ కళ లాడుతుంది. ఆదివారం రాహుకేతుదోష నివారణ పూజలు ఓ మోస్తరుగా జరిగాయి. గత వారం రోజులుగా ఆలయం వెల వెల బోయింది. వారం రోజులుగా రాహుకేతుదోష నివారణ పూజలు 1500 దాట లేదు. ఆదివారం భక్తులు కదలి వచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజల్లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కరికాల వల్లవన్ కుటుంబసభ్యులతో కలసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన వస్తుంది. ఈనేపథ్యంలో శనివారం ఆలయంలో రూ.500ల టిక్కెట్లు కొనుగోలు చేసిన వారిసంఖ్య 2508 ఉంది, కాగా రూ.750ల టిక్కెట్లుకొనుగోలు చేసి పూజలుచేసుకున్న వారి సంఖ్య 837 రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారి సంఖ్య 196, రూ.2500 టిక్కెట్లతోపూజలు చేసుకున్న వారు 226, రూ.5000ల టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు 63మంది పూజలు చేయించుకున్నారు. కాగా అభిషేకాలు కూడా గణనీయంగా జరిగినట్లు అధికారులుప్రకటించారు. అభిషేకాలు 76 జరుగగా సాయంత్రం నిర్వహించే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 18 ఇక శనీశ్వరాభిషేకాలు 1 జరిగాయి. ప్రసాదాలు సుమారు 20వేలు అమ్మకాలు జరిగాయి.

# సామాజిక సమస్యలకు పరిష్కారంతో పాటు, నడుస్తున్న చరిత్రకు గొంతుకగా నిలవాలి

## ప్రేరణ' సమీక్షా వ్యాసగ్రంధ ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు

**విజయవాడ,అక్టోబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక సమస్యలకు పరిష్కారంతో పాటు,నడుస్తున్న చరిత్రకు గొంతుకగా నిలిచే దిశలో కవిత్వంతో పాటు అన్ని సాహిత్య ప్రక్రియలు నిలవాలని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు.ఆదివారం విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో ప్రఖ్యాత కవి కొమ్మవరపు విల్సన్‌రావు రచించిన "దేవుడు తప్పిపోయాడు" కవితా సంపుటిపై వచ్చిన సాహిత్య విమర్శలు,విశ్లేషణలు,సమీక్షలు,వ్యాసాల సంపుటిగా రూపొందించిన "ప్రేరణ" పుస్తకాన్ని సాహితీ విమర్శకులు గుంటూరు లక్ష్మీనర్సయ్య ఆవిష్కరించారు.సభకు సుప్రసిద్ధ రచయిత డాక్టర్ ఎం,ప్రభాకర్ అధ్యక్షత వహించారు,సభలో పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రారంభోపన్యాసం చేస్తూ, దేవుడు తప్పిపోయాడు తెలుగుసాహిత్యలో అద్భుతమైన కవితా ప్రయోగమన్నారు.సాహిత్య అకాడమీ అవార్డు రాకున్న అనేక అవార్డులు అందుకున్న ఈ పుస్తకంపై వంద వరకు సమీక్షలు,విశ్లేషణలు రావడం వాటన్నింటి 350కిపైగా పేజీలతో పుస్తకం తేవడం అద్భుతమన్నారు.పుస్తక ప్రచురణలో కీలక పాత్ర వహించిన కలిమిశ్రీ ప్రేరణ" ప్రపంచ రికార్డుల్లో నమోద కాగా తగిన గ్రంధమన్నారు. విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి



కృష్ణ మాట్లాడుతూ కవిత్వాన్ని కొమ్మవరపు తన అక్షరాల్లో మండించిన తీరు జాగృత దిశగా ఉందన్నారు.ప్రేరణ తెలుగుసాహిత్యంలో మంచి ప్రయోగమని ప్రపంచ తెలుగు రచయిత(త్రు)ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంగరాజు వెంకట పూర్ణచంద్రరావు వ్యాఖ్యానించారు.ప్రేరణ పుస్తకాన్ని సభాపూర్వకంగా కొమ్మవరం తన శ్రీమతి కొమ్మవరపు రాజమణికి అంకితమిచ్చారు,తొలి పత్రిని విశ్రాంత విద్యాశాఖాధికారి కంచర్ల చిరంజీవి సుధాకర్‌కు అందజేసారు.సభలో సీనియర్ జర్నలిస్టు అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడారు. పుస్తకంలో కీలక వ్యాసాలు రాసిన మందరపు హైమవతి, అనిల్‌డ్యాని, ఘంటా విజయకుమార ,విష్ణుబొట్ల రామకృష్ణ, కెవిరమణమూర్తు,వైష్ణవిలను సత్కరించారు.ఈ కార్యక్రమాన్ని రాఘువేంద్రశేఖర్ నిర్వహించారు.

# నడిపూడి కాలువలో మొసలి

## ఇరిగేషన్, అటవీ శాఖ అధికారుల గాలింపు చర్యలు

## అప్రమత్తంగా ఉండాలంటూ ప్రకటన



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, రూరల్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** సముద్రం, గోదావరి నదుల్లో సంచరించే మొసళ్లు ఇప్పుడు ప్రధాన పంట కాలువల్లోకి వచ్చేస్తున్నాయి. ప్రస్తుత్తం అమలాపురం రూరల్ మండలం నడిపూడి ప్రధాన పంట కాలువలో మొసలి సంచరిస్తుంది. ఈ మొసలి జాడలను స్థానికులు గుర్తించారు. శనివారంరాత్రి నడిపూడి లాకు సమీపంలో మొసలి తిరుగుతున్నట్లు స్థానికులు పసిగట్టారు. కాలువలో భారీగా శబ్దం రావడంతో మొసలి జాడ వారికి కనిపించింది. మరల ఆదివారం మధ్యాహ్నం నల్లవంతెన సమీపం అక్కిలేరు వద్ద మొసలి బయటికి రావడంతో అక్కడే ఉన్న యువకులు గుర్తించారు. నోరు చరుస్తూ పైకి లేచినట్లుగా వారు గమనించారు. అది కూడా చాలా పెద్ద మొసలిగా కనిపిస్తున్నట్లు ఆ యువకులు చూశారు. అయితే ఈ విషయం దావనంలా వ్యాపించడంతో కాలువ పరిసర ప్రాంతాల్లో ఉండే ప్రజలు హడలెత్తిపోతున్నారు. పెద్దవారు ఎలా ఉన్నా చిన్న పిల్లలు కాలువ వద్దకు వెళితే ఏ ప్రమాదం ముంచుకోస్తుందోనన్న భయం పిల్లల తల్లిదండ్రులను వెంటాడుతోంది. పశువులకు నీరు పెట్టడం,వాటిని శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు కాలువలోనే చేసే రైతులు ఇప్పుడు కాలువ చెంతకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. అధికారులు మాత్రం అప్రమత్తంగా ఉండాలంటూ ప్రకటన విడుదల చేశారు. మొసలిని పట్టుకునేందుకు ఇరిగేషన్, అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాయుడు తెలిపారు. ఇదిలా ఉంటే పంట కాలువలో తిరిగే మొసలిని పట్టుకోవడంలో ఇరిగేషన్, అటవీశాఖ అధికారులకు ముందుచూపు కొరవడినట్లుగా కనిపిస్తోంది. ఈ మొసలి జాడ తెలిపి రెండు రోజులు అయినప్పటికీ పూర్తి స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారంటూ ప్రజలు ఆరోపణాస్త్రాలు గుప్పిస్తున్నారు. సముద్రం, గోదావరిలో అయితే నీటికి అడ్డుకట్ట వేయడం కష్టం. కానీ కాలువలోని నీటికి అడ్డుకట్ట వేయడం ఇరిగేషన్ శాఖ అధికారులు అతి సులువుగా చెప్పవచ్చు. అయితే అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం మానేశారు.

మొసలి కనిపించి రెండు రోజులు గుడు స్తున్న పైపైనే గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రధాన పంట కాలువకు నీరు వచ్చే ధవళేశ్వరం వద్ద గేట్లు మూసేస్తే నీటి ప్రవాహం తగ్గుతుంది. అనంతరం మొసలి సంచరించే ప్రాంతంలో ఉన్న నడిపూడి లాకు, సమనస లాకు మూసివేస్తే నీరు ఎటు ప్రవహించదు. దాంతో మొసలికి అక్కడ నుండి ఎటు వెళ్లటానికి అవకాశం దొరకదు. గాలింపు చర్యలు చేపట్టే ఇరిగేషన్, అటవీశాఖ అధికారులు ఈజీగా మొసలిని గుర్తుపట్టవచ్చు. అంతేకాకుండా నడిపూడి నుండి సమనస లాకులు వరకు గల కాలువలోని నీటిని ఇంజన్ల సహాయంతో బయటకు తోడేస్తే మొసలి జాడ మరింత ఈజీ అవుతుంది. ఆ దిశగా గాలింపు చర్యలు చేపట్టాలంటూ పలువురు కోరుతున్నారు.

# ఇస్రో ఉద్యోగాల్లో ప్రవేశం కోసం కెరీర్ గైడెన్స్ ఉండాలి

## పాఠ్యాంశాల్లో అంతరిక్ష విజ్ఞానం చేర్చాలి: జెసి తేజ్ భరత్

## ఘనంగా ముగిసిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో,అక్టోబర్ 8, ప్రభాతవార్త:** ఇస్రోలో ఉద్యోగాల్లో చేరడానికి అనువుగా కేరీర్ గైడెన్స్ రూపొందించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానం గురించి విస్తృతంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అభిప్రాయ పడ్డారు. ఆ దిశగా ఇస్రో కృషి చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిసాయి. ముగింపు సభకు గౌరవ అతిథిగా విచ్చేసిన జెసి తేజ్ భరత్ మాట్లాడుతూ ఈ ఆధునిక కాలంలో సౌకర్యవంతమైన జీవనం సాగిస్తున్నామంటే అందుకు ఇస్రో పరిశోధనలు, ప్రయోగాలు కారణమని పేర్కొన్నారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్,టీవీ, జాతీయ విపత్తుల గురించి ముందుగా తెలుసుకోవడం వంటివన్నీ ఇస్రో పరిశోధనల ఫలితమేనని ఆయన వివరించారు. అంతరిక్షంలో అగ్రగామిగా ఉంటేనే భవిష్యత్తులో సూపర్ పవర్‌గా ఎదగవచ్చని జేసీ తేజ్ భరత్ అన్నారు. అందుకే చైనా, రష్యా, అమెరికా దేశాలతో ఇస్రో పోటీ పడుతోందన్నారు. రాజమండ్రిలో అంతరిక్ష వారోత్సవాలు విజయవంతం చేయడంలో కృషిచేసిన అందరికీ ఆయన అభినందనలు తెలిపారు.జిల్లా ఎస్పి పి.జగదీస్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని, చంద్రయాన్, ఆదిత్య ఎల్ 1 వంటి ప్రయోగాలతో ఇస్రో అద్భుత విజయాలను నమోదు చేసిందని తెలిపారు. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను రాజమండ్రిలో నిర్వహించి స్కూల్ విద్యార్థులను ఆహ్వానించి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. వేలాది మంది ఇక్కడకు వచ్చి తిలకించిన నేపథ్యంలో ఇందులో ఒక శాతమైన ఇస్రో శాస్త్రవేత్తలుగా వెళ్లాలని ఆయన ఆకాంక్షిస్తూ, విక్రమ్ సారాబాయి, సతీష్‌దావన్, యుఆర్‌రావు వంటి మేటి శాస్త్రవేత్తలుగా మన విద్యార్థులు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

**అంతరిక్ష విజ్ఞానం భవిష్యత్ తరాలకు చేరువ చేయడమే లక్ష్యం: డిడి సునీల్:** శ్రీహరికోట షార్ డిప్యూటీ డైరెక్టర్ పి.సునీల్ మాట్లాడుతూ గడిచిన 60 ఏళ్లలో ఎన్నో ప్రయోగాలు చేసి విజయాలను నమోదు చేస్తున్న ఇస్రో భవిష్యత్తులో హ్యూమన్ మిషన్, గగన్ యాన్, చంద్రయాన్ 4, 5, 6 వంటివి ప్రయోగించాల్సి ఉందని, అందుకే భవిష్యత్తు తరాలకు అంతరిక్ష విజ్ఞానాన్ని చేరువ చేస్తున్నామన్నారు. అక్టోబర్ 4 నుంచి 10 వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రతీ ఏటా ఒక అంశంతో నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ ఏడాది "స్పేస్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్" పేరిట నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఆత్మ నిర్భర్ భారత్ పేరిట సొంతంగా ప్రయోగాలు చేస్తున్న ఇస్రో 2047 నాటికి సాధించాల్సిన విజయాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ సిహెచ్ కృష్ణ మాట్లాడుతూ ఇస్రో సాధిస్తున్న విజయాలను వివరిస్తూ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు నమోదు చేసుకోవాలన్నారు. శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్, ఉత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఎన్.విజయకుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ ఈ మూడు రోజుల్లో దాదాపు 25వేల మందికి పైగా విద్యార్థులు సందర్శించారని చెప్పారు. స్పేస్ వాక్ మెదలుకుని ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అతిథులను ఇస్రో సత్కరించి , జ్ఞాపికలు అందజేశారు. అలాగే ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను కూడా సత్కరించారు. రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్ టికె విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ మిగిలిన చోట్ల ఇంజనీరింగ్ కాలేజీల్లో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తే దేశంలోనే మొదటిసారిగా ప్రజల మధ్య రాజమండ్రిలో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించడం అవి పూర్తి స్థాయిలో విజయవంతం కావడం ఆనందదాయకమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలను ఇతర ఆర్గనైజింగ్ కమిటీ పక్షాన అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. డిప్యూటీ డీఈఓ నారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్‌కుమార్, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత బాలా త్రిపుర సుందరి, అక్షర శ్రీ స్కూల్ డైరెక్టర్ టి.నాగరత్నం, ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోషియేషన్ నాయకులు పురెడ్ల కళ్యాణ్‌రెడ్డి, రవిచంద్ర, ఏ రమేష్, పి.సురేష్, పి.శివాజీ, ప్రగతి, మురళి, జస్వర్ స్కూల్ రమేష్, పి.గంగాధరరావు, డివి స్వామిరెడ్డి, ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షులు మండెల శ్రీరామమూర్తి, అధ్యక్షులు కె. పార్ధసారథి, తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితర ప్రముఖులు ఉదయం నుంచి వేలాది మంది విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. కళాకేంద్రం లోపల స్క్రీన్‌మీద చంద్రయాన్ తయారీ, ప్రయోగం విజయవంతం దృశ్యాలు అలాగే అంతరిక్ష వారోత్సవాల టీజర్, 5వ తేదీ నుంచి నిర్వహించిన కార్యక్రమాల వీడి యో ప్రదర్శించారు. చివరి రోజున కూడా విద్యా ర్థులకు ప్రశ్నలు వేసి, సమాధానాలు ఇచ్చిన వారికి అక్కడికక్కడేబహుమతులు అందించారు. ముగింపు సందర్భంగా అతిథులు, ఆర్గనైజింగ్ కమి టీ, ఇస్రో శాస్త్రవేత్తలు గ్రూప్‌ఫోటో దిగి, జనగణ మనతో కార్యక్రమానికి ముగింపు పలికారు.

# అనుమతులు లభించాయి: యుద్ధ ప్రాతిపదికపై పనులు జరిపించండి

## ఇంజినీరింగ్ అధికారులకు దేవస్థానం చైర్మెన్ సూచన

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 8 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా రూ.7 కోట్లతో చేపట్టిన ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలకు చుట్టుముట్టిన అవరోధాలు తొలగాయి. సాంకేతిక సమస్యలు సమసిపోయాయి. దేవాదాయశాఖ నుంచి కావాల్సిన అనుమతులు లభించాయి.అయితే శ్రీకాళహస్తీశ్వరాలయ ఇంజనీరింగ్ అధికారులు రేయింబవళ్లు నిర్మాణ పనులు చేయించి వైకుంఠ ఏకాదశి నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేయుటకు కృషి చేయాలని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆదివారం ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఆదివారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలసి పునర్నిర్మాణం జరుగుతున్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పరిసరాలను పరిశీలిలించారు. ఇప్పటికే స్థపతి మూడుసార్లు పరిశీలించారు. ఇక్కడ అవసరమైన అనుమతులను మంజూరు చేసారు.

**అవరోధాలు తొలగాయి:** శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన దేవాదాయశాఖ వద్ద ఉన్న అవరోధాలు తొలగాయని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆదివారం పత్రికల వారికి వివరించారు.మొదట రూ.4కోట్లతో అంచనాలు తయారు చేసి అనుమతి పొందామన్నారు.కానీ స్థపతి పరిశీలించిన తరువాత ఆలయాన్ని పూర్తి తొలగించి పునర్నిర్మాణం చేపట్టాల్సి ఉందని సూచించటంతో ఈ మేరకు రూ.5.9కోట్లతో రూపొందించి దేవాదాయశాఖ అనుమతి కోసం నిరీక్షించామన్నారు. పలుమార్లు స్థపతి పరిశీలించిన తరువాత కొత్త అంచనాలకు అనుమతించారన్నారు. అలాగే మొదట నాలుగు లేయర్లకే అనుమతించారని కానీ ఆలయాన్ని 15లేయర్లుగా నిర్మించాల్సి ఉందని స్తపతి దృష్టికి తీసుకురాగా ఆయన అనుమతించారని వివరించారు. ఆలయ నిర్మాణంలో చోటు చేసుకున్న ఇబ్బందులు తొలగాయన్నారు.సాంకేతిక కారణాలతో ఇప్పటి వరకు పనులు నత్తనడకన నడిచాయని ఇక అన్ని అనుమతులు లభించాయి కాబట్టి యుద్ధ ప్రాతిపదికపై రేయింబవళ్ళు పనులు చేయించాలని కోరారు.ఇప్పటికి 5లేయర్ల పనులు పూర్తి అయ్యాయని మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికపై చేపట్టాలని ఇంజనీర్లను కాంట్రాక్టర్‌ను కోరారు. పనులు మంజూరు చేయించటంలో శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డి ఎంతో చొరవ చూపారని ఆయనే దేవాదాయశాఖ అధికారుల వద్దకు పరుగులు తీసి అనుమతులు సాధించారన్నారు. ఆలయ నిర్మాణానికి రాతిని కుప్పం నుంచి తెప్పిస్తున్నట్లు వివరించారు.దానిని స్కిట్ ఆవరణలో నిల్వ చేసిపనుల్లో జాప్యం లేకుండా చేయాలన్నారు.



ప్రసన్న వవరదదరాజస్వామి ఆలయ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

**రానున్న వైకుంఠ ఏకాదశికి సిద్ధం కావాలి:** ఈ సందర్భంగా చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న వైకుంఠ ఏకాదశికి ఆలయ నిర్మాణం పూర్తి చేసి వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు భకక్తుల మనోభావాలకు అనుగుణంగా పనులు చేయాలన్నారు.కాంట్రాక్టర్, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఆలయ నిర్మాణానికి సంబంధించి స్తపతి కుమార్ ఇక్కడే తిష్టవేసి కాంట్రాక్టర్, కార్మికులను సమన్వయం చేయాలని సూచించారు.ఈ పరిశీలనల్లోఇంజనీరింగ్ శాఖకు చెందిన డిఇఇ శ్రీనివాసులురెడ్డి,కిషోర్‌కుమార్,స్తపతి కుమార్ కాంట్రాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, యువశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కక్షపూరిత రాజకీయాలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

## ప్రతిపక్షాలను లేకుండా చేయాలని ప్రభుత్వం కుట్ర

## చంద్రబాబుపై అక్రమ కేసు ఆ కుట్రలో భాగమే

## ఫోరమ్ ఫర్ డెమోక్రసీ అండ్ డెవలప్‌మెంట్ ఆన్‌లైన్ చర్చాగోష్టిలో వక్తలు వెల్లడి

**అమరావతి, అక్టోబర్ 8, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలను లేకుండా చేసేలా కుట్ర చేస్తోందని, అందుకే ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని యూనివర్సిటీల ప్రొఫెసర్లు పేర్కొన్నారు.. ఫోరమ్ ఫర్ డెమోక్రసీ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌లో కుట్రపూరిత దిగజారుడు రాజకీయాలు' అంశంపై ఆదివారం ఆన్‌లైన్‌లో చర్చాగోష్టి నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలు యూనివర్సిటీలప్రొఫెసర్లు తమఅభిప్రాయాలనువ్యక్తం చేశారు..

**గతంలో బీహార్ మాఫియా,'సీమ' ఫ్యాక్షనిజం విన్నాం..కానీ ఇపుడు..: -వై.నరసింహారావు, ఆచార్య నాగార్జున వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్:** ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతోపాటు ప్రతిపక్షం కూడ ముఖ్యమే అన్నారు.. అంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులను బలహీన పరిచే రాజకీయ కుట్ర చేస్తోంది. గతంలోబీహార్ మాఫియా గ్యాంగ్, రాయలసీమ ఫ్యాక్షనిజం గురించి విన్నామని, నేడు అదే రీతిలో వైకాపా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.. తమ తప్పుల్ని ప్రశ్నించకూడదు అన్న రీతిలో వ్యవహరిస్తోందన్నారు.. ప్రశ్నించిన విలేకరులపై , ప్రజలపై దాడులు చేయటం, అక్రమ కేసులు పెట్టటం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఇలా అయితే ప్రజాస్వామ్య మనుగడ పరిస్థితి ఏంటని, ప్రజలు ఆలోచించాలన్నారు. రాజకీయ కుట్రలో భాగంగానే మాజీ సిఎం చంద్రబాబును మానసికంగా కృంగదీయాలని ఎలాంటి ఆధారాలు లేని కేసులో అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారన్నారు.

**అక్రమ కేసులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదు: -నరసింహులు, రాయలసీమ వర్సిటీ మాజీ విసి**

యువతలో నైపుణ్యం పెంపొందించటానికే చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తీసుకొచ్చారు. దీని ద్వారా 2.13 లక్షల మందికి శిక్షణ ఇచ్చారు.చంద్రబాబు గొప్ప విజన్ ఉన్న నేత. అక్రమ కేసులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

**అపసవ్యపు రాజకీయ సంస్కృతి: -ప్రొఫెసర్ కె.చిన్నయసూరి, గీతం యూనివర్సిటీ:**

భారతదేశంలో కొంతకాలంగా పార్టీలకు అతీతంగా అపసవ్యపు రాజకీయ సంస్కృతి పెరుగుతోంది.. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ మూలస్తంభాలు..అధికారంలో ఉన్న పార్టీ పౌరుల మీడియాల స్వేచ్ఛను హరిస్తోంది.. ప్రతిపక్షాలపై దాడులు, అక్రమ కేసులుతో కోలుకోలేని విధంగా చేయటం దిగజారుడు రాజకీయాలు..ఇది ప్రపంచ వ్యాప్తంగా బలపడుతున్న రుగ్మత.. ఇది ఎపిలో కూడ గతకొంత కాలం నుంచి కన్పిస్తోంది.

**యువత, విద్యార్థుల్లో చైతన్యం కోసం యాక్షన్ రూపొందించాలి: -ప్రొఫెసర్ హరిబాబు, సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్:**

ప్రస్తుత రాజకీయాల్లో కులం, మతం పేరుతో ఓటు బ్యాంకు తయారు చేసుకుంటున్నారు.దీనిపై ప్రజల్ని చైతన్యవంతం చేయాలి. విద్యార్థులు, యువత వాళ్ల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై కూడ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారు.. విద్యార్థి, యువతలోచైతన్యం రావాల్సినఅవసరం ఉంది.. అందుకోసం యాక్షన్ ప్లాన్ రూపొందించాలి.

**ప్రభుత్వాలు మారినపుడల్లా పాలసీలు మారితే పరిస్థితి ఏంటి:**

**-డాక్టర్ ఐ.సందీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సెంట్రల్ యూనివర్సిటీ, కర్ణాటక:** ఎన్నికల ముందు కావాలనే స్కిల్‌డెవలప్‌మెంట్ కేసును తెరపైకి తెచ్చారు.. స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారాం ఏంచేశారో ఎంతమందికి శిక్షణ ఇచ్చారో అన్నీ కళ్లముందు కన్పిస్తున్నాయి... ఒక ప్రభుత్వం చేసిన పాలసీల్లో మరో ప్రభుత్వం తప్పులు వెతికితే, పాలసీలు చేయగలమా?. ప్రభుత్వాలు మారినపుడల్లా పాలసీలు మారితే పరిస్థితి ఏంటి?. అమరావతి రాజధాని, పెట్టుబడులు వంటి అంశాల్లో ఈ వైఖరి చూశాం.. సిమెన్స్ ప్రాజెక్టు ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యవహరిస్తే.. మరోకంపెనీ ఇలాంటి కార్యక్రమాలు చేయటానికి ముందుకొస్తుందా? ఇందులో కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.. ఇలా అయితే రాష్ట్రయువత భవిత పరిస్థితి ఏంటి? దీనిపై ఇంకా చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

ఈ ఆన్‌లైన్ చర్చాగోష్టిలోఇంకా పలువురు మాట్లాడుతూ, కొంత మంది అధికారులు తప్పుడు నివేదికలతో కోర్టుల్ని సైతం తప్పుదారి పట్టిస్తున్నారని ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబును జైలులో నిర్బంధించటం ఆక్షేపణీయమని పేర్కొన్నారు. ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కల్గించటమే అన్నారు. దీని వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలు నమ్మకం కోల్పోయే పరిస్థితి దాపురించనుందని అన్నారు. రాష్ట్రంలో జరగుతున్న పరిణామాలపై ఫోరమ్‌ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గవర్నర్‌కు, రాష్ట్రపతికి ఫిర్యాదలు చేయాలని అన్నారు.

# చీప్‌లిక్కర్ కుంభకోణంలో రూ.41 వేలకోట్ల దోపిడి

### మద్యం షాపుల్లో నో డిజిటల్ కరెన్సీ ఇస్తేనే మద్యం, రశీదు కూడా ఇవ్వరు
### అక్రమ సంపాదన కోసం నాసిరకం మద్యం విక్రయాలు
### పేదల ప్రాణాలతో సర్కారు ఆటలు
### మీడియా సమావేశంలో మాజీ మంత్రి 'సోమిరెడ్డి' ఫైర్



**అమరావతి, అక్టోబర్ 8, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో నాసిరకం మద్యం అమ్మకాలతోజగన్‌రెడ్డి ప్రజల ప్రాణాలను తీస్తున్నారని మాజీ మంత్రి సోమిరెడ్డిచంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రతి ఇంటికి వెళ్లి నేనే మీ ఆరోగ్యాన్ని కాపాడతానని డబ్బా కొట్టుకుంటున్నారని అన్నారు. ఇంప్లిమెంట్ చేస్తే మాకు ఏం అభ్యంతరం లేదని, వైద్యం అందక ఆశా వర్కర్ ఒక అమ్మాయి మృతిచెందిందని అన్నారు.. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటలకు జగనే సురక్ష అని ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణ శూన్యం అన్నారు వైఎస్సార్ పెట్టిన ఆరోగ్యశ్రీకే దిక్కులేదని అన్నారు.. నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో, కిమ్స్ రెండు ఆసుపత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ కేసులు తీసుకోవటం లేదన్నారు. జగనన్న వచ్చాక వద్దు.. మేం తీసుకోం అని అంటున్నారని అన్నారు. విత్‌డ్రా చేసుకున్నారని తెలిపారు. జగన్ చెప్పేదానికి చేసే దానికి సంబంధం లేదన్నారు.. అనేక ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పేషంట్లను వెనక్కి పంపిస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు ప్రజల ఆరోగ్యం పణంగా పెట్టి దాదాపు వేల కోట్లు దోపిడీ జరుగుతోందని అన్నారు. డిజిటల్ ట్రాన్‌సాక్షన్స్ లేవని, ఆంధ్రప్రదేశ్‌లో కరెన్సీ నోట్లు ఇస్తే తప్ప మద్యం ఇవ్వరని అన్నారు. మద్యం షాపుల్లో రసీదులు ఇవ్వరన్నారు..

**అక్రమార్జన కోసం ప్రజల ప్రాణాలు తీస్తారా?:** అక్రమ సంపాదన కోసం నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తారా అంటూ నిలదీశారు. మద్యనిషేధం అంటూ సొల్లు కబుర్లు చెప్పి నేడు నాసిరకం మద్యంతో మహిళల తాళిబొట్లు తెంచుతున్నారని అన్నారు. జగన్ అధికారంలోక రాగానే నేషనల్ , ఇంటర్నేషనల్ మద్యం బ్రాండ్లు రద్దుచేసి, తన బినామీలు, వైకాపా నేతలకు చెందిన డిస్టిలరీల్లో తయారైన నాసిరకం మద్యం విక్రయించి వేల కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. నాలుగున్నరేళ్లలోమద్యంపైనే రూ.92 వేల కోట్లు పిండారని, ఇది మందుబాబుల రక్తమాంసంతో తడిసిన డబ్బులే అని అన్నారు.. ఈ నాసిరకం మద్యం తాగిన వారి నాడీ వ్యవస్థ దెబ్బతిని తల తిరగటం, శరీరం మొతనతం మెలికలు తిరగటం, వాంతులు, మానసిక గందరగోళానికి గురయ్యే విషరసాయనాలు ఉన్నట్టు చెన్నైలోని ఎస్‌జిఎస్ ల్యాబ్ పరీక్షల్లో వెల్లడైందన్నారు. జగన్ ప్రభుత్వం అమ్మే కల్తీ మద్యం, నాటుసారా తాగి పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో వారం రోజుల వ్యవధిలోనే 26 మంది మృతిచెందారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాదిమంది ప్రాణాలు విడిచారన్నారు. ఒక్క విశాఖ కేజీహెచ్‌లోనే ఏడాదిలో36 మంది చనిపోయారని అన్నారు.

**బాధితులు ఎక్కువ రోజువారీ కూలీలే:** బాధితుల్లో అత్యధిక శాతం బడుగు, బలహీనవర్గాల పేదలే అన్నారు.. వీరు రోజువారీ కూలీలుగా పనిచేస్తూ తమకొచ్చే ఆదాయంలో సగానికి పైగా మద్యంపైనే వెచ్చిస్తున్నారని, దీంతో వారి ఒల్లు గుల్లవుతోందని అన్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ, మంచానికి పరిమితమైపోయి అంతకుముందులా ఏ పనీ చేసుకోలేకపోతున్నారని అన్నారు.

బెల్టుషాపులు లేకుండా చేసినతెదేపా ప్రభుత్వం: టిడిపి ప్రభుత్వం బెల్ట్ షాపులను లేకుండా చేసిందని, అనేక మందిపై ఎక్సైజ్ డిపార్టుమెంట్ కేసులు పెట్టి బెల్ట్‌షాపులను నిరోధించిందని అన్నారు.. ఇప్పటి పరిస్థితులకు, అప్పటి పరిస్థితులకు బేరీజువేసుకోవాలన్నారు. రూ.150 మద్యం సీసా రూ.250కి అమ్ముతున్నారని అన్నారు. మద్యం, సారాయి దొరకని, బెల్ట్‌షాపులు లేని పది గ్రామాలు చూపించగలరా? అంటూ తాను చాలెంజ్ చేస్తున్నానని సోమిరెడ్డి సవాల్ విసిరారు.

# ఫైబర్‌గ్రిడ్ ఆరోపణలపై ఇదే మా ఛాలెంజ్

### వైఎస్సార్సీ నేతలు సమాధానం చెప్పగలరా?
### ఒక్కరూపాయి అవినీతి జరగలేదు-రాజకీయ కక్షతోనే తప్పుడు ఆరోపణలు
### ఎపి టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



ఆదివారం ఎపి ఫైబర్‌నెట్ ప్రాజెక్టు వాస్తవాలు..పుస్తకాన్ని విడుదల చేసిన అచ్చెన్నాయుడు, టిడిపి నేతలు

**అమరావతి, అక్టోబర్ 8, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ఫైబర్ నెట్ ప్రాజెక్టులో ఒక రూపాయి కూడ అవినీతి జరగలేదని, కానీ రాజకీయ కక్షతోనే వైకాపా నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎపి టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం ఫైబర్‌నెట్‌పై ఖర్చు రూ.280కోట్లు, ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.900కోట్లు నిజం అవినీతి అబద్ధం' పేరుతో పుస్తకాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడారు. ఫైబర్ నెట్‌పై ఆరోపణలు సిగ్గుమాలిన చర్య అన్నారు. ప్రజలకు మేలు చేసిన ప్రాజెక్టుపై నిందలు వేయటం రాజకీయ కుట్రకాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు నెలకు రూ.149కే ఇంటికి ఇంటర్నెట్, ఫోన్, టివి ఛానళ్ల సౌకర్యం కల్పించామన్నారు. ఎపి ఫైబర్ నెట్ విధానాన్ని అనుసరించాలని ఇతర రాష్ట్రాలకు సైతం కేంద్ర సూచించిందని, ఫైబర్ గ్రిడ్‌పై చేసిన ఖర్చు ఆధారాలతోసహా కళ్లముందే కనపడుతుంటే వైకాపా నేతలు సిగ్గులేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇది జగన్‌రెడ్డి ముఠా చేసే రాజకీయ కుట్ర కాక మరేంటని అన్నారు. చంద్రబాబు నాయుడు సభలకు వస్తున్న ప్రజా స్పందన చూసి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిస్తే తనకు శ్రీలంకలో జరిగిన పరిస్థితి తప్పదని భావించే అరెస్టు చేసి ఇన్నిరోజులైనా పైసా కూడ అవినీతి జరిగినట్టు నిరూపించలేకపోయారని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి జరగలేదని, ఆ విషయం జగన్‌తోపాటు అందరికీ తెలుసు అన్నారు.. నాలుగున్నరేళ్ల పాలనలో జగన్ అన్ని రంగాలను భ్రష్టుపట్టించారని, అభివృద్ధి లేదన్నారు.. పరిశ్రమలు పెట్టుబడులు రావటం లేదన్నారు..యువతకు ఉపాధి లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.. సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలి, వైకాపా పాలనలో అన్ని వర్గాలు నష్టపోయాయని అచ్చెన్నాయుడు అన్నారు.

పార్టీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఫైబర్ నెట్‌లో ఒక్కరూపాయి కూడ అవినీతి జరగలేదన్నారు. అవినీతి జరిగిందంటే వైకాపా ప్రభుత్వం నిరూపించాలని సవాల్ చేస్తున్నామన్నారు. ఇంటర్నెట్ ద్వారా టెక్నాలజీని గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించాలనే ఫైబర్‌నెట్ ప్రాజెక్టును నాడు తీసుకొచ్చామని అన్నారు. ఐఎఎస్ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ వేసి సాధ్యా,అసాధ్యాలను పరిశీలించే ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టుపై ముందడుగు వేశామన్నారు. పల్లెల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు నాడు చంద్రబాబు నాయుడు ఫైబర్‌నెట్‌ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్నారు. ఫైబర్ నెట్ అండర్ గ్రౌండ్ కేబుల్స్ కోసం రూ.5వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారని, అండర్ గ్రౌండ్ కేబుల్స్‌కు అంత ఖర్చువద్దని కరెంట్ పోల్స్‌ను వినియోగించుకుని ఫైబర్‌గ్రిడ్‌ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రూ.5వేల కోట్ల ఖర్చును రూ.330 కోట్లకు చంద్రబాబు తగ్గించారన్నారు.చివరకు రూ.328 కోట్లకే టెండర్ ఖరారుచేశారన్నారు. ఇందులో ఎలాంటి అవినీతి జరగలేదని, కేవలం రాజకీయ కక్ష, దురాలోచనతోనే అక్రమ కేసులు మోపుతున్నారని ధ్వజమెత్తారు. టెండర్ అప్రూవ్ చేసిన అధికారి ఏమయ్యారు.. మోనిటరింగ్ చేసిన అధికారి ఏమయ్యారు, సంతకం పెట్టనటువంటి చంద్రబాబు తప్పు కనపడుతుందా? అని అన్నారు. బ్లాక్ లిస్టు చేసిన టెరాసాఫ్ట్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చామని వైకాపా అంటోందని, టెండర్ పిలిచే సమయానికి టెరాసాఫ్ట్ బ్లాక్‌లిస్టులోఉందా? అని ప్రశ్నించారు. ఫైబర్‌నెట్ ఖర్చు రూ.280 కోట్లు ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.900 కోట్లు. ఆదాయం నిజం-అవినీతి అబద్ధం అని అన్నారు.. ఫైబ ర్‌గ్రిడ్ ప్రాజెక్టులో ఒక్కరూపాయి అవినీతి జరగలేదని, ఛాలెంజ్ చేసి చెబుతున్నామ న్నారు. దీనికి వైకాపా నేతలు సమాధానం చెప్పాలని పయ్యావుల డిమాండ్ చేశారు.

# లాడ్జిలో వ్యభిచారం.. వెబ్‌సైట్ ద్వారా సెక్స్‌వర్కర్ల సరఫరా

### • గుట్టురట్టు చేసిన టాస్క్‌ఫోర్స్

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో వ్యభిచార గృహాల నిర్వాహకులు తెలివిమీరారు. ఇప్పటి వరకు చాటుమాటుగా కొనసాగిన ఈ గోల్‌మా ల్ వ్యాపారాన్ని ప్రస్తుతం ఓపెన్ మార్కెట్‌గా మార్చడంతో పాటు విటులను ఆకర్షించేందుకు ఏకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించి అంతా ఆన్‌లైన్ సర్వీస్ చేయసాగారు. ఇం దుకు గానూ నాంపల్లిలో ఓ లాడ్జిలో రెండు గదులు అద్దెకు తీసుకుని ఈ దందాను సాగిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచే సి వ్యభిచార కూపం నిర్వాహకుడితో పాటు ఒక విటుడు మరో ఇద్దరు మహిళా సహాయకులను అరెస్టు చేశారు. ఇదే సమయంలో ఇద్దరు సెక్స్ వర్కర్లను కాపాడి హోం కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు ఆదివారం మీడియాకు వెల్లడించారు. నాంపల్లిలోని నీలోఫర్ ఆసుపత్రి వద్ద గల హోటల్ మెరీడియన్ ఆర్చిడ్‌లో కొంతకాలంగా వ్యభిచారం కొనసాగుతోంది. ఈ హోటల్‌లో రెండు గదుల్లో ఈ బాగోతం జరుగుతోంది. కుత్బుల్లాపూర్‌లోని సలావుద్దీన్ ఖాన్ (29) అనే వ్యక్తి ఇక్కడ వ్యభిచార గృహాన్ని నిర్వహించసాగాడు.

తన దందా బాగా సాగేందుకు ఇతగాడు ఏకంగా ఎనీ టైం కార్ల్ గర్ల్స్ కం పేరిట ఓ వెబ్‌సైట్‌ను నిర్వహించసాగాడు. ఇందులో తనతో పరిచయం అయ్యే వారికి ఒక రాత్రికి మూడు వేల రూపాయల నుంచి నాలుగు వేల రూపాయల వరకు డబ్బులు తీసుకుని సెక్స్ వర్కర్లను పంపించే వాడు. కాగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ నేతృత్వంలోని పోలీసు బృందం శనివారం రాత్రి దాడి చేసింది.

ఈ సందర్భంగా సలావుద్దీన్‌తో పాటు ఇర్ఫాన్ (25) అనే విటుడు (ఇతను మలక్‌పేట్ వాసి)లు వారికి సహాయంగా వున్న ఇద్దరు మహిళలు దొరికిపోయారు. ఇదే సమయంలో ఇద్దరు సెక్స్ వర్కర్లు పట్టుబడగా వారిని హోంకు తరలించారు. ఈ సందర్భంగా కండోంలతో పాటు 2200 రూపాయల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం లభించగా వాటిని జప్తు చేశారు. పట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం నాంపల్లి పోలీసులకు అప్పగించారు.



అగ్ని కీలల్లో చిక్కుకున్న ఆర్టీసి బస్సు

# కోరుట్ల ఆర్టీసి డిపోలో అగ్నిప్రమాదం

### ఆహుతైన బస్సు
### మూడు లక్షల విలువైన ఫర్నీచర్ దగ్ధం

**కోరుట్ల, ప్రభాతవార్త:** కోరుట్ల ఆర్టీసీ డిపోలో రాజధాని బస్సులో షాట్ సర్క్యూట్ కారణంతో మంటలు రాజుకొని ఆర్టీసీ బస్సు పూర్తిగా దగ్ధమైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. డిపో మేనేజర్ విజయమాధురి వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి కోరుట్లకు వచ్చిన రాజధాని (ఏసీ) టీఎస్ 21జెడ్ 0074నెంబర్ గల ఆర్టీసీ బస్సు డిపోకు చేరుకుంది. ఆ బస్సును డిజిల్ ట్యాంక్ వద్ద నిలిపి హైండ్‌బ్రేక్ వేశారు. దీంతో డ్రైవర్ సమీపంలో ఒక్క సారిగా షాట్ సర్క్యూట్ జరిగి బస్సులో వేగంగా పెద్ద ఎత్తున మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో అలర్ట్ అయిన లీడింగ్ హెడ్ బాల నర్సయ్య బస్సు హైండ్ బ్రేక్ తీసి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా తన చేతులకు గాయాలయ్యాయి. మరో ఆర్టీసీ బస్సుతో ఆ బస్సును బంక్ ప్రాంతం నుండి ముందుకు కదిలించే ప్రయత్నం చేసినప్పటికీ బస్సు కదలలేకపోయింది. దీంతో డిపో సిబ్బంది మంటలు ఆరే ్ప ప్రయత్నం చేసినప్పటికీ మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చామన్నారు. ఫైరింజన్ వచ్చేలోపు బస్సుతో పాటూ డిజిల్ బంక్ వద్ద ఉన్న మిషన్‌తో పాటూ ఫర్నీచర్ అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు 55లక్షల విలువ గల బస్సుతో పాటూ 3లక్షల ఫర్నీచర్ ధ్వంసం అయినట్లు మేనేజర్ వివరించారు.

**నిర్లక్ష్యం వహించిన ఫైర్ సిబ్బంది?**

ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ బస్సు అగ్ని ప్రమాదానికి గురైందని ఫైర్ సిబ ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందించిన సుమారు 30నిమిషాల నుండి 45నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి ఫైరింజన్ రావడంతో పూర్తి స్థాయి బస్సు అగ్నికి ఆహుతికాగా ఫర్నీచర్ సైతం దగ్ధం అయ్యింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ ్బంది కేవలం 10నిమిషాల లోపే మంటలను ఆర్పినప్పటికీ, 10కిలోమీటర్ల దూరంలో ఫైర్ స్టేషన్ ఉన్నా 10 కిలోమీటర్ల దూరంనుండి రావడానికి నిర్లక్ష్యంగా అరగంటకు పైగా పట్టడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

# త్వరలో రెవెన్యూ శాఖలో పదోన్నతులు

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** రెవెన్యూ శాఖలో త్వరలో జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు లభించనున్నాయి. ఇటీవలే ఆ శాఖలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న 838 మందికి డిప్యూటీ తమసీల్దార్లుగా పదోన్నతి దక్కింది. దీనికి సంబంధించి శాఖాపరమైన పదోన్నతుల కమిటీ రూపొందించిన జాబితాకు ఇటీవల భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్ ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా సౌత్ జోన్ పరిధిలో 464 మంది, ఆరోజోన్ పరిధిలో 374 మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు లభించనున్నాయి. 2017'18, నుంచి 2022'23 వరకు సంబంధించిన ప్యానెళ్లలోని వారికి పదోన్నతులు దక్కనున్నాయి. దీంతో ఖాళీ కానున్న సీనియర్ అసిస్టెంట్ల స్థానాలను త్వరలో జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీ చేయనున్నారు. ఇటీవలే నవీన్ మిత్తల్‌తో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతం కుమార్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో కంప్యూటర్ ఆపరేటర్లు, హ్యాండ్ హోల్డింగ్స్ పర్సన్స్ వేతన బిల్లులు, ఉద్యోగ క్రమబద్ధీకరణ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నేపథ్యంలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతలులు లభించగా, త్వరలోనే జూనియర్ అసిస్టెంట్లకు సైతం పదోన్నతులు లభించనున్నాయి.

**ఇటీవలే సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా డిపిసి ఆమోదం**

### ఉపాధ్యాయుల బదలీలు, పదోన్నతులు

# ఎన్నికల షెడ్యూల్ లోపే పూర్తి చేయాలి

### సిఎం కెసిఆర్‌కు లేఖ రాసిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలలతోపాటు మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుల బదలీలు, పదోన్న తులను ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే పూర్తి చేయాలని వరంగల్-ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావుకు ఆయన ఆదివారం లేఖ రాశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదలీలు, పదోన్న తులు మధ్యలోనే ఆగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల బద లీలు, పదోన్నతులను ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎంకి రాసిన లేఖలో నర్సిరెడ్డి కోరారు. ఉపాధ్యాయుల బదలీలు, పదోన్న తులపై హైకోర్టులో కేసులు ఎక్కువగా పడుతున్నాయని వాటిని నివారించడంలో పాఠశాల విద్య శాఖ విఫలం అవుతుందని సీఎంకి రాసిన లేఖలో నర్సిరెడ్డి గుర్తు చేశారు. బదలీలు పదోన్నతుల గురించి సీఎంగా 2022 మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించారని.. తరువాత 2022 ఏప్రిల్‌లో విద్యా శాఖ మంత్రి కూడా ప్రకటించారని గుర్తు చేశారు.

2023 జనవరిలో షెడ్యూల్ విడుదల చేసిన ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉంది తప్ప ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు. ఈ నేప థ్యంలో ఉపాధ్యాయుల బదలీలు, పదోన్న తుల ను ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు పూర్తి చేయా లని ఆ లేఖలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు.

# టికాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఠాక్రేతో కోదండరాం చర్చలు

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రేతో టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ.కోదండరాం వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో పొత్తులు, సీట్ల కేటాయింపుపై చర్చలు జరిపినట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన కోదండరాం ముందుగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికలలో టీజేఎస్ కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం తాజాగా హైదరాబాద్‌లో కోదండరాం ఠాక్రేతో సమావేశమై రాష్ట్రంలోని ఆరు నియోజకవర్గాలలో టీజేఎస్ బలంగా ఉన్నందున ఆ నియోజకవర్గాలను తమ పార్టీకి కేటాయించాలని కోరినట్లు సమాచారం. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించాలంటే కోదండరాం సహకారం కూడా అవసరమని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం టీజేఎస్ కేటాయించాలని కోరిన సీట్లపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు వచ్చే ఎన్నికలలో టీజేఎస్ పోటీ చేయాలని భావిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన లిస్టును ఠాక్రేకు అందజేశారు.



ఇంద్రకీలాద్రి సిబ్బందిని ఆహ్వానిస్తున్న కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఈవో

# కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకునికి పట్టువస్త్రాలు

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 8, ప్రభాతవార్త :** స్వయంభూ శ్రీ వరసిద్ధి కాణిపాక వినాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం తరపున ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు మరియు ట్రస్ట్‌బోర్డు సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మరియు శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక ఆలయ ఈవో ఎ.వెంకటేశు ఆలయ మర్యాదలతో స్వాగతించి, శ్రీ స్వామివారి దర్శనానంతరం ఇంద్రకీలాద్రి స్వాగత సిబ్బందికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులకు మరియు ఆలయాధికారులకు స్వామివారి చిత్రపటము, శేషవస్త్రము, ప్రసాదములు అందచేశారు. కార్యక్రమంలో శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య, నంబూరి రవి, దేవిశెట్టి బాలకృష్ణ, అనుమోలు ఉదయలక్ష్మి, టి.వేదకుమారి, కాణిపాకం ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, వైదిక సిబ్బంది లింగంభొట్ల దుర్గాప్రసాద్, మారుతీ యజ్ఞనారాయణ, వేదపండితులు, ఆలయార్చకులు, ఆలయ సహాయ ఈవో ఎన్.రమేష్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

**నిత్య అన్నదాన పథక విరాళం :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిత్య నిరతాన్నదాన పథకమునకు ఆదివారం గుంటూరుకు చెందిన ఒంటెద్దు చిన్న బాపిరెడ్డి, శేషరత్నం దంపతులు కుటుంబ సభ్యులతో సహా రూ.1,00,116/-లను, విజయవాడ,ఎలక్ట్రిసిటీకాలనీకిచెందిన శాఖమూరు శ్రీనివాస్ రూ.1,00,000/-లను ఆలయాదికారులకు అందచేశారు. వీరికి శ్రీ స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులుఆశీర్వచనంచేసి ప్రసాదము,శేషవస్త్రము అందచేశారు.



ఆశీర్వచన మండపంలో కేంద్రమంత్రి మీనాక్షి లేఖి

**ఆలయంలో ప్రముఖులు :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానమునకు కేంద్ర సాంస్కృతిక మరియు ఎక్స్ టర్నల్ ఎఫైర్స్ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి రాగా ఆలయా ధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు ఆశీర్వచనాలు అందచేయగా అధికారులు ప్రసాదము శేషవస్త్రము అందచేశారు.



ఆదివారం ఎంసిహెచ్‌ఆర్‌డిలో నిర్వహించిన సిటిజన్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

# కండువా మార్చినంత సులభంగా పార్టీలు మారుస్తున్నారు!

### యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది
### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్, అక్టోబర్ 8, ప్రభాతవార్త :** ప్రస్తుతం రాజకీయ నాయకులు భుజాన కండువ మార్చినంత సులభంగా పార్టీలు మారుస్తున్నారని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రాజకీయాల్లో రూ.కోట్లు లేనిదే ఓట్లు రావనే పరిస్థితి ఉందనీ, ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఇక్కడి ఎంసిహెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన సిటిజన్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఓ వ్యక్తి పార్టీ మారితే ఆ పార్టీలో ఉండగా వచ్చిన పదవికి సైతం రాజీనామా చేయాలన్నారు. ప్రస్తుత తరుణంలో యువత ఎక్కువ సంఖ్యలో రాజీకాయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాల్లోకి వచ్చేందుకు ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదనీ, అయితే, అందులో రాణించాలంటే అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. దీని ద్వారా భవిష్యత్ తరాలకు మరింతగా ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేసినప్పుడే యువత ఏ రంగంలోనైనా రాణించగలుగుతారన్నారు. సిద్ధాంతాలకు కట్టుబడి చేసే రాజకీయాల వల్ల మాత్రమే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. చట్టసభల్లో ఫలవంతమైన చర్చలు జరిగి ప్రజలకు ఉపయోగపడే చట్టాలు రూపకల్పన జరగాలన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుత రాజకీయాలలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయనీ, అయితే, ఏ మార్పు జరిగినా అది సమాజ హితం కోసం మాత్రమే పనిచేయాలని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు.

# వీర జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

### సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

**హైదరాబాద్, అక్టోబరు 8, ప్రభాతవార్త :** సిక్కింలో మరణించిన నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని కుమ్మన్‌పల్లి ప్రాంతానికి చెందిన ఆర్మీ జవాన్ ప్రసాద్ అంత్యక్రియలు ఆదివారం సైనిక లాంఛనాలతో పూర్తయ్యాయి. వీర జవాన్‌కు ఆ ప్రాంత ప్రజలు కులమతాలకు అతీతంగా తరలివచ్చి కన్నీటి నివాళి అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం వీర జవాన్ భౌతికకాయాన్ని తీసుకుని వస్తున్నారన్న సమాచారం అందడంతో గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. యువకులు త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని ఆచన్‌పల్లిలో భారీ బైక్‌ర్యాలీ చేపట్టారు.

వీర జవాన్ ప్రసాద్ అంత్యక్రియలు సైనిక లాంఛనాలతో ఆర్మీ అధికారులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ సత్యనారాయణ జవాన్ కుటుంబ సభ్యులను సందర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలతో నివాళులు అర్పించి గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు.




# ఆరంభం అదుర్స్

## వన్డే వరల్డ్‌కప్‌లో భారత్ బోణీ

### ఆరు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై భారత్ ఘనవిజయం

### ఇండియాను గెలిపించిన కోహ్లీ, కెఎల్ రాహుల్

**చెన్నై:** వన్డే ప్రపంచకప్ 2023లో టీమిండియా శుభారంభం చేసింది. వన్డే క్రికెట్‌లో మరోసారి విశ్వవిజేతగా నిలిచే లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా తొలి అడుగును బలంగా వేసింది. ఆస్ట్రేలియాతో చెన్నై వేదికగా ఆదివారం జరిగిన లోస్కోరింగ్ థ్రిల్లర్‌లో సమష్టిగా రాణించిన టీమిండియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. బౌలింగ్‌లో స్పిన్నర్లు సత్తా చాటగా బ్యాటింగ్‌లో చేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీ, క్లాస్ బ్యాటర్ కెఎల్ రాహుల్ సూపర్ బ్యాటింగ్‌తో జట్టుకు విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ 49.3 ఓవర్లలో 199 పరుగులకు కుప్పకూలింది. స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్ టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో మిచెల్ స్టార్క్ విలువైన పరుగులు జోడించాడు. భారత బౌలర్లలో రవీంద్రజడేజా మూడు వికెట్లు తీయగా కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా రెండేసి వికెట్లు తీసారు. మహమ్మద్ సిరాజ్, హార్దిక్‌పాండ్యా, రవిచంద్రన్ అశ్విన్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన భారత్ 41.2 ఓవర్లలో 4 వికెట్లకు 201 పరుగులు చేసి సునాయాసంగా విజయాన్నందుకుంది. విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ చెలరేగారు. ఆసీస్ బౌలర్లలోజోష్ హజెల్ వుడ్ మూడు వికెట్లు తీయగా మిచెల్ స్టార్క్ ఓ వికెట్ తీసాడు. 2 పరుగులు, మూడు వికెట్లు: 200 స్వల్ప లక్ష్యఛేదనకు దిగిన టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. 2 పరుగుల వ్యవధిలోనే టాప్ 3 వికెట్లు కోల్పోయింది. ఆసీస్ పేసర్ల ధాటికి ముగ్గురు బ్యాటర్లు డకౌట్‌గా వెనుదిరిగారు. మిచెల్ స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో ఓపెనర్ ఇషాన్‌కిషన్ గోల్డెన్ డక్‌గా వెనుదిరగ్గా హజెల్ వుడ్ వేసిన రెండో ఓవర్‌లో రోహిత్ శర్మ కూడా డకౌటయ్యాడు. రోహిత్ శర్మ వికెట్ల ముందు దొరికిపోయాడు. రివ్యూ తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇదే ఓవర్ చివరి బంతికి శ్రేయస్ అయ్యర్ కూడా చెత్త షాట్‌తో డకౌటయ్యాడు. ఈ పరిస్థితుల్లో కెఎల్ రాహుల్‌తో కలిసి కోహ్లీ ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఇక హజెల్ వుడ్ చేసిన 8వ ఓవర్‌లో విరాట్ కోహ్లీ ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను మిచెల్ మార్ష్ నేలపాలు చేశాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న విరాట్ కోహ్లీ జాగ్రత్తగా బ్యాటింగ్ చేశాడు. పూర్తిగా డిఫెన్స్‌కే పరిమితమైన ఈ జోడీ క్విక్ సింగిల్స్ డబుల్స్‌పైన పూర్తిగా ఫోకస్ పెట్టింది. దాంతో పవర్ ప్లేలో టీమిండియా 3 వికెట్లకు 27 పరుగులే చేసింది. అనంతరం ఆడమ్ జంపాను కమిన్స్ బరిలోకి దించగా రాహుల్ అటాకింగ్ గేమ్ ఆడాడు. వరుస బౌండరీలతో కాస్త దూకుడు కనబర్చాడు. స్వల్ప లక్ష్యం కావడంతో క్రీజులో సెట్ అయ్యేందుకు ఈ జోడీ టైమ్ తీసుకుంది. ఎలాంటి రిస్క్ లేకుండా నిదానంగా పరుగులు రాబట్టింది. ఈ క్రమంలోనే విరాట్ కోహ్లీ 75 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే కెఎల్ రాహుల్ 72 బంతుల్లో అర్ధశతకం నమోదు చేశాడు. హాఫ్ సెంచరీల అనంతరం కూడా ఈ జోడీ ఎలాంటి రిస్కీ షాట్స్ ఆడకుండా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. సెంచరీదిశగా సాగుతున్న విరాట్ కోహ్లీనీ హజెల్ వుడ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 165 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనవసర షాట్‌తో కోహ్లీ మూల్యం చెల్లించుకున్నాడు. 15 పరుగుల దూరంలో సెంచరీ చేజార్చుకున్నాడు. క్రీజులోకి హార్దిక్‌పాండ్యా రాగా రాహుల్ ధాటికి ఆడి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

---

### డివిలియర్స్ రికార్డు బద్దలు..

## 29 బంతుల్లోనే సెంచరీ

### దేశవాళీ క్రికెట్‌లో రికార్డ్ సృష్టించిన 21 యేండ్ల కుర్రాడు ఫ్రెజర్ మెక్‌గుర్క్

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్‌లో అత్యధిక పరగుల రికార్డు బద్దలై ఒక్కరోజు కాకముందే ..లిస్ట్ –ఏ క్రికెట్‌లో పెను విధ్వంసం నమోదైంది. దక్షిణాఫ్రికా దేశవాళీ టోర్నీ"ఎది మార్ష్‌కప్"లో భాగంగా 21 ఏండ్ల కుర్రాడు ఫ్రెజర్ మెక్‌గుర్క్ అరుదైన రికార్డు నమోదు చేసుకున్నాడు. కేవలం 29బంతుల్లోనే సెంచరీ చేసి లిస్ట్ ఏ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కాడు. దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న రికార్డులను ఫ్రెజర్ తిరగరాశాడు. అయితే డివిలియర్స్ అంతర్జాతీయ స్థాయిలో వెస్టిండీస్‌పై (2015)లో 31బంతుల్లోన్ల సెంచరీ చేసిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ పోటీల్లో ఇదే ఫాస్టెస్ట్ కాగా ..లిస్ట్‌ఏలో ఫ్రెజర్ నయారికార్డు నెలకొల్పాడు. టాస్మానియాతో జరిగిన పోరులో సౌత్ ఆస్ట్రేలియా తరున బరిలోకి దిగిన ఫ్రెజర్..తొలుత 18బంతుల్లో ఆఫ్‌సెంచరీ పూర్తిచేసుకున్నాడు.ఆతర్వాత చెలరేగిన ఈకుర్రాడు..మరో 11 బంతుల్లోనే మూడంకెల స్కోరు తనపేరిట లిఖించుకున్నాడు.38బంతుల్లో 125పరుగులు చేసి ఔటయ్యాడు.

## భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌లో సందడి చేసిన రవితేజ

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** టాలీవుడ్ మాస్‌మహారాజ్ రవితేజ కొత్త అవతారమెత్తాడు. ఇన్నాళ్లు డాన్సులు, ఫైట్లు యాక్టింగ్‌తో అభిమానులను అలరించిన రవితేజ.. భారత్ ఆస్ట్రేలియా మ్యాచ్‌లో సందడి చేశాడు. మ్యాచ్ జరగుతున్న సమయంలో రవితేజ ప్రత్యక్షమై ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. భారత జట్టు ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో రవితేజ కామెంట్రీ చేశాడ. ఇందుకు సంబంధించిన ఫోటోలు,వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

---







## ముగిసిన ఆసియా గేమ్స్

### 107 పతకాలతో భారత్ 4వ స్థానం

### తొలిమూడు స్థానాల్లో చైనా, జపాన్, కొరియా

### వచ్చే ఏడాది అతిథ్యం ఇవ్వనున్న జపాన్

**బీజింగ్:** చైనా వేదికగాజరిగిన ఆసియాగేమ్స్‌ను భారత్ ఘనంగా ముగించింది. ఎన్నడూ లేనివిధంగా పతకాలను కైవసం చేసుకుని సత్తా చాటింది. ఈసారి జరిగిన ఆసియా గేమ్స్‌లో ఏకంగా 107పతకాలను సాధించి మెరుగైన ప్రదర్శన ఇచ్చింది. రానున్న కాలంలో భారతతీయ క్రీడల్లోన్ల భారతీయులకు మంచి భవిష్యత్ ఉందని చెప్పడానికి ఈవి జయాలనే నిదర్శనమని చెప్పకనే చెప్పింది. అందుకే ప్రధాని మోడీ సైతం విజేతలను అభినందించారు. ప్రపంచ దేశాలోన్ల భారత్ సగర్వంగా నిలిచేలా మోదీ మెచ్చుకున్నారు. మొత్తం 107 పతకాలతో భారత్ పథకాల పట్టికలో4వ స్థానంలో నిలిచింది.28 స్వర్ణాలు, 38రజతాలు, 41 కాంస్యలతో కొత్త చరిత్ర సృష్టించింది. చైనా 198స్వర్ణాలు, 108 రజతాలు, 71 కాంస్య పతకాలతో తొలిస్థానంలో నిలవగా..జపాన్ రెండోస్థానంలో ,కొరియా మూడోస్థానంలో నిలిచాయి.ఆసియాక్రీడల్లో మొదటి ఎడిషన్ నుంచి ఇప్పటివరకు భారత్ మొత్తంగా 753 పతకాలను సాధించింది. ఇందులో 173స్వర్ణాలు, 238రజతాలు,348 కాంస్యలు ఉన్నాయి. అథ్లెటిక్స్ విభాగంలో అత్యధికంగా 254 పతకాలు రాగా, అందులో 79 గోల్డ్ మెడల్స్ ఉన్నాయి. రెజ్లింగ్ ,షూటింగ్‌లలో వరుసగా 59,58 పథకాలు భారత్ ఖాతాలోకి చేరాయి. కాగా వచ్చే ఏడాది ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వనుంది.

---

# వాణిజ్యం

# ఆర్థికమాంద్యం దిశగా అమెరికా!

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** త్వరలోనే అమెరికా తీవ్ర ఆర్థికమాంద్యంలోకి జారుకోబోతోందని ఇండియన్ టాప్ ఎకనామిస్టుల్లో ఒకరైన యాక్సిస్ బ్యాంకు చీఫ్ ఎకనామిస్ట్ నీలకంఠ్ మిశ్రా హెచ్చరించారు. ఇది ఇండియన్ జిడిపిలో ప్రధాన భాగమైన సర్వీస్ సెక్టార్‌పై తీవ్ర ప్రభావాన్ని



చూపుతుందని ఆయన తెలిపింది. ఇండియన్ బాండ్, ఈక్విటీ మార్కెట్లపై యుఎస్ రెసిషన్ పెనుప్రభావం చూపుతుందని చెప్పారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఆధార్)కు నీలకంఠ్ మిశ్రా టైమ్ చైర్ పర్సన్‌గా కూడా గతంలో వ్యవహరించారు. ఒక ఇంటర్వ్యూలో ఆయన యుఎస్ ఆర్థికమాంద్యంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈయేడాదే అమెరికా ఆర్థికమాంద్యంలోకి జారుకో బోతోందని నీలకంఠ్ మిశ్రా తెలిపారు. యుఎస్ ఆర్థిక లోటు ఆ దేశ జిడిపిలో ఈ యేడాది మరో 4శాతం పెరిగిందని చెప్పారు. ఒకవేళ వచ్చే యేడాది అమెరికా తన ఆర్థిక లోటును ఫ్లాట్‌గా ఉంచినా, ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళుతుందని, ఇదే అతి పెద్ద సమస్య అని తెలిపారు. అమెరికా ఆర్థిక లోటు ఎక్కువగా ఉండడంతో యుఎస్ బాండ్లు కొనేందుకు ఎవరూ వేచిచూడడంలేదని చెప్పారు. కీలక వడ్డీరేట్లు పెరుగుతున్నాయని, దీంతో ప్రపంచవ్యాప్త డిమాండ్‌పై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కారణాల వల్ల రాబోయే ఆర్థిక మాంద్యం తీవ్ర స్థాయిలో ఉంటుందనిచెప్పారు. యుఎస్‌రెసిషన్ ఇండియాపై నాలుగు విధాలుగా తీవ్ర ప్రభావం చూపుతుందని నీలకంఠ్ మిశ్రా తెలి పారు. సర్వీస్ సెక్టార్ తీవ్రంగా ప్రభావితమవుతుందని ఆయన చెప్పారు. ఇప్పటికే సర్వీసెస్ వృద్ధి రేటు నెమ్మదించిందని, ఇది మరింత నెమ్మదిస్తుందని తెలిపారు. ఐటి సర్వీసెస్ ఇండస్ట్రీ, బిజినెస్ సర్వీసెస్ ఎగుమతులు దారుణంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. ఇండియన్ ఎక్స్ పోర్ట్స్‌లో 10 శాతం సర్వీసెస్ ఎక్స్‌పోర్ట్స్ ఉన్నాయని చెప్పారు. ఈ సెక్టార్ పతనమైతే మన జిడిపి ఒకశాతం వృద్ధి రేటును కోల్పోతుందని తెలిపారు. అమెరికా ఆర్థికమాంద్యం ప్రభావం చూపే రెండో విభాగం వస్తు ఎగుమతులని మిశ్రా చెప్పారు. మన దేశ వస్తు ఎగుమతులకు డిమాండ్ పడిపోతుందని తెలిపారు. ఇప్పటికే చైనా, జపాన్, యూరోపియన్ దేశాల ఎగుమతులపై ప్రభావం ప్రారంభమయిందని చెప్పారు. ఇండియా ఎదుర్కోబోయే అతిపెద్ద సమస్య, ఈ దేశాలన్నీ వాటి ఉత్పత్తులను ఇండియాలో డంప్ చేస్తాయని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ జనాభా కలిగిన ఇండియాలో డిమాండ్ ఎప్పటి మాదిరిగానే సాధారణంగా ఉంటే, ప్రపంచంలోని ప్రతి ఉత్పత్తిదారుడు తన ఉత్పత్తులను మన దేశంలో అమ్ముకోవడానికి ప్రయత్నిస్తాడని చెప్పారు. ఇది మన స్వదేశీ కంపెనీలపై పెను ప్రభావం చూపుతుందని అన్నారు. ఇది మూడో అతిపెద్ద సమస్య అని చెప్పారు. అమెరికా ఆర్థికమాంద్యం ఆ దేశ గవర్నమెంట్ బాండ్ల రాబడిపై ప్రభావం చూపుతుందని మిశ్రా తెలిపారు. దీని కారణంగా ఇతర దేశాల కేపిటల్ కాస్ట్ పెరుగుతుందని చెప్పారు. ఇండియాలోని అతిపెద్ద రుణగ్రహీతలైన ప్రఖ్యాత స్టీల్ కంపెనీల వంటి వాటికి ఇంతకుముందు డాలర్ లోన్స్ ఈజీగా దొరికేవని, గత 6 నుంచి 8నెలలుగా అలాంటి లోన్లు దొరకడంలేదని తెలిపారు. ఇది బాండ్ మార్కెట్స్, ఈక్విటీ మార్కెట్స్‌పై పెను ప్రభావంచూపుతుందని, ఈమార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతాయన్నారు. గత రెండు, మూడు రోజులుగా క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నాయని, ప్రజల ఆర్థికమాంద్య భయాలే దీనికి కారణమని మిశ్రా తెలిపారు. వచ్చే యేడాది మే-జూన్ సమయానికి ఆయిల్ ధరలు మరింత తగ్గే అవకాశం చెప్పారు.

## సుజ్లాన్ ఎనర్జీ ఇన్వెస్టర్లకు లాభాలే లాభాలు!

**ముంబై, అక్టోబరు 8:** కొత్త ఆర్థిక సంవత్సరం 2023-24 ప్రారంభమైన తర్వాత సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్ షేర్లు అప్‌ట్రెండ్‌లో ఉన్నాయి. మార్చి 2023 చివరి నాటికి సుజ్లాన్ షేర్లు ఒక్కొక్కటి రూ.7.05 స్థాయికి పడిపోయాయి. అప్పటి నుంచి సుజ్లాన్ షేర్ దర ఆకాశాన్ని తాకింది. గత ఆరు నెలల్లో ఈ పెన్నీ స్టాక్ భారతీయ స్టాక్ మార్కెట్ 2024లో డెలివరీ చేసిన దలాల్ స్ట్రీట్ మల్టీబ్యాగర్ స్టాక్‌లలో ఒకటిగా నిలిచింది. కంపెనీ తన రుణ తగ్గింపు ప్రణాళికలను ప్రకటించిన తర్వాత సుజ్లాన్ షేర్ల కొనుగోలు పెరిగింది. కంపెనీ ఇటీవల ఆర్డర్లు వచ్చాయని, ఇది కంపెనీ ఆర్డర్ బుక్, ఫండ మెంటల్స్‌ను బలోపేతం చేసిందని నిపుణులు చెబుతున్నారు. 'సుజ్లాన్ ఎనర్జీ షేరు ధర గత 5 నెలల్లో ఆకాశానికి చేరింది. ప్రస్తుతం 5 మే 2023న 8.65 రూపాయల నుంచి రూ.29.25కి చేరుకుంది. 238శాతం రాబడి ఇస్తోంది. ఈ చర్య ప్రధానంగా దాని రుణ తగ్గింపు ప్రణాళిక ద్వారా జరుగుతుంది. ఇటీవల పవన శక్తి ప్రాజెక్ట్ కోసం గణనీయమైన ఆర్డర్‌ను పొందింది. కొన్ని బ్రోకరేజ్ సంస్థలచే కొనుగోలుగా సిఫార్సు చేశాయి' అని




మార్కెట్ నిపుణులు వెల్లడించారు. సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్ భారతదేశ దేశీయ మార్కెట్‌లో 33 శాతం మార్కెట్ వాటాను పొందిందని తెలిపారు. ఇది ప్రపంచవ్యాప్తంగా 20 జిడబ్ల్యూ కార్యాచరణ పవన విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉందని వివరించారు. దాని పోటీదారుల కంటే చాలా ముందుందని పేర్కొన్నారు. దాని ప్రస్తుత ఆర్డర్‌బుక్ 1.5జిడబ్ల్యూ తదుపరి 2 సంవత్సరాలలో అమలు చేయడానికి మంచి సూచనగా ఉందన్నారు. రూ.2 వేల కోట్ల అర్హత కలిగిన సంస్థాగత ప్లేస్‌మెంట్ ద్వారా వచ్చిన మొత్తం టర్మ్ రుణాన్ని తిరిగి చెల్లించడం ద్వారా సుజ్లాన్ విజయవంతంగా రుణాన్ని తగ్గించుకుంది. ఈ క్రిసిల్ ఫలితంగా సానుకూల దృక్పథంతో దాని రేటింగ్‌లను బిబిబిప్లస్/ఎ2కి రెండు నాచ్‌లు అప్‌గ్రేడ్ చేసింది అని కూడా వివరించారు.

## కృత్రిమ మేధస్సుతో ఉద్యోగాలకు ధోకా లేదు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** గత కొంతకాలంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు ఎక్కువగా వినిపించాయి. ఉద్యోగులు కూడా ఏఐతో ప్రమాదమేనని భావించారు. అయితే క్రమంగా ఏఐపై ఉన్న ప్రతికూల అభిప్రాయం మారుతోంది. ఏఐ అందుబాటులోకి వస్తున్న కొద్దీ ఏఐ ఉద్యోగాలను భర్తీ చేయదని, వివిధ రంగాలు, ఉద్యోగాల్లో కొత్త పనితీరును, మార్గాలను ఆవిష్కరిస్తుందని ఆటోమేషన్ ఎనీవేర్ ఆధ్వర్యంలో జరిగిన ఇమేజిన్-2023 కార్యక్రమంలో నిపుణులు అభిప్రాయపడ్డారు. కొత్త టెక్నాలజీ ద్వారా ఉత్పాదకత మెరుగుపడుతుంది. ముఖ్యంగా ఉద్యోగులు, కార్మికుల పనితీరును ఏఐ మెరుగుపరుస్తుంది. ఇటీవల పరిణామాల్లో ఏఐ అందుబాటులోకి వచ్చిన తర్వాత కొన్ని సందర్భాల్లో ఉద్యోగుల ఉత్పాదకత పెరగ్గా, కొందరి ఉపాధి పోయింది. అయితే రానున్న రోజుల్లో కొత్త టెక్నాలజీ పూర్తిస్థాయి అందుబాటులోకి వస్తే కంపెనీలు ఉద్యోగులను తొలగించడం కంటే వారి నైపుణ్యాన్ని పెంచేదిగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు.




ఈ నేపథ్యంలో ఉద్యోగులు కూడా ఏఐ స్కిల్స్ మెరుగు పరుచుకుంటే ఉద్యోగాల విషయంలో ఆందోళనలు ఉండవని పేర్కొన్నారు.

## యేడాది చివరికల్లా 3 కోట్లకు 5జి యూజర్లు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** దేశంలో 5జి నెట్‌వర్క్ సేవలు అత్యంత వేగంగా పెరుగుతున్నాయి. ప్రధాన నగరాలతో పాటు చిన్న పట్టణాల్లోనూ ఆల్ట్రా హై-స్పీడ్ సేవలు విస్తరిస్తున్నాయి. ఇప్పటివరకూ దేశీయంగా దాదాపు కోటి మంది 5జి స్మార్ట్‌ఫోన్‌లను వినియోగిస్తున్నారు. యేడాది చివరి నాటికి ఇది మూడు కోట్లకు చేరుకోవచ్చని ఎరిక్సన్ అంచనా వేసింది. ఇటీవల 5జి సేవల వినియోగం గురించి ఎరిక్సన్ అంతర్జాతీయంగా సర్వే చేపట్టింది. ఆ నివేదిక ప్రకారం, భారత్‌లో 5జి ఇంటర్నెట్‌ను విడియో కాల్, మొబైల్ గేమ్‌లు, హై-క్వాలి టీ విడియో స్ట్రీమింగ్‌ల కోసం ఎక్కువగా వాడుతున్నారు. అమెరికా, చైనా, బ్రిటన్, దక్షిణ కొరియా లాంటి దేశాల కంటే భారత్‌లోవారానికి 2 గంటలు ఎక్కువ 5జి సేవలను ఉపయోగిస్తున్నారు. 15శాతం మంది గేమింగ్, విడియో స్ట్రీమింగ్, మ్యూజిక్ కోసం ఇప్పుడున్న ధరల కంటే 14 శాతం ఎక్కువ చెల్లించి 5 డేటా ప్లాన్‌లను వాడుతున్నారు. దేశంలో యూజర్లు 4జి తో పోలిస్తే 5జి నెట్‌వర్క్ విషయంలో 30శాతం




ఎక్కువ సంతృప్తికరంగా ఉన్నారని ఎరిక్సన్ సర్వేలో తేలింది. గతేడాది అక్టోబరు 1 నుంచి దేశీయంగా 5జి సేవలు మొదలయ్యాయి. ఈ యేడాది కాలంలో రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్‌కు మాత్రమే 5జి విభాగంలో ఆధిపత్యం కలిగి ఉన్నాయి. 5జి సేవలను వేగవంతం చేసేందుకు ఈ కంపెనీలు వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నాయని నివేదిక పేర్కొంది.

## లిమిట్స్ దాటి ట్రాన్సాక్షన్స్ చేసే వారికి అలర్ట్!

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ప్రస్తుతం దేశ వ్యాప్తంగా చెల్లింపులు పూర్తిగా డిజిటలైజేషన్ అవుతున్నాయి. దీంతో ఖర్చుచేసే ప్రతిరూపాయి ప్రభుత్వానికి లెక్కలు చేరుతున్నాయి. కాబట్టి పరిమితులకు మంచి చేసే ట్రాన్సాక్షన్లకు లెక్కలు చెప్పాల్సిందే, టాక్స్ కట్టాల్సిందే. ఆస్తుల క్రయ విక్రయాలు: ఎవరైనా వ్యక్తి రూ.30 లక్షలు లేదా అంత కంటే ఎక్కువ విలువైన ఆస్తులను కొన్నా లేకపోతే అమ్మినా సదరు లావాదేవీల వివరాలను రిజిస్ట్రేషన్ శాఖ పన్ను శాఖకు తెలియచేస్తుంది. అందువల్ల పెద్ద మొత్తాలతో ఇళ్లు, పొలాలు, స్థలాలు, అపార్ట్‌మెంట్స్ వంటి రియల్ ఎస్టేట్ ట్రాన్సాక్షన్లు చేసేవారు తప్పకుండా ఐటి అధికారుల రాడార్‌లో ఉంటారని గుర్తుంచుకోవాలి. వీటిని సదరు వ్యక్తుల ఐటి రిటర్న్‌లో క్రాస్ వెరిఫై చేస్తుంది. కాబట్టి వీటి వివరాలు మిస్ కాకుండా రిటర్న్ దాఖలులో వెల్లడించడం మంచిది. క్రెడిట్ కార్డు బిల్లులు: ప్రస్తుతం దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం రికార్డు స్థాయిలకు చేరుకుంటోంది. చాలా మంది ఇతరుల కోసం కూడా తమ కార్డులను ఇస్తున్నారు. ఎవరైనా కార్డుదారు ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలకు మించి క్రెడిట్ కార్డు




బిల్లులు చెల్లించినట్లయితే ఆ వివరాలను ఫైనాన్స్ సంస్థలు పన్ను శాఖకు అందిస్తాయని గుర్తుంచుకోండి. మీ పాన్ వివరాలతో ట్రాన్సాక్షన్లను ట్రాక్ చేస్తూనే ఉంటాయి. సేవింగ్స్ అకౌంట్ ట్రాన్సాక్షన్స్: ఆర్థిక సంవత్సరంలో సేవింగ్ అకౌంట్‌లో మొత్తం ట్రాన్సాక్షన్లవిలువ రూ.10 లక్షలకు మించితే వాటి వివరాలను తప్పకుండా ఐటి అధికారులు పరిశీలిస్తారు. ఇదే క్రమంలో వ్యాపారులు వినియోగించే కరెంట్ అకౌంట్‌లో యేడాదిలో రూ.50 లక్షలకు మించి జరిగే లావాదేవీలను పరిశీలిస్తారు. ఇదే క్రమంలో రూ.10 లక్షలకు మించి చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కూడా పన్ను అధికారుల పరిశీలన తప్పకుండా ఉంటుంది. పెట్టుబడులు: ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్న ఐటి అధికారులు మనం చేసే షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, బాండ్స్ వంటి పెట్టుబడుల విషయంలో రూ.10 లక్షలకు మించి చేసే ట్రాన్సాక్షన్లను పరిశీలిస్తారు. దీనికి తోడు విదేశీ కరెన్సీల్లో రూ.10 లక్షలకు మించి చేసే అన్ని ట్రాన్సాక్షన్ల విషయంలో వివరాలు అందించాల్సి ఉంటుంది. పన్ను చెల్లింపులకు రిటర్న్ ఫైల్ చేసే సమయంలో పైన పేర్కొన్న ట్రాన్సాక్షన్ వివరాలు అందించకపోతే తప్పకుండా నోటీసులు వస్తాయి. వీటికి సంబంధించి ఆదాయ వనరులను సంబంధిత రుజువులను టాక్స్ పేయర్స్ చూపించాల్సి ఉంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14